www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ఆదివారం | 1-9-2024 | పేజీలు: 14+ 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 138 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి తె. 5.22 తదుపరి అమావాస్య నక్షత్రం: ఆశ్లేష రా. 9.49 తదుపరి మఖ వర్జ్యం: ఉ. 9.36-11.21; దుర్ముహూర్తం: సా. 4.46-5.35; అమృతఘడియలు: రా. 8.04-9.49; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.04; సూర్యాస్తమయం: 6.24 | హైదరాబాద్ సిటీ
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గ్రూప్-3 దరఖాస్తులను సవరించుకోండి

అభ్యర్థులకు మరో అవకాశం ఇచ్చిన టీజీపీఎస్సీ

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-3 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ వివరాలను సవరించుకునేందుకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) అవకాశం కల్పించింది. సెప్టెంబరు 2న ఉదయం 10 గంటల నుంచి 6వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందని, ఇప్పటి వరకు నమోదు చేసిన వివరాల్లో తప్పులుంటే 'ఎడిట్ ఆప్షన్' ద్వారా సవరించుకోవాలని కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్ ఓ ప్రకటనలో కోరారు. కాగా, ఉద్యాన శాఖ సంచాలకుల కార్యాలయం పరిధిలో దివ్యాంగుల కేటగిరీలో ఉద్యాన అధికారి పోస్టుకు అభ్యర్థిని టీజీపీఎస్సీ ప్రాథమికంగా ఎంపిక చేసింది. ఎంపికైన అభ్యర్థి వివరాలు కమిషన్ వెబ్‌సైట్‌లో ఉన్నట్టు పేర్కొంది.

స్పోర్ట్స్



సిక్సర్ల పిడుగులు

- ప్రియాన్ష్ ఆరు బంతుల్లో ఆరు
- బదోని 19 సిక్స్‌లతో విజృంభణ
- ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో రికార్డుల మోత

న్యూఢిల్లీ: ప్రియాన్ష్ ఆర్య (50 బంతుల్లో 120) ఆరు బంతుల్లో ఆరు సిక్సర్ల అరుదైన ఫీట్‌తోపాటు ఆయుష్ బదోని (55 బంతుల్లో 165) 19 సిక్స్‌లతో ఊచకోత కోయడంతో.. ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో రికార్డుల మీద రికార్డులు బద్దలయ్యాయి. శనివారం నార్త్ ఢిల్లీ స్ట్రయికర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆర్య, బదోని రెండో వికెట్‌కు 103 బంతుల్లో 286 పరుగుల అత్యధిక భాగస్వామ్యం నమోదు చేయడంతో సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్జ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 308 పరుగుల భారీ స్కోరు చేసింది. టీ20ల్లో ఇది రెండో అత్యధిక స్కోరు. ఆర్య 12వ ఓవర్‌లో స్పిన్నర్ భరద్వాజ్ బౌలింగ్‌లో వరుస ఆరు బంతుల్లో ఆరు సిక్స్‌లు బాదాడు. ఈ క్రమంలో దేశవాళీ క్రికెట్‌లో ఈ ఫీట్ సాధించిన నాలుగో ఆటగాడిగా 23 ఏళ్ల ఆర్య నిలిచాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో యువరాజ్, పొలార్డ్, దీపేంద్ర సింగ్ (రెండుసార్లు) ఈ ఘనత సాధించారు. కాగా, ఐపీఎల్ ఆటగాడు బదోని ఏకంగా 19 సిక్స్‌లతో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. వెస్టిండీస్ గ్రేట్ క్రిస్ గేల్, ఎస్తోనియా ఆటగాడు సాహిల్ చౌహాన్ ఓ టీ20 మ్యాచ్‌లో అత్యధికంగా 18 సిక్స్‌లు కొట్టారు. వీరిని 24 ఏళ్ల బదోని అధిగమించాడు. అయితే, 309 పరుగుల లక్ష్య ఛేదనలో నార్త్ ఢిల్లీ ఓవర్లన్నీ ఆడి 196/8 స్కోరు మాత్రమే చేసి ఓటమిపాలైంది.



మహిళల కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో రన్నరప్‌గా నిలిచిన ట్రినిబాగో నైట్‌రైడర్స్ జట్టు ప్లేయర్లు శిఖా పాండే, జెమీమా రోడ్రిగ్స్, తెలంగాణమ్మాయి ప్రణవి చంద్ర (మధ్య). ఈ లీగ్‌ చాంపియన్‌గా బార్బడోస్ రాయల్స్ టీమ్ విజేతగా నిలిచింది.

పారిస్ పారాలింపిక్స్‌లో వరుసగా రెండోరోజూ భారత్ పతకంతో మురిసింది. షూటర్ రుబీనా ఫ్రాన్సిస్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో కాంస్యం అందుకుంది. దీంతో భారత్ ఖాతాలో ఐదో పతకం చేరింది. ఇక ఆర్చరీలో ఆశలు రేపిన 17 ఏళ్ల సంచలనం శీతల్ దేవి, సరితా దేవిల పోరాటం ముగిసింది. ప్రీక్వార్టర్స్‌లో కేవలం పాయింట్ తేడాతో శీతల్ వెనుదిరగగా.. సరిత క్వార్టర్స్‌లో ఓటమిపాలైంది. తెలుగు క్రీడాకారులైన రోయర్ నారాయణ, సైక్లిస్ట్ షేక్ అర్షద్ పేలవ ప్రదర్శనతో నిరాశపరిచారు.


భళా.. రుబీనా

కాంస్యం గెలిచిన షూటర్

శీతల్‌కు నిరాశ

పారాలింపిక్స్

భారత్ ఖాతాలో ఐదో పతకం



పారిస్: పారాలింపిక్స్‌లో భారత షూటర్లు హవా సాగిస్తున్నారు. వీరి గురి తప్పని తూటా కారణంగా మూడో రోజు కూడా పతక భాగ్యం కలిగింది. మహిళల 10మీ. ఎయిర్ పిస్టల్ ఎస్‌హెచ్1లో షూటర్ రుబీనా ఫ్రాన్సిస్ కాంస్యం అందుకుంది. ఇప్పటికే షూటింగ్‌లో అవనికి స్వర్ణం, మనీశ్‌కు రజతం, మోనాకు కాంస్యం దక్కిన విషయం తెలిసిందే. తాజాగా ఆ జాబితాలో 25 ఏళ్ల రుబీనా కూడా చేరింది. ఓవరాల్‌గా భారత్ ఖాతాలో ఐదు పతకాలు చేరగా ఇందులో నాలుగు షూటర్ల ద్వారానే రావడం విశేషం. డిఫెండింగ్ చాంపియన్‌తో పాటు వరల్డ్ రికార్డు షూటర్ పాల్గొన్న శనివారం జరిగిన ఫైనల్లో రుబీనా కఠిన పోటీని తట్టుకుంటూ 211.1 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. స్టేజి 1లో 10 షాట్లు ముగిసేసరికి మూడో స్థానంలో నిలిచింది. అయితే 14వ షాట్ తర్వాత నాలుగో స్థానానికి పడిపోయింది. ఈ దశలో ఒత్తిడికి లోనుకాకుండా చివరి సిరీస్‌లో 9.2, 8.9 స్కోరుతో కంచు మోత మోగించింది. అంతకుముందు క్వాలిఫై రౌండ్‌లో తను 556 పాయింట్లతో ఏడో స్థానంలో నిలిచి తుది పోరుకు అర్హత సాధించింది. టోక్యో పారాగేమ్స్‌లోనూ రుబీనా ఫైనల్‌కు వెళ్లినప్పటికీ ఏడో స్థానంలో నిలిచి వెనుదిరిగింది. మరోవైపు పురుషుల 10మీ. ఎయిర్ రైఫిల్ స్టాండింగ్ ఎస్‌హెచ్1లో స్వరూప్ ఉన్హాల్కర్ క్వాలిఫై ఈవెంట్‌లో 14వ స్థానంలో నిలిచి నిరాశపర్చాడు.

స్థిరంగా నిల్చోలేని స్థితి నుంచి..

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌కు చెందిన రుబీనా ఫ్రాన్సిస్‌కు జన్మతహా పాదాలు వంకరగా ఉండేవి. దాంతో సరిగ్గా నిలుచోలేకపోయేది. రుబీనా బాల్యం నుంచే షూటింగ్ పట్ల ఆసక్తి పెంచుకుంది. అయితే, షూటర్ గురి కుదరాలంటే స్థిరంగా నిలుచోవడం ఎంతో ముఖ్యం. కానీ సరిగ్గా నిలుచోలేని రుబీనా షూటింగ్‌లో రాణిస్తుందా అన్న అనుమానాలు ఉండేవి. ఇక, మెకానిక్ అయిన తండ్రి సిమోన్ ఫ్రాన్సిస్ ఆదాయం అంతంతమాత్రంగా ఉండేది. దాంతో కూతురుని షూటింగ్‌లో ప్రోత్సహించడానికి తొలుత వెనుకాడినా, రుబీనా పట్టుదల చూసి ఆమెను షూటర్‌గా తీర్చిదిద్దాలని సిమోన్ నిర్ణయించుకున్నాడు. 2015లో జాతీయ పారా షూటింగ్ చీఫ్ కోచ్ జై ప్రకాష్ నౌతియాల్ ఆమెకు మార్గదర్శనం చేశాడు. రుబీనా సరిగ్గా నిలుచునేందుకు అతడు ప్రత్యేకంగా బూట్లు తయారు చేయించాడు. ఆపై నిటారుగా నిలుచొని షూట్ చేయడం మరో సవాలుగా నిలిచింది. అందుకోసం రుబీనాతోపాటు నౌతియాల్ ఎంతో శ్రమించాడు. నౌతియాల్ పర్యవేక్షణలో భోపాల్‌లోని షూటింగ్ అకాడమీలో ప్రఖ్యాత కోచ్ జస్పాల్ రాణా తమ్ముడు సుభాష్ ఆధ్వర్యంలో రుబీనా శిక్షణ పొందింది. 2017లో పుణెలోని గగన్ నారంగ్ అకాడమీ 'గన్ ఫర్ గ్లోరీ'లో ఆమె తన ప్రతిభకు మెరుగులు దిద్దుకుంది. 2021 వరల్డ్ కప్ ద్వారా పారిస్‌బెర్త్ దక్కించుకున్న 25 ఏళ్ల రుబీనా.. ఇప్పుడు పారాలింపిక్ పతకంతో తన ఖ్యాతిని పెంచుకుంది.

విఫలమైన తెలుగు అథ్లెట్లు

పారాగేమ్స్‌లో తెలుగు అథ్లెట్లు నారాయణ, అర్షద్ ఆకట్టుకోలేకపోయారు. ఏపీకి చెందిన సైక్లిస్ట్ షేక్ అర్షద్ పురుషుల 1000 మీటర్ల టైమ్ ట్రయల్ సీ1-3 క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో ఆఖరి, 17వ స్థానంలో నిలిచాడు. శుక్రవారం జరిగిన 3000 మీటర్ల సీ2 ఈవెంట్‌లోనూ అర్షద్ ఆఖరి స్థానం (9)లో నిలిచిన విషయం తెలిసిందే. ఇక మహిళల 500 మీటర్ల టైమ్ ట్రయల్ సీ1-3లో జ్యోతి గడెరియా కూడా 11వ స్థానంలో ఆఖరున నిలిచింది. కాగా.. అర్షద్, జ్యోతి రోడ్ సైక్లింగ్ ఈవెంట్‌లోనూ పోటీపడనున్నారు. ఇక రోయింగ్‌లో మిక్స్‌డ్ పీఆర్3 డబుల్స్ స్కల్స్ ఈవెంట్‌లో అనిత-నారాయణ జోడీ మెడల్ రౌండ్‌కు అర్హత సాధించలేకపోయింది. రెపిచేజ్2లో ఈ జంట 7 నిమిషాల 54.33 సెకన్ల టైమింగ్‌తో మూడో స్థానంలో నిలిచి ఫైనల్ బికి చేరింది. దీంట్లో ఈ ద్వయం 7 నుంచి 12వ స్థానం కోసం పోటీపడనుంది.

పాయింట్ తేడాతో..


శీతల్

అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రదర్శనతో పారాగేమ్స్‌లోనూ పతక ఆశలు రేపిన 17 ఏళ్ల టీనేజ్ ఆర్చర్ శీతల్ దేవికి నిరాశే ఎదురైంది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగం ప్రీక్వార్టర్స్‌లో ఆమె కేవలం పాయింట్ తేడాతో ఇంటిముఖం పట్టాల్సి వచ్చింది. చిలీకి చెందిన మరియానా జునిగ చేతిలో శీతల్ 137-138 తేడాతో ఓడింది. తొలి సెట్‌ను 10,10 పాయింట్లతో దీటుగా ఆరంభించిన శీతల్ గెలుపు దిశగానే సాగింది. అటు ప్రత్యర్థి కూడా గట్టిపోటీ ఇవ్వడంతో నాలుగు సెట్లు ముగిసేసరికి 111 స్కోరుతో ఇరువురూ సమంగా నిలిచారు. ఇక చివరిదైన ఐదో సెట్‌లో శీతల్ 8,10,8తో 26 పాయింట్లు సాధించగా, జునిగ 27 పాయింట్లతో విజేతగా నిలిచింది. మరోవైపు ఇదే విభాగంలో క్వార్టర్స్ చేరిన భారత ఆర్చర్ సరితా దేవి 140-145తో వరల్డ్ చాంపియన్ ఒజ్నూర్ (తుర్కియే) చేతిలో ఓటమిపాలైంది.



యూఎస్ ఓపెన్

జొకోకు ఝలక్

మూడో రౌండ్‌లో ఆసీస్ ఆటగాడి చేతిలో ఓటమి


అలెక్సి

న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో సంచలనాలపై సంచలనాలు చోటుచేసుకుంటున్నాయి. మొన్న..టైటిల్ ఫేవరెట్ కార్లోస్ అల్కారజ్‌కు చుక్కెదురైతే..తాజాగా డిఫెండింగ్ చాంపియన్ నొవాక్ జొకోవిచ్‌కు షాక్ తగిలింది. రికార్డు స్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేసిన 37 ఏళ్ల సెర్బియా దిగ్గజ ఆటగాడిని ఆస్ట్రేలియాకు చెందిన అలెక్సి పాపిరిన్ కంగుతినిపించాడు. శనివారం తెల్లవారుజామున జరిగిన పురుషుల సింగిల్స్ మూడో రౌండ్ మ్యాచ్‌లో 28వ సీడ్ పాపిరిన్ 6-4, 6-4, 2-6, 6-4తో జొకోవిచ్‌పై విజయం సాధించాడు. మ్యాచ్‌లో నొవాక్ ఏకంగా 14 డబుల్‌ఫాల్ట్‌లు చేయడం గమనార్హం. తొలి రెండు సెట్లు కోల్పోయిన జొకో..మూడో సెట్లో గెలుపొందడంతో అతడిలో పోరాట యోధుడు విజృంభించి మ్యాచ్‌ను సొంతం చేసుకుంటాడేమో అనిపించింది. కానీ తన ఆట మరీ దిగజారడంతో నొవాక్‌కు ఓటమి తప్పలేదు. ఇక..మూడోసీడ్ అల్కారజ్ రెండో రౌండ్‌లోనే ఓడిన సంగతి తెలిసిందే. మిగతా స్టార్లలో 4వ సీడ్ జ్వెరెవ్ 5-7, 7-5, 6-1, 6-3తో ఎచెవెరీని, 8వ సీడ్ కాస్పెర్ రూడ్ 6-7 (7), 3-6, 6-0, 6-3, 6-1తో షాంగ్‌ని, 9వ సీడ్ డిమిత్రోవ్ 6-3, 6-3, 6-1తో గ్రీక్‌స్పూర్‌ని, 12వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ 6-3, 6-4, 6-2తో కొమెసనాని, 20వ సీడ్ టియఫో 4-6, 7-5, 6-7 (5), 6-4, 6-3తో 13వ సీడ్ బెన్ షెల్టన్‌ని ఓడించి ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. మహిళల సింగిల్స్‌లో 2వ సీడ్ సబలెంకా 2-6, 6-1, 6-2తో అలెగ్జాండ్రోవాపై, 5వ సీడ్ పౌలిని 6-3, 6-4తో పుతిన్‌త్సెవాపై, 6వ సీడ్ పెగులా 6-3, 6-3తో బౌజాస్‌పై, 33వ సీడ్ మెర్టెన్స్ 6-7 (7), 7-5, 6-4తో 14వ సీడ్ మాడిసన్ కీస్‌పై విజయంతో నాలుగో రౌండ్‌కు చేరారు.

2017 తర్వాత తొలిసారి..

ఒక ఏడాది కనీసం ఒక్క గ్రాండ్‌స్లామ్ లేకుండా ముగించడం 2017 తర్వాత జొకోకు ఇదే తొలిసారి. అంతకుముందు 2010 సీజన్‌నూ నొవాక్ ఇలాగే ముగించాడు. ఇక..ప్రపంచ టెన్నిస్ 'బిగ్ త్రీ' జొకోవిచ్, నడాల్, ఫెడరర్‌లో ఏ ఒక్కరూ గ్రాండ్‌స్లామ్ గెలవకుండా ఉండడం 2002 తర్వాత ఇదే మొదటిసారి.



భారత్ అండర్-19 జట్టులో జూనియర్ ద్రవిడ్

న్యూఢిల్లీ: భారత మాజీ చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ కుమారుడు సమిత్ ద్రవిడ్‌కు జాతీయ అండర్-19 జట్టులో చోటు లభించింది. స్వదేశంలో ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగే మల్టీ ఫార్మాట్ సిరీస్ కోసం టీమిండియాను బీసీసీఐ శనివారం ప్రకటించింది. పుదుచ్చేరిలో సెప్టెంబరు 21, 22, 26వ తేదీల్లో మూడు వన్డేల సిరీస్ జరగనుండగా.. చెన్నై వేదికగా రెండు నాలుగో రోజుల మ్యాచ్‌లు సెప్టెంబరు 30, అక్టోబరు 7న మొదలవుతాయి. వన్డే సిరీస్‌కు అమ్మాన్, నాలుగు రోజుల సిరీస్‌కు సోహమ్ సారథులుగా వ్యవహరిస్తారు. పేస్ బౌలింగ్ ఆల్‌రౌండరైన 18ఏళ్ల సమిత్‌కు రెండు ఫార్మాట్ల జట్లలోనూ చోటు లభించింది. కూచ్ బెహార్ ట్రోఫీని కర్ణాటక తొలిసారి నెగ్గడంలో సమిత్ కీలకపాత్ర పోషించాడు. ఆ టోర్నీలో 8 మ్యాచ్‌ల్లో 362 రన్స్ చేసిన అతడు, 16 వికెట్లు తీశాడు.

పాక్ 274 ఆలౌట్

రావల్పిండి: ఆఫ్ స్పిన్నర్ మెహ్దీ హసన్ (5/61) తిప్పేయడంతో.. పాకిస్థాన్‌తో రెండో టెస్ట్‌లో బంగ్లాదేశ్ కొంత పైచేయి కనబర్చింది. మ్యాచ్‌కు రెండోరోజైన శనివారం పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 274 రన్స్‌కు ఆలౌటైంది. ఓపెనర్ సాయిమ్ అయూబ్ (58), కెప్టెన్ షాన్ మసూద్ (57), సల్మాన్ ఆఘా (54) రాణించారు. టస్కిన్ 3 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన బంగ్లా.. శనివారం ఆట ముగిసేసరికి వికెట్ నష్టపోకుండా 10 రన్స్ చేసింది. వర్షంతో తొలిరోజు ఆట పూర్తిగా రద్దయింది.

రూట్ సూపర్ సెంచరీ

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 251

లంక లక్ష్యం 483

లండన్: శ్రీలంకతో రెండో టెస్టులో జో రూట్(103) రెండో ఇన్నింగ్స్‌లోనూ సెంచరీ సాధించడంతో ఇంగ్లండ్ 251 పరుగులకు ఆలౌటైంది. ఈ క్రమంలో ఇంగ్లండ్ తరఫున ఎక్కువ టెస్టు శతకాలు (34) సాధించిన బ్యాటర్‌గా రూట్ నిలిచాడు. ఆ తర్వాత 483 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన లంక మూడోరోజు శనివారం ఆట ముగిసేసరికి 2 వికెట్లకు 53 రన్స్ చేసింది. విజయానికి లంక ఇంకా 430 పరుగుల దూరంలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 427, లంక 196 రన్స్ చేశాయి.

బిజినెస్

ప్రతి రెండు షేర్లకు ఒక బోనస్ షేరు

ఎన్‌బీసీసీ ఇండియా

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఎన్‌బీసీసీ (ఇండియా) లిమిటెడ్... వాటాదారులకు బంపర్ బొనాంజా ప్రకటించింది. అర్హులైన వాటాదారులకు ప్రతి రెండు షేర్లకు రూపాయి ముఖ విలువతో కూడిన ఒక బోనస్ షేరు (1:2 నిష్పత్తి)ను జారీ చేయనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు బోర్డు ఆమోదం లభించిందని పేర్కొంది. ఇందుకోసం తన దగ్గర ఉన్న రూ.90 కోట్ల ఫ్రీ రిజర్వ్ మొత్తాలను వినియోగించనున్నట్లు ఎన్‌బీసీసీ తెలిపింది. వచ్చే కంపెనీ వార్షిక సర్వసభ్య సమావేశంలో వాటాదారుల అనుమతికి లోబడి ఈ షేర్ల జారీ ఉంటుందని పేర్కొంది. కాగా అర్హులైన వాటాదారులకు బోనస్ షేర్ల జారీకి అక్టోబరు 7వ తేదీని రికార్డు తేదీగా ఖరారు చేసినట్లు తెలిపింది. బోనస్ షేర్ల జారీ ద్వారా వాటాదారుల విలువ పెరగటమే కాకుండా కంపెనీ పట్ల వారికి మరింత విశ్వాసం పెరుగుతుందని ఎన్‌బీసీసీ సీఎండీ కేపీ మహదేవ స్వామి తెలిపారు. 2017లో కూడా కంపెనీ 1:2 నిష్పత్తిలోనే బోనస్ షేర్లను జారీ చేసింది. ప్రస్తుతం కంపెనీ ఆర్డర్ బుక్ రూ.81,300 కోట్లుగా ఉంది.

ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు చిప్‌సెట్ల కొరత

- పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా పెరిగిన సరఫరా అవాంతరాలు
- ఈసారి పండగ విక్రయాలపై ప్రభావం!!



న్యూఢిల్లీ: టీవీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు వంటి ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల (కన్స్యూమర్ డ్యూరబుల్స్)ను తయారీ చేసే కంపెనీలకు చిప్ సెట్ల కొరత మొదలైంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో తలెత్తిన సరఫరా అవాంతరాల కారణంగా అంతర్జాతీయంగా చిప్‌సెట్లకు ఆకస్మిక కొరత ఏర్పడిందని, దాంతో ఉత్పత్తుల తయారీ జాప్యమవుతోందని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. ఈ పరిణామం పండగ సీజన్‌లో తమ ఉత్పత్తుల లభ్యత, విక్రయాలపై ప్రభావం చూపవచ్చని వారు అభిప్రాయపడ్డారు. చిప్ సెట్ల సరఫరా మళ్లీ సాధారణ స్థితికి ఎప్పుడు చేరుకుంటుందని అంచనాకు రాలేకపోతున్నట్లు ఎస్‌పీపీఎల్ సీఈఓ అవనీత్ సింగ్ మార్వా అన్నారు. అంతర్జాతీయ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ థాంప్సన్ ఉత్పత్తులను భారత్‌లో విక్రయించేందుకు ఎస్ఎస్‌పీఎల్ ఎక్స్‌క్లూజివ్ లైసెన్స్ కలిగి ఉంది.

ద్వితీయార్థంపైనే ఆశలు: లోక్‌సభ ఎన్నికల కారణంగా ఈ ఏడాది ప్రథమార్థంలో కన్స్యూమర్ డ్యూరబుల్స్‌కు గిరాకీ అంతంత మాత్రంగానే నమోదైంది. ద్వితీయార్థంలో, ముఖ్యంగా పండగ సీజన్‌లో డిమాండ్ 40 శాతం వరకు పెరగవచ్చని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కానీ, చిప్ సెట్ల కొరత కారణంగా డిమాండ్‌కు తగ్గ స్థాయిలో మార్కెట్లోకి ఉత్పత్తులను సరఫరా చేయలేకపోవచ్చన్నారు. దాంతో గిరాకీని సొమ్ము చేసుకునే అవకాశం కోల్పోవచ్చని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. అయితే, పండగ సీజన్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఉత్పత్తుల నిల్వలను ఇప్పటికే పెంచుకున్న కంపెనీల పైన మాత్రం చిప్‌సెట్ల కొరత ప్రభావం ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నాయి.

ఈ ఏడాదిలో ఇప్పటివరకు 7.20 లక్షల వాహనాల రీకాల్



ముంబై: ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఆటోమొబైల్ కంపెనీలు దాదాపు 7.20 లక్షల వాహనాలను రీకాల్ చేశాయి. అందులో 96 శాతం ద్విచక్ర వాహనాలేనని భారత వాహన తయారీదారుల సమాఖ్య (సియామ్) తాజా డేటా ద్వారా వెల్లడైంది. అంతేకాదు, ఈ ఏడాది మొదటి 8 నెలల్లోనే కంపెనీలు వెనక్కి రప్పించిన వాహనాల సంఖ్య.. గత రెండు సంవత్సరాల్లో రీకాల్ చేసిన వెహికిల్స్ కంటే అధికం. 2023లో 2.85 లక్షలు, 2022లో 2.89 లక్షల వాహనాలను కంపెనీలు వెనక్కి రప్పించాయి. గడిచిన కొన్నేళ్లలో వెహికిల్ రీకాల్స్ అనూహ్యంగా పెరగడానికి 2021లో కేంద్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించి కఠిన విధానాన్ని అమలులోకి తేవడమే ప్రధాన కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. గడిచిన కొన్నేళ్లలో కార్ల విక్రయాలు భారీగా వృద్ధి చెందినప్పటికీ, దేశీయ వాహన మార్కెట్లో టూవీలర్ విభాగానిదే 81 శాతం వాటా. అందుకే వాహన రీకాల్స్‌లోనూ ద్విచక్ర వాహనాల సంఖ్యే అధికంగా ఉంటోంది. కాగా, కార్ల విభాగంలో 55 శాతం మార్కెట్ వాటా కలిగిన మారుతి సుజుకీ, హ్యుండయ్ మోటార్ ఈ ఏడాది దాదాపు 12,000 వాహనాలను వెనక్కి పిలిపించాయి. సాంకేతిక లేదా ఇతర లోపాలను సరిదిద్దేందుకు ఆటోమొబైల్ కంపెనీలు కస్టమర్ల వద్దనున్న వాహనాలను వెనక్కి రప్పించడం (రీకాల్) పరిపాటే. బ్రాండ్ పరపతిని, కస్టమర్లలో తమ పట్ల ఉన్న నమ్మకాన్ని కాపాడుకునేందుకు ఆటోమొబైల్ కంపెనీలు రీకాల్ చేసిన వాహనాల్లోని లోపాలను ఉచితంగా సరిదిద్ది, తిరిగి కస్టమర్లకు అందజేస్తుంటాయి.

2024లో టాప్ రీకాల్స్

కంపెనీ	ఏయే మోడళ్లు	ఎన్ని యూనిట్లు
సుజుకీ మోటార్‌సైకిల్	యాక్సెస్ 125 అవెనిస్ 125 బర్గ్‌మన్ 125	3,88,500
యమహా మోటార్స్	రే జెడ్ఆర్ ఎఫ్ఐ 125 ఫాసినో సీఐ 125	3,00,725
మెర్సిడెస్ బెంజ్	జీఎల్ఈ 450, ఈక్యూఎస్ జీఎల్‌సీ, ఏఎంజీ ఎస్ఎల్, ఏఎంజీ జీఎల్ఏ, ఎస్, ఈ	15,167
హ్యుండయ్	ఐయానిక్ 5, క్రెటా, వెర్నా	9,442
టయోటా కిర్లోస్కర్	ల్యాండ్ క్రూయిజర్, గ్లాంజా లెక్సస్ ఆర్ఎక్స్, లెక్సస్ ఎన్ఎక్స్	2,735
మారుతి సుజుకీ	ఆల్టో కే 10	2,555



హెచ్ఏఎల్ సీఎండీగా డీకే సునీల్

బెంగళూరు: ప్రభుత్వ రంగంలోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (అదనపు బాధ్యతలు)గా డీకే సునీల్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈయన హెచ్ఏఎల్ డైరెక్టర్ (ఇంజనీరింగ్, ఆర్ అండ్ డీ)గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు సీఎండీగా విధులు నిర్వరించిన సీబీ అనంతకృష్ణన్ పదవీ విరమణ చేయటంతో ఆయన స్థానంలో సునీల్ శనివారం నాడు అదనపు బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో పట్టా పొందిన సునీల్ 1987లో హెచ్ఏఎల్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా చేరారు. అలాగే ఐఐటీ మద్రాస్ నుంచి ఎయిర్‌క్రాఫ్ట్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ పట్టాను అందుకున్నారు. గడిచిన 37 ఏళ్లలో కంపెనీలోని వివిధ విభాగాల్లో ఈయన కీలక బాధ్యతలను నిర్వర్తించారు.

- ఎడ్యుకేషన్ టెక్నాలజీ ప్లాట్‌ఫామ్ స్కూల్‌నాట్.కామ్.. స్కూల్ ఈఆర్‌పీ సొల్యూషన్స్‌లో కీలకంగా ఉన్న పాఠశాల.ఇన్‌ను చేజిక్కించుకుంది. ఎడ్‌టెక్ పరిశ్రమలో కీలకమైన సంస్థగా ఎదిగేందుకు ఈ కొనుగోలు దోహదపడుతుందని పేర్కొంది. అంతేకాకుండా ప్రస్తుతమున్న 600కు పైగా క్లయింట్స్‌కు అదనంగా 150 మంది క్లయింట్స్ వచ్చి చేరనున్నారని తెలిపింది.
- బెంగళూరుకు చెందిన డైరెక్ట్ టు కన్స్యూమర్ (డీ2సీ) బ్రాండ్ వెల్‌బీ ఫుడ్స్.. హైదరాబాద్‌కు తన కార్యకలాపాలు విస్తరించింది. విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లోని 9,000కు పైగా స్టోర్లలో కంపెనీకి చెందిన క్లీన్ లేబుల్ స్నాక్స్ ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. అంతేకాకుండా హైదరాబాద్ మార్కెట్లో 50 శాతం వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి దక్షిణాది మార్కెట్లో 25 వేలకు పైగా స్టోర్లలో తన ఉత్పత్తులు అందుబాటులో ఉంచాలని వెల్‌బీ లక్ష్యంగా పెట్టుకుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,040 ▼	66,950 ▼	92,000 ▼
ముంబై	72,000 ▲	65,950 ▲	85,070 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



సెప్టెంబరు 1వ తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	505
వరంగల్	497	గోదావరి	505
చిత్తూరు	508	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 72	


ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	99	విజయవాడ	103
వరంగల్	99	గుంటూరు	103
కరీంనగర్	99	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	99	చిత్తూరు	92
కర్నూలు	99	నెల్లూరు	92
విశాఖపట్నం	99	అనంతపురం	98
గోదావరి	103		

లైన్ సేల్స్ చేస్తున్నారా?

ఇదీ GST


రాంబాబు గొండాల

వ్యాపారస్తులు తమ అమ్మకాలను పెంచుకోవటానికి రకరకాల వ్యూహాలను అమలు చేస్తుంటారు. లైన్ సేల్స్ కూడా అటువంటిదే. దీనినే డైరెక్ట్ సేల్ అని కూడా వ్యవహరిస్తారు. అంటే షాపుల ద్వారా కాకుండా కొనుగోలు దారుల ఇళ్ల వద్దకు వచ్చి అమ్మకాలు జరపటం. నిజానికి లైన్ సేల్ అనేది కొత్త విషయమేమీ కాదు. సైకిళ్ల మీద బట్టల మూట పెట్టుకుని ఊరూరు తిరుగుతూ అమ్మకాలు చేయటం, ఇళ్ల ముందుకు ఆటోలో వచ్చి స్టీల్, ప్లాస్టిక్ సామాన్లు అమ్మటం ఇదే కోవలోకి వస్తుంది. అయితే ఇలా చిరు వ్యాపారస్తులే కాకుండా పెద్ద వ్యాపారస్తులు కూడా ఈ విధమైన లైన్ సేల్స్ చేస్తుంటారు. ఇలా లైన్ సేల్ చేసే వారికి కొనుగోలుదారుని చిరునామా, అమ్ముడుపోయే సరుకు విలువ ముందుగా తెలియదు. అందుకే జీఎస్‌టీలో లైన్ సేల్ చేసే వారికి ఒక సమస్య ఉంది. అదే ఈ-వే బిల్ ఎలా తయారు చేయాలనేది. ఏదేనీ మోటార్ వాహనంలో రూ.50,000 విలువ మించి సరుకు రవాణా చేస్తుంటే ఈ-వే బిల్ తప్పనిసరి. అలాగే ఈ-వే బిల్ కావాలంటే కొనుగోలుదారుని చిరునామా, అమ్మకపు విలువ తెలియాలి. మరి ఇలాంటి సందర్భంలో ఈ- వే బిల్ ఎలా జారీ చేయాలో తెలుసుకుందాం.

వాస్తవానికి ఈ లైన్ సేల్ అనేది కేవలం ఇళ్ల వద్దకు వచ్చి వ్యాపారం చేసే వారికే పరిమితం కాదు. బట్టలు, ఫ్యాన్సీ, ఎఫ్ఎంసీజీ ఉత్పత్తిదారులు తమ ఉత్పత్తులను నేరుగా షాపుల వద్దకు తీసుకుని వెళ్లి విక్రయిస్తుంటారు. ఈ లైన్ సేల్ చేసే వారి సమస్యను దృష్టిలో పెట్టుకుని ఈ-వే బిల్ పోర్టల్‌లో దీనికి సంబంధించి ఒక సదుపాయం కల్పించారు. ఈ లైన్ సేల్ చేసే వారు.. ఇన్వాయిస్ బదులుగా డెలివరీ చలాన్ జారీ చేయాల్సి ఉంటుంది. సరుకు అమ్ముడు పోయినప్పుడు కొనుగోలుదారుని పేరిట ఇన్వాయిస్ ఇవ్వాలి. ఇది వీలుని బట్టి మాన్యువల్‌గా గానీ, హ్యాండ్‌హెల్డ్ మెషిన్ ద్వారా గానీ ఇవ్వవచ్చు. ఇక ఈ-వే బిల్ జారీ చేయటానికి, ఈ-వే బిల్ పోర్టల్‌లో 'లైన్ సేల్స్' అనే ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. ఇది సప్లయ్ టైప్: అవుట్‌వార్డ్ అని ఇచ్చిన తర్వాత సబ్-టైప్ దగ్గర ఈ లైన్ సేల్స్ అనే ఆప్షన్ కనబడుతుంది. అలాగే సరఫరాదారుని, కొనుగోలుదారుని రెండు జీఎస్‌టీ వివరాలకు స్వంత జీఎస్‌టీ వివరాలు ఇవ్వాలి. ఇక సరఫరా జరిగే ప్రదేశం వివరాలు ముందుగా తెలియవు కాబట్టి, తను వెళ్లే మార్గంలో చివరి ఊరు పేరు నమోదు చేయాలి. అలాగే వస్తువుల విలువ దగ్గర రవాణా అయ్యే సరుకు మొత్తం విలువ నమోదు చేయాలి. సరైన ఈ-వే బిల్ లేకుండా రవాణా చేస్తుంటే అట్టి సరుకును సీజ్ చేసే అధికారం అధికారులకు ఉంటుంది. అలాగే దీనికి సంబంధించిన పెనాల్టీ కూడా భారీ మొత్తంలో ఉంటుంది. కాబట్టి లైన్ సేల్స్ చేసే వ్యాపారస్తులు తాము బయలుదేరటానికి ముందే ఇలా అన్ని వివరాలతో కూడిన ఈ-వే బిల్, డెలివరీ చలాన్స్‌ను సిద్ధం చేసుకోవాలి. అలాగే అమ్ముడుపోయిన సరుకుకు ఇన్వాయిస్ జారీ చేయటం, దానికి సంబంధించిన ట్యాక్స్‌ను నిర్ణీత గడువు లోపు కట్టడం మరిచిపోకూడదు.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 1-9-2024 | పేజీలు: 14+ 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price): Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 138

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి తె. 5.22 తదుపరి అమావాస్య; నక్షత్రం: ఆశ్లేష రా. 9.49 తదుపరి మఖ వర్జ్యం: ఉ. 9.36-11.21; దుర్ముహూర్తం: సా. 4.46-5.35; అమృతఘడియలు: రా. 8.04-9.49; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.04; సూర్యాస్తమయం: 6.24 | హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గుట్ట విమాన గోపురానికి త్వరలోనే స్వర్ణ తాపడం

పనుల పూర్తికి ప్రభుత్వం ఆదేశం
నివేదిక రూపకల్పనలో అధికారులు
60 కిలోల బంగారంతో తాపడం
5 కోట్లతో రాగి రేకుల పని పూర్తి

10


బంగారు తాపడం చేయనున్న గోపురం

పైకి షెడ్లు.. లోన బిల్డింగులు

హైదరాబాద్ అప్ప చెరువులో ఆక్రమణల కూల్చివేత

శిఖం భూమిలో 13 నిర్మాణాల తొలగింపు
వాటిలో అక్రమంగా పరిశ్రమల నిర్వహణ
అందులో రెండు బీజేపీ కార్పొరేటర్‌వి
నోటీసులివ్వకుండా కూల్చేశారన్న బాధితులు
ఈ షెడ్ల కారణంగానే 4 ఏళ్ల క్రితం వరదలు
చెరువు కట్ట తెగి ఐదుగురి దుర్మరణం
జాతీయ రహదారిపై రోజుల తరబడి నీరు
నాడు ఎలాంటి చర్యలు చేపట్టని అధికారులు

నేడు మామిడికుంటలో కూల్చివేతలు?


అప్ప చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలసిన షెడ్లను కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు

హైదరాబాద్ సిటీ/రాజేంద్రనగర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మరో చెరువుకు విముక్తి కలిగింది. రాజేంద్రనగర్ మండలం గగన్‌పహాడ్ అప్ప చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్‌లో రేకుల షెడ్‌లు వేసి అక్రమంగా నిర్వహిస్తున్న పలు పరిశ్రమలను హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) కూల్చివేసింది. ఇందులో కొన్ని షెడ్లు స్థానిక బీజేపీ కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి తండ్రి శ్రీశైలం రెడ్డికి చెందిన పదెకరాల శిఖం పట్టా భూముల్లో ఉన్నాయి. ఇదే చెరువు ఆక్రమణల కారణంగా 2020 అక్టోబరు వర్షాలకు ఆకస్మిక వరద వచ్చి కట్ట తెగి గగన్‌పహాడ్ బస్తీలను ముంచెత్తింది. జాతీయ రహదారిపై కొన్ని రోజుల పాటు రాకపోకలు ఆగిపోయాయి. ఫంక్షన్ హాల్లో పడుకున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మరణించారు. ఆ తర్వాత కూడా ఆక్రమణలు తొలగించే ప్రయత్నం చేయలేదు. తాజాగా శనివారం హైడ్రా కూల్చివేతలను చేపట్టింది. అప్ప చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్న రేకుల షెడ్లను నేలమట్టం చేసింది. ఈ షెడ్లలో పలువురు ప్లాస్టిక్ రీ సైక్లింగ్, వాటర్ బాటల్స్, అట్టలు, బిస్కట్ కంపెనీ లేబుల్స్ తయారీ, ప్యాకింగ్ పరిశ్రమలు

మిగతా 11వ పేజీలో...

11

కబ్జాలపై చర్యలు ఖాయం

హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ
పటాన్‌చెరు, అమీన్‌పూర్, ఖానామెట్‌లో సుడిగాలి పర్యటన.. చెరువుల పరిశీలన
ఈదులకుంట అదృశ్యంపై ఆశ్చర్యం

అవినీతి అధికారులపై కఠిన శిక్షలు పడే కేసులు

11

నకిలీ సాక్ష్యాధారాలను సృష్టించినట్లు అభియోగాలు
దర్యాప్తు ప్రారంభించిన ఈవోడబ్ల్యూ

హైదరాబాద్-నాగార్జున సాగర్

4 వరుసల రోడ్డు

హుస్సేన్ సాగర్ చుట్టూ స్కై వాక్ వే, టూరిజం హబ్

బుద్ధవనంలో అంతర్జాతీయ మ్యూజియం
సాగర్ టు సాగర్ పర్యాటక సర్క్యూట్
గోల్కొండ వద్ద కబ్జాలను తొలగించండి
అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్-హైదరాబాద్ మధ్య రాకపోకలను సులభతరం చేసేందుకు నాలుగు వరుసల రహదారిని నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దేశ, విదేశాల్లోని బౌద్ధులను ఆకట్టుకునేలా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో అంతర్జాతీయ బౌద్ధ మ్యూజియం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఫణిగిరి, నేలకొండపల్లి, నాగార్జునసాగర్ బౌద్ధ క్షేత్రాలతో పాటు హుస్సేన్‌సాగర్‌లో ఉన్న బుద్ధుడి విగ్రహాన్ని కలిపి టూరిజం సర్క్యూట్‌గా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వదేశీ దర్శన్ 2.0 స్కీమ్‌లో భాగంగా బుద్ధవనం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే కేంద్రానికి డీపీఆర్‌ను పంపించింది. రూ.25కోట్లతో బుద్ధవనంలో బుద్ధిస్ట్ డిజిటల్ మ్యూజియం ఏర్పాటు చేయాలని, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలని అందులో ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో కొత్త పర్యాటక పాలసీపై శనివారం సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్సేన్‌సాగర్‌లోని బుద్ధ విగ్రహాన్ని టూరిజం డెస్టినేషన్ సర్కిల్‌గా అభివృద్ధి



మిగతా 11వ పేజీలో...


నారాయణపేట జిల్లా అభంగాపూర్-భూనేడ్ మధ్య రహదారిపై వాగు ప్రవాహం

వణికించిన చినుకు

రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల భారీ వర్షం

నీట మునిగిన వరి, పత్తి, మొక్కజొన్న పంటలు
ఉప్పొంగిన వాగులు... దిగ్బంధంలో పల్లెలు
వర్షాలకు ముగ్గురి మృతి.. వాగులో ఒకరి గల్లంతు
ఖమ్మం జిల్లా ఎర్రుపాలెంలో 21.2 సెం.మీ..
నారాయణపేట జిల్లా మరికల్‌లో 13.8 సెం.మీ
కోదాడలో వరద బీభత్సం.. విద్యుత్తు నిలిపివేత
హైదరాబాద్-విజయవాడ రోడ్డుపై ట్రాఫిక్ జాం
నేడు, రేపు వర్షాలే.. వాతావరణ శాఖ రెడ్ అలర్ట్
హైదరాబాద్‌లో సోమవారం బడులకు సెలవు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

తెలంగాణపై మబ్బు దుప్పటి కమ్ముకుంది. శనివారం పొద్దున మొదలైన వర్షం రాత్రి అయినా ఆగలేదు! బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో కొన్నిచోట్ల జల్లులుగా.. ఇంకొన్ని చోట్ల భారీగా.. మరికొన్ని చోట్ల అతిభారీగా వర్షం పడింది! రాజధాని హైదరాబాద్ సహా పలుచోట్ల జనజీవనం స్తంభించింది. పట్టణాలు, నగరాల్లో రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లోని కాలనీలు జలమయమై ఇళ్లలోకి వరద పోటెత్తింది. పల్లెల్లో వరి పొలాలు, పత్తి, మొక్కజొన్న, కంది చేలు నీటమునిగాయి. రైతులు, వ్యవసాయ కూలీలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఇప్పటికే నిండిన చెరువులు, కుంటలు అలుగు పోస్తుంటే.. వాగులు, వంకలు

మిగతా 12వ పేజీలో...

కృష్ణా బేసిన్‌లో హై అలెర్ట్

శ్రీశైలం నుంచి 5లక్షల క్యూసెక్కులు
నాగార్జున సాగర్ 26 గేట్లు ఎత్తివేత
అధికారులూ.. అప్రమత్తం: సీఎం

ఈ నెలంతా వానలు?

పంటలకు అతివృష్టితో చేటు
పశ్చిమానికి రుతుపవనాలు
ఆగస్టులో 16% అధిక వర్షాలు

12

ఏపీలో కుండపోత

భారీ వర్షాలకు 9 మంది మృతి
విజయవాడలో రికార్డు వాన
బంగాళాఖాతంలో వాయుగుండం

కొత్త ఏడాదిలోనే పంచాయతీ ఎన్నికలు!

త్వరలో నూతన బీసీ కమిషన్
ఆ వెంటనే కుల గణనకు ఏర్పాట్లు
ఇదంతా పూర్తికి నాలుగు నెలలు
ఈలోగా పూర్తి రుణమాఫీపై దృష్టి!
ఓటరు జాబితా కసరత్తులో రాష్ట్ర ఎన్నికల సంఘం

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు కొత్త సంవత్సరంలో జరగనున్నాయి. జనవరిలో ఎన్నికలు జరుగుతాయని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది. దీనికి అవసరమైన అన్ని రకాల కసరత్తు జరుగుతోంది. రాష్ట్రంలో కుల గణన పూర్తి చేసిన తర్వాతే పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి

మిగతా 10వ పేజీలో...

బీసీలకు 42% ఇవ్వాల్సిందే

స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి
ఎన్నికల కమిషన్ నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో బీఆర్ఎస్, బీజేపీ డిమాండ్
కోటా ఖరారైన వెంటనే ఎన్నికలు పెడతాం: ఈసీ
6న పంచాయతీల్లో ఓటర్ల జాబితా విడుదల

10

30 ఏళ్ల ముందే గుండెజబ్బుల గుర్తింపు!

రక్తపరీక్ష ద్వారా సాధ్యం

ఎల్‌డీఎల్‌తో పాటు సీ రియాక్టివ్ ప్రొటీన్, లిపో ప్రొటీన్ల ద్వారా వెల్లడి
30 వేల మంది మహిళలపై 1992-95లో జరిగిన అధ్యయనంపై సరికొత్త విశ్లేషణ
'యూరోపియన్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ కాంగ్రెస్'లో పరిశోధన పత్రం

10



తెరపైకి మాజీ డీజీపీ పేరు!

ఏపీలో.. కాదంబరి జెత్వానీ కేసులో మరో ట్విస్ట్
రెండోరోజూ ముంబై నటి వాంగ్మూలం నమోదు
ఆమె తల్లిదండ్రుల నుంచి కూడా స్వీకరణ
మరోసారి మీడియా ముందుకు జెత్వానీ
పీఎస్ఆర్, కాంతిరాణా కనుసన్నల్లో కేసు..
ఫోర్జరీ డాక్యుమెంట్లు తయారు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

9

టీపీసీసీ సారథి మహేష్‌కుమార్ గౌడ్?

ఆయన వైపే కాంగ్రెస్ అధిష్ఠానం మొగ్గు
పోటీ ఇస్తున్న మధుయాష్కీగౌడ్
రేపు ప్రకటన వెలువడే అవకాశం



హైదరాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): టీపీసీసీకి నూతన అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పేరు వైపే కాంగ్రెస్ అధిష్ఠానం మొగ్గు చూపుతున్నట్లుగా తెలుస్తోంది. ఆయనకు ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ గట్టి పోటీ ఇస్తున్నట్లు చెబుతున్నారు. టీపీసీసీకి నూతన అధ్యక్షుడిగా బీసీ సామాజిక వర్గ నేతనే నియమించాలన్న నిర్ణయానికి వచ్చిన అధిష్ఠానం.. మహేష్ కుమార్ గౌడ్, మధు యాష్కీ గౌడ్‌లలో ఎవరిని ఎంపిక చేయాలన్న దానిపై తుది కసరత్తులో ఉన్నట్లు సమాచారం. కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పీసీసీలతో పాటుగా టీపీసీసీకి

మిగతా 11వ పేజీలో...


వినేశ్‌కు కరవాలం బహూకరిస్తున్న రైతులు

రైతులకు వినేశ్ మద్దతు

శంభూ సరిహద్దు వద్ద అన్నదాతలకు సంఘీభావం
మద్దతు ధరపై 200వ రోజుకు చేరిన ఆందోళన
కేంద్ర ప్రభుత్వ తీరు బాధాకరమని వినేశ్ విమర్శ
రాజకీయ ప్రవేశంపై సమాధానం దాటవేత

10

రెజ్లర్‌ను కాంగ్రెస్‌లోకి తెచ్చేందుకు ప్రయత్నం!

హరియాణా ఎన్నికల షెడ్యూల్‌లో మార్పులు

పోలింగ్ అక్టోబరు 1న బదులు 5న.. లెక్కింపు 8వ తేదీన
అసోజ్ అమావాస్య కారణంగానే సవరణ

హైడ్రాకు

రాహుల్ సైతం!



కొత్త పలుకు

తెలంగాణలో ఇప్పుడు ఎవరి నోట విన్నా హైడ్రా అన్న మాటే వినిపిస్తోంది. రేవంత్ రెడ్డి తేనెతుట్టెను కదిలించారని, పులి మీద స్వారీ చేస్తున్నారని కొంతమంది అభిప్రాయపడుతుండగా, హైడ్రా ద్వారా అక్రమ నిర్మాణాలను తొలగించి చెరువులను పరిరక్షిస్తున్నారని సామాన్య ప్రజానీకం ఆయనకు జేజేలు పలుకుతోంది. ఆరంభం అదుర్స్. ముగింపు ఎలా? ఎప్పుడు? అనేవే ప్రస్తుతం కీలక ప్రశ్నలు.

హైడ్రా చేపడుతున్న కూల్చివేతలకు సంబంధించి ఎన్ని ఒత్తిళ్లు వస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి తట్టుకొని నిలబడగలుగుతుండటం సామాన్య విషయం కాదు. కూల్చివేతలు ప్రారంభమైన వెంటనే కాంగ్రెస్ అధిష్ఠానానికి పుంఖానుపుంఖాలుగా ఫిర్యాదులు వెళ్లాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు కుటుంబానికి చెందిన భవనాన్ని కూడా మొదటి రోజే కూల్చివేశారు. ఆరోజు పళ్లంరాజు ఎన్ని ప్రయత్నాలు చేసినా సీఎం రేవంత్ అందుబాటులోకి రాలేదు. దీంతో ఆయన పార్టీ అధ్యక్షుడు ఖర్గేకు ఫిర్యాదు చేశారు.

మిగతా విషయాలతో పాటు కూల్చివేతలపై చర్చించడానికి రేవంత్ రెడ్డి, భట్టి, ఉత్తమ్‌ను ఢిల్లీకి పిలిపించుకుంది. పళ్లంరాజు ఫిర్యాదుపై రేవంత్‌ను ఖర్గే నిలదీశారని తెలిసింది. దీంతో కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు పళ్లంరాజు ఎలా ప్రయోజనాలు పొందారో సాక్ష్యాధారాలతో అధిష్ఠానానికి వివరించారు. కూలగొట్టిన భవనం అక్రమంగా నిర్మించినదని నిరూపించారు.

దీంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కల్పించుకొని, రేవంత్ చర్యలను తాను సమర్థిస్తున్నానని, ఆయనను అడ్డుకోవద్దని కాంగ్రెస్ ముఖ్యులకు స్పష్టంచేశారు. అంతే, రేవంత్‌కు కొండంత అండ లభించింది. ఏ లక్ష్యంతో కూల్చివేతలు ప్రారంభించారో కానీ, రేవంత్ రెడ్డి ప్రస్తుతం అటు పార్టీ అధిష్ఠానం నుంచి, ఇటు ప్రజల నుంచి మంచి మార్కులు కొట్టేస్తున్నారు.

హైదరాబాద్‌లో చెరువులు దురాక్రమణకు గురైన విషయం తెలిసిందే. ఈ కారణంగానే ఒక మోస్తరు వర్షానికి కూడా జలమయం అవుతోంది. ఫలితంగా సీఎం చర్యలకు ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది. ప్రస్తుతానికి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలపైనే హైడ్రా దృష్టి కేంద్రీకరించింది. బఫర్ జోన్‌లో నిర్మించిన కట్టడాల జోలికి ఇంకా పూర్తి స్థాయిలో వెళ్లలేదు. అయినా హైడ్రా లాంటి వ్యవస్థను అన్ని ప్రాంతాలకూ విస్తరించాలన్న డిమాండ్ వస్తోంది.

అక్రమ నిర్మాణాల పాపం బిల్డర్లు, అధికారులదే. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ వంటి సంస్థల అనుమతితో నిర్మించిన ఫ్లాట్స్‌ను కొనుగోలు చేసిన వారికి ఏ పాపం తెలియదు. వారిని ఇప్పుడు శిక్షించడం కూడా అన్యాయం అవుతుంది.

ఇక 111 జీవో వ్యవహారం ఉండనే ఉంది. దశాబ్దాల క్రితం అమలులోకి వచ్చిన ఈ జీవో విషయంలో ప్రభుత్వం ఇప్పటికైనా స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాల పరిరక్షణకు ఈ జీవోను అప్పట్లో తెచ్చారు. అది కూడా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు. ఇప్పుడు హైదరాబాద్ ప్రజల మంచినీటి అవసరాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. అదే సమయంలో ఔటర్ రింగురోడ్డు వచ్చింది. నీటి ప్రవాహానికి అడ్డుగా ఔటర్ రింగు రోడ్డు నిర్మించిన తర్వాత దాని లోపల ఉన్న ప్రాంతాన్ని 111 జీవో పరిధిలోనిదిగా పరిగణించడం అర్థరహితం. అందుచేత 111 జీవో పరిధిలో శాస్త్రీయ పద్ధతిలో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం వాంఛనీయం.

ఈ నేపథ్యంలో ఆ రెండు జలాశయాలను టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేసి 111 జీవో పరిధిలోని ప్రాంతంలో కొన్ని పరిమితులతో ఒక క్రమ పద్ధతి ప్రకారం నిర్మాణాలకు అనుమతించడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుంది. అదే సమయంలో అక్రమ కట్టడాలు, పద్ధతీ పాడూ లేకుండా జరుగుతున్న విస్తరణకు అడ్డుకట్ట వేయవచ్చు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK




కొత్తపలుకు

హైడ్రాకు రాహుల్ సైతం!

ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం–జనసేన–బీజేపీ కూటమికి చెందిన మంత్రులు, శాసనసభ్యులు, నాయకులకు ఒక సూచన.. కాదు ఒక హెచ్చరిక కూడా! నిన్నటి జగన్ అండ్ కో అరాచక పాలనను ప్రజలు మరువకముందే అదే బాటలో పయనించే ప్రయత్నం చేస్తున్న వారికి మాత్రమే ఈ హెచ్చరిక. రాజ్యం వీరభోజ్యం అన్నట్టుగా సాగిన జగన్మోహన్‌రెడ్డి పాలనను ఆదర్శంగా తీసుకొని అదే బాటలో పయనించాలనుకొనేవారు తస్మాత్ జాగ్రత్త! గత ప్రభుత్వంపై ఏవగింపుతో ప్రజలు తమకు అఖండ విజయాన్ని అందించారన్న వాస్తవాన్ని మరచి కొంతమంది శాసనసభ్యులు గతంలో మాదిరి సామంత రాజులుగా వ్యవహరించాలని అనుకుంటున్నారు. ఇటువంటి వారు తమ పోకడల ద్వారా ప్రభుత్వానికి అప్రతిష్ఠ తీసుకురావడమే కాకుండా రాష్ట్రానికి కూడా తీరని ద్రోహం చేయబోతున్నారని గుర్తెరగాలి. ఏ రాయి అయితేనేం పళ్లు రాలగొట్టుకోవడానికి అన్న భావన ప్రజల్లో ఏర్పడితే అది రాష్ట్ర ప్రయోజనాలకు తీరని నష్టం కలిగిస్తుంది. ఏ కారణాల వల్ల ప్రజలు జగన్‌రెడ్డి పాలనను తిరస్కరించారో మరచిపోయి తాము కూడా అదే పెడదారిలో పయనించాలనుకుంటే ప్రజలు సహించబోరని తెలుసుకోవాలి. అధికార కూటమి నేతల చర్యల వల్ల ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రతిష్ఠ మాత్రమే దెబ్బతింటుందని అనుకోవడం పొరపాటు. చంద్రబాబు నాల్గవ పర్యాయం ముఖ్యమంత్రి అయ్యారు. 2029 ఎన్నికల నాటికి ఆయన వయసు 78 ఏళ్లు దాటుతుంది. ఈ ఐదేళ్లలో ప్రభుత్వ ప్రతిష్ఠ మసకబారి 2029లో మళ్లీ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే తమ పరిస్థితి, రాష్ట్రం పరిస్థితి ఏమిటో కూటమి ఎమ్మెల్యేలు అనుక్షణం గుర్తించుకోవాలి. లేని పక్షంలో రాష్ట్ర భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిపోతుంది. గత ఐదేళ్లలో భ్రష్టుపట్టిపోయిన పాలనా వ్యవస్థను గాడిలో పెట్టడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. మారిన పరిస్థితులలో కేంద్రంలో పెరిగిన తన పరపతిని ఉపయోగించి రాష్ట్రానికి మేలు చేకూర్చడానికి ఆయన ప్రయత్నిస్తున్నారు. ఆ ప్రయత్నాలు ఫలించడమూ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో క్షేత్ర స్థాయి నుంచి అందుతున్న సమాచారం ఆందోళన కలిగిస్తోంది. గత పాలనలోని అవలక్షణాలను కొంత మంది ఎమ్మెల్యేలు, నాయకులు పుణికిపుచ్చుకొని అధికార దర్పం వెలగబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రాంతం నాది, ఇక్కడ నా మాటే చెల్లుబాటు అవుతుంది అన్నట్టుగా కొందరు విర్రవీగుతున్నారు. గుంటూరు జిల్లాలో తాజాగా జరిగిన రెండు సంఘటనలను తీసుకుందాం. ఒక ఎమ్మెల్యే భర్త తాను గతంలో అంగీకరించిన ధర కంటే తక్కువ ధరకే భూమిని తనకు అమ్మాలని సదరు భూ యజమానిపై దౌర్జన్యం చేశారు. తన మాట వినని ఆ భూ యజమానిపై ఎస్సీ ఎస్టీ కేసు పెట్టించారు. గత ప్రభుత్వంలో ఇలాంటి దురాగతాలు జరగడం వల్లనే కదా ప్రజలు జగన్ ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించారు! అదే గుంటూరు జిల్లాలో అదే రోజు మరో ఎమ్మెల్యే సతీమణి పుట్టినరోజు వేడుకలకు పోలీసు అధికారులు హాజరై సభ్య సమాజం ఆశ్చర్యపోయేలా చేశారు. జగన్ పాలనలో ఇలాంటివే జరిగాయి. పాత అలవాట్ల ప్రకారం పుట్టినరోజు వేడుకలకు పోలీసు అధికారులను అనుమతించిన సదరు ఎమ్మెల్యే తాను ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నానన్న విషయం మరచిపోయారు. అయితే ఈ రెండు సందర్భాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవహరించిన తీరు ముదావహం. ఎమ్మెల్యే భర్త ఆదేశాల ప్రకారం తక్కువ ధరకు భూమి విక్రయించడానికి నిరాకరించిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టిన ఇన్‌స్పెక్టర్‌ను ప్రభుత్వం వెంటనే బదిలీ చేసింది. ఆ అధికారిని వేకెన్సీ రిజర్వుకు బదిలీ చేశారు. అధికార పార్టీ నాయకుల ఆదేశాలను పాటించడమే తమ విధి అన్నట్టుగా వ్యవహరించే అధికారులకు ఇదొక హెచ్చరిక! గతంలో ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వ పెద్దలు చర్యలు తీసుకోకపోగా ప్రోత్సహించేవారు. ఎమ్మెల్యే భార్య పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న పోలీసు అధికారులు అందరికీ మెమోలు జారీ చేయాలని కూడా చంద్రబాబు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. రూల్ ఆఫ్ లా పాటించడం అంటే ఇదీ. ప్రజాస్వామ్యంలో పాలకులైనా, అధికారులైనా ప్రజలకే జవాబుదారీగా ఉండాలి. తప్పు జరిగినప్పుడు తర తమ భేదం చూపకుండా చర్యలు తీసుకుంటే రూల్ ఆఫ్ లా పాటించినట్టు అవుతుంది. అది నాగరిక పాలన అవుతుంది. గత ఐదేళ్లలో ఆటవికంగా సాగిన పాలనను చూశాం. ఇప్పుడు కూడా అవే పరిస్థితులు పునరావృతం అయితే ప్రజలు ఎంత మాత్రం సహించరు. ప్రభుత్వంలో తప్పులు జరిగినప్పుడు చంద్రబాబు వెంటనే స్పందించడాన్ని అభినందించాల్సిందే. సున్నిత మనస్కులు మాత్రమే ఇలా స్పందిస్తారు. పాలెగాళ్ల పోకడలను జీర్ణించుకున్నవారు మాత్రం అరాచకాలు జరిగినప్పుడు ఆనందిస్తారు. జగన్‌రెడ్డి పాలనలో జరిగిన దౌర్జన్యాలు, దురాగతాలకు ప్రతీకారం ఇంకెప్పుడు తీర్చుకుంటారు? అంటూ తెలుగు తమ్ముళ్ల నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబుపై విపరీతమైన ఒత్తిడి వస్తోంది. అయినా ఆయన సంయమనం పాటిస్తున్నారు. పాలెగాళ్ల రాజ్యాన్నే కొనసాగిస్తే రాష్ట్ర ప్రతిష్ఠ మంటగలసిపోతుందని ఆయనకు తెలుసు. అందుకే గత ఘోరాలు, నేరాలపై ఆధారాలు లభించినప్పుడు చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటున్నారు. తెలుగు తమ్ముళ్లు ఆవేశపడుతున్నారని ఆయన కూడా ఆవేశపడటం లేదు. అదే సమయంలో హద్దు మీరుతున్న పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులకు వాతలు పెడుతున్నారు. గుంటూరు జిల్లాలో జరిగిన సంఘటనలను మంత్రివర్గ సమావేశంలో పరోక్షంగా ప్రస్తావిస్తూ 'నేను మా వాళ్లను హెచ్చరిస్తాను. మీరు మీ వాళ్లకు క్లాస్ తీసుకోండి' అని జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు చంద్రబాబు సూచించారు. దీనిపై పవన్ కల్యాణ్ స్పందిస్తూ, కూటమి ఎమ్మెల్యేలతో ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేసి హెచ్చరిద్దామని అభిప్రాయపడ్డారు. కొన్ని జిల్లాల్లో కొంతమంది నాయకులు ఫలానా ప్రాంతాన్ని తమకు రాసిచ్చారు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. అక్కడ ఏది కావాలన్నా, ఏది జరగాలన్నా తన అనుమతి తప్పనిసరి అని హుకుం జారీ చేస్తున్నారు. రాయించుకోవడానికి మీరెవ్వరు? రాసివ్వడానికి వారెవ్వరు? ప్రజలు మీకు ఐదేళ్లపాటు అధికారంలో ఉండి తమకు సేవ చేయమని మాత్రమే రాసిచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల పనులు కావాలన్నా, ప్రజా సమస్యలు పరిష్కారం కావాలన్నా స్థానిక ఎమ్మెల్యే అనుమతి తీసుకోవాలా? ఏ చట్టంలో, ఏ రాజ్యాంగంలో ఇలా రాశారు? అధికారుల విధుల్లో జోక్యం చేసుకొనే అధికారం ఎమ్మెల్యేలకు ఎవరిచ్చారు? అధికారులకు జీతాలు ఇస్తున్నది ఎమ్మెల్యేలకు ఊడిగం చేయడానికి కాదు! అధికారులు, ఉద్యోగులు తాము ప్రజా సేవకులం, పబ్లిక్ సర్వెంట్స్ అని మరచిపోతే ఎలా? జగన్‌రెడ్డి పాలనలో ఈ దరిద్రపు సంస్కృతి జడలు విప్పుకొని కరాళ నృత్యం చేసింది. ప్రజలు ఛీత్కరించుకున్న అదే సంస్కృతిని కూటమి పాలనలో కూడా కొనసాగించాలనుకుంటే కుదరదు. బాధ్యత గల మీడియాగా మేం అలాంటి వారిపై కొరడా ఝళిపిస్తాం.

> సజ్జన్ జిందాల్ అయినా, మరొకరు అయినా కాదంబరి జోలికి వెళ్లి ఉండకపోతే బ్లాక్ మెయిల్ చేసే అవకాశం వచ్చేది కాదు కదా? వ్యక్తిగత బలహీనతల వల్ల ఇబ్బందుల్లో పడ్డవారు సానుభూతికి అనర్హులు. అలాంటి వారికి వత్తాసు పలుకుతున్న జగన్ మీడియా రోత మీడియానే అవుతుంది. అయినా బ్లాక్‌మెయిల్ చేశారని చట్టవిరుద్ధంగా నిర్బంధించి చిత్రహింసలు పెట్టవచ్చా? అలా అయితే వివేకానందరెడ్డి హత్య కేసుతో పాటు అవినీతి కేసులలో ఆరోపణలు ఎదుర్కొంటున్న జగన్‌రెడ్డిని కూడా ఇలాగే చిత్రహింసలు పెట్టవచ్చా? అలా చేస్తే ఇదే రోత మీడియా గగ్గోలు పెట్టదా? ఇప్పుడు కూటమి నాయకులు, ఎమ్మెల్యేలు ఈ వాస్తవాన్ని మరచిపోకూడదు. పోలీసు అధికారులకు కూడా కాదంబరి వ్యవహారం ఒక గుణపాఠం అవుతుంది. గత పాలనలోని చేదు జ్ఞాపకాలను మరిపించే విధంగా కూటమి నేతలు వ్యవహరించకూడదు.



ఇదో గుణపాఠం!

ముంబైకి చెందిన నటి కాదంబరీ జెత్వానీ విషయంలో గత ప్రభుత్వంలో ఏం జరిగిందో ఇప్పుడు చూస్తున్నాం. ఐపీఎస్ అధికారులు సైతం తమ బాధ్యతను విస్మరించి ప్రభుత్వ పెద్దల ఆదేశాలకు తలొగ్గి చట్టవిరుద్ధంగా వ్యవహరించి ఇప్పుడు చిక్కుల్లో ఇరుక్కున్నారు. ఈ వ్యవహారంలో ఆడపిల్ల అయిన కాదంబరికి వ్యతిరేకంగా వ్యవహరించిన అధికారులకు వత్తాసు పలుకుతూ జగన్‌రెడ్డి మీడియాలో వార్తలు వండి వారుస్తున్నారు. ఇంతకంటే నీతిమాలిన చర్య ఉంటుందా? జర్నలిజంలోని కనీస ప్రమాణాలు కూడా పాటించకుండా బాధితురాలినే విలన్‌గా చిత్రించడమా? అంతకంటే అపచారం ఉంటుందా? అందుకే జగన్‌రెడ్డి సొంత మీడియాను రోత మీడియా అని పిలవాల్సి వస్తోంది. సదరు రోత మీడియాకు వంత పాడుతున్న వారిని కూలి మీడియా అనడంలో తప్పేముంది? ప్రముఖ వ్యాపారి సజ్జన్ జిందాల్‌తో పాటు ఏషియన్ పెయింట్స్ అధినేతను కాదంబరి బ్లాక్ మెయిల్ చేశారని రోత మీడియా ఆవేశపడుతోంది. అది కూడా నిజమే అనుకుందాం. బ్లాక్ మెయిల్ సంఘటన జరిగివుంటే, అది ముంబైలో కదా జరిగింది? ఆంధ్రప్రదేశ్ పోలీసులకు ఏం పని? అయినా, ఆమె బ్లాక్ మెయిల్ చేసే అవకాశం సదరు వ్యాపార దిగ్గజాలు ఎందుకు కల్పించారు? అప్పటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి, సజ్జన్ జిందాల్‌ను కలుసుకున్న తర్వాతే కాదంబరికి కష్టాలు మొదలయ్యాయని ప్రస్తుతం పోలీసు విచారణలో స్పష్టమవుతోంది. సజ్జన్ జిందాల్ తరఫున అనైతికంగా, చట్టవిరుద్ధంగా వ్యవహరించడానికి మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించి ఉండకపోవచ్చు. దాంతో జిందాల్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని ఆశ్రయించి ఉంటారు. అప్పటికే ఆటవిక పాలనకు అలవాటు పడిన జగన్‌రెడ్డి సదరు సజ్జన్ జిందాల్‌కు అభయం ఇవ్వడం, తాము చట్టానికి బాధ్యులం అన్న విషయం మరచిన కాంతి రాణా, పీఎస్ఆర్ ఆంజనేయులు, విశాల్ గున్ని వంటి అధికారులు పాలకుడి ఆదేశాలను ఔదలదాల్చడంతో ఇదంతా జరిగింది. కాదంబరి అనే మోడల్ తమను బ్లాక్‌మెయిల్ చేస్తోందని సజ్జన్ జిందాల్ అండ్ కో మహారాష్ట్రలో అధికారికంగా ఎందుకు ఫిర్యాదు చేయలేదు? కాదంబరితో తమకున్న సంబంధం ఏమిటి? ఆమె తమను ఎలా బ్లాక్‌మెయిల్ చేశారో, ఎందుకు చేశారో సదరు పారిశ్రామికవేత్తలు చెప్పాలి కదా? తమను బ్లాక్‌మెయిల్ చేసే అవకాశం కల్పించిన పారిశ్రామికవేత్తలు నోరు విప్పాలి కదా? జిందాల్ అండ్ కోకు మేలు చేయడం కోసం నాటి ప్రభుత్వం కుక్కల విద్యాసాగర్ అనే వ్యక్తిని రంగప్రవేశం చేయించింది. రోత మీడియా కథనాల ప్రకారం కుక్కల విద్యాసాగర్‌ను కూడా కాదంబరి బ్లాక్‌మెయిల్ చేసి భూమి రాయించుకున్నారు. దానిపై కుక్కల ఫిర్యాదు చేసినందునే పోలీసులు కాదంబరిని ముంబై నుంచి తీసుకువచ్చారట. ఫిబ్రవరి 2వ తేదీన కుక్కల విద్యాసాగర్ ఫిర్యాదు చేసినట్టు రికార్డులలో ఉంది. అలాంటప్పుడు ఫిబ్రవరి ఒకటవ తేదీనే విశాల్ గున్ని, రమణమూర్తి, ముత్యాల సత్యనారాయణ తదితర అధికారులు మహిళా పోలీసులు లేకుండా గన్నవరం నుంచి ముంబై ఎందుకు వెళ్లారు? కాదంబరి కొనకపోయినా, భూమికి సంబంధించిన డాక్యుమెంట్లను డాక్యుమెంట్ రైటర్‌ను బెదిరించి తమకు కావాల్సింది రాయించారు. అయినా జగన్ రోత మీడియా తప్పు చేసిన అధికారులను రక్షించే ప్రయత్నాన్ని నిస్సిగ్గుగా చేస్తోంది. హనీ ట్రాప్ చేయడం కాదంబరికి అలవాటేనని కుక్కల విద్యాసాగర్ వాపోతున్నట్టుగా కూడా మరో రోత కథనం ప్రచురించారు. నిజమే అనుకుందాం. రాష్ట్రంలో అయిదు కోట్ల మంది జనాభా ఉన్నారు. విద్యాసాగర్ కంటే ధనవంతులు ఉన్నారు. అయినా కుక్కలను మాత్రమే ఆమె ఎందుకు ఎంచుకున్నారు? అంటే అతడు ఆమెతో వ్యవహారానికి ప్రయత్నించినట్టే కదా? సజ్జన్ జిందాల్ అయినా, మరొకరు అయినా ఆమె జోలికి వెళ్లి ఉండకపోతే బ్లాక్ మెయిల్ చేసే అవకాశం వచ్చేది కాదు కదా? వ్యక్తిగత బలహీనతల వల్ల ఇబ్బందుల్లో పడ్డవారు సానుభూతికి అనర్హులు. అలాంటి వారికి వత్తాసు పలుకుతున్న జగన్ మీడియా రోత మీడియానే అవుతుంది. గత ప్రభుత్వంలో పోలీసు వ్యవస్థను ఏ స్థాయిలో భ్రష్టుపట్టించారో ఈ సంఘటనను బట్టి తెలుస్తోంది. పోలీసులపై అతిగా ఆధారపడి పాలించిన ఏ రాజకీయ పార్టీ కూడా బాగుపడిన దాఖలాలు లేవు. అయినా బ్లాక్‌మెయిల్ చేశారని చట్టవిరుద్ధంగా నిర్బంధించి చిత్రహింసలు పెట్టవచ్చా? అలా అయితే వివేకానందరెడ్డి హత్య కేసుతో పాటు అవినీతి కేసులలో ఆరోపణలు ఎదుర్కొంటున్న జగన్‌రెడ్డిని కూడా ఇలాగే చిత్రహింసలు పెట్టవచ్చా? అలా చేస్తే ఇదే రోత మీడియా గగ్గోలు పెట్టదా? ఇప్పుడు కూటమి నాయకులు, ఎమ్మెల్యేలు ఈ వాస్తవాన్ని మరచిపోకూడదు. పోలీసు అధికారులకు కూడా కాదంబరి వ్యవహారం ఒక గుణపాఠం అవుతుంది. ఇవాళ కాకపోతే రేపైనా పాపం పండుతుంది అంటారు. అందుకే గత పాలనలోని చేదు జ్ఞాపకాలను మరిపించే విధంగా కూటమి నేతలు వ్యవహరించకూడదు. తస్మాత్ జాగ్రత్త!

> ఇప్పటిదాకా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు అక్రమ నిర్మాణాలను పట్టించుకోకపోగా ప్రోత్సహించాయి. ఫలితంగా హైదరాబాద్‌కు జలప్రళయం పొంచి ఉంది.

రేవంత్ సాహసం!

తెలంగాణలో ఇప్పుడు ఎవరి నోట విన్నా హైడ్రా అన్న మాటే వినిపిస్తోంది. హైడ్రా చేపడుతున్న కూల్చివేతలే మీడియాలో కూడా అధిక ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. హైడ్రాకు పురుడు పోసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రేవంత్‌రెడ్డి తేనెతుట్టెను కదిలించారని, పులి మీద స్వారీ చేస్తున్నారని కొంతమంది అభిప్రాయపడుతుండగా, హైడ్రా ద్వారా అక్రమ నిర్మాణాలను తొలగించి చెరువులను పరిరక్షిస్తున్నారని సామాన్య ప్రజానీకం ఆయనకు జేజేలు పలుకుతోంది. ఆరంభం అదుర్స్. ముగింపు ఎలా? ఎప్పుడు? అనేవే ప్రస్తుతం కీలక ప్రశ్నలు. ప్రాంతీయ పార్టీల అధినేతలు మాత్రమే ఇలాంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకోగలరు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న రేవంత్‌రెడ్డి ఇటువంటి సాహసం చేయడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. హైడ్రా చేపడుతున్న కూల్చివేతలకు సంబంధించి ఎన్ని ఒత్తిళ్లు వస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి తట్టుకొని నిలబడగలుగుతుండటం సామాన్య విషయం కాదు. కూల్చివేతలు ప్రారంభమైన వెంటనే కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి పుంఖాను పుంఖాలుగా ఫిర్యాదులు వెళ్లాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు కుటుంబానికి చెందిన భవనాన్ని కూడా మొదటి రోజే కూల్చివేశారు. ఆ రోజు పళ్లంరాజు ఎన్ని ప్రయత్నాలు చేసినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందుబాటులోకి రాలేదు. దీంతో ఆయన పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులు చేసిన వారి జాబితాలో కేవీపీ రామచంద్రరావు పేరు కూడా ఉన్నట్టు వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం మిగతా విషయాలతో పాటు కూల్చివేతలపై చర్చించడానికి రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్ రెడ్డిని ఢిల్లీకి పిలిపించుకుంది. ఈ సందర్భంగా పళ్లంరాజు ఫిర్యాదుపై ఖర్గే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నిలదీశారని తెలిసింది. దీంతో కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు పళ్లంరాజు ఎలా ప్రయోజనాలు పొందారో వివరించి, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాబోదని పళ్లంరాజు ఎవరెవరి వద్ద వ్యాఖ్యానించారో కూడా రేవంత్‌రెడ్డి సాక్ష్యాధారాలతో అధిష్ఠానానికి వివరించారు. అంతేకాకుండా కూలగొట్టిన భవనం అక్రమంగా నిర్మించినదని నిరూపించారు. దీంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కల్పించుకొని, ముఖ్యమంత్రి రేవంత్ చర్యలను తాను సమర్థిస్తున్నానని, ఆయనను అడ్డుకోవద్దని కాంగ్రెస్ ముఖ్యులకు స్పష్టం చేశారు. అంతే, రేవంత్‌రెడ్డికి కొండంత అండ లభించింది. ఈ సంఘటన పర్యవసానంగా కూల్చివేతలపై రాష్ట్ర కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు వినిపించకుండా పోయాయి. ఏ లక్ష్యంతో కూల్చివేతలు ప్రారంభించారో కానీ, రేవంత్‌రెడ్డి ప్రస్తుతం అటు పార్టీ అధిష్ఠానం నుంచి, ఇటు ప్రజల నుంచి మంచి మార్కులు కొట్టేస్తున్నారు. హైదరాబాద్ మహానగరంలో చెరువులు దురాక్రమణకు గురైన విషయం తెలిసిందే. ఈ కారణంగానే ఒక మోస్తరు వర్షానికి కూడా హైదరాబాద్ జలమయం అవుతోంది. ప్రజలు ఈ విషయమై ఆగ్రహంగా ఉన్నారు. ఫలితంగా ముఖ్యమంత్రి చర్యలకు ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది. ప్రస్తుతానికి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలపైనే హైడ్రా దృష్టి కేంద్రీకరించింది. బఫర్ జోన్‌లో నిర్మించిన కట్టడాల జోలికి ఇంకా పూర్తి స్థాయిలో వెళ్లలేదు. నిజానికి ఇప్పటి వరకు జరిగిన కూల్చివేతలు అతి స్వల్పం. అయినప్పటికీ హైడ్రా లాంటి వ్యవస్థను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకూ విస్తరించాలన్న డిమాండ్ వస్తోంది. భారత రాష్ట్ర సమితి మినహా మిగతా ప్రతిపక్షాలు ఈ కూల్చివేతలను విమర్శించలేని పరిస్థితి. బీఆర్ఎస్ కూడా సన్నాయి నొక్కులకే పరిమితమైంది. హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాల పాపం బిల్డర్లు, అధికారులదే. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ వంటి సంస్థల అనుమతితో నిర్మించిన ఫ్లాట్స్‌ను కొనుగోలు చేసిన వారికి ఏ పాపం తెలియదు. వారిని ఇప్పుడు శిక్షించడం కూడా అన్యాయం అవుతుంది. ఇప్పటిదాకా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు అక్రమ నిర్మాణాలను పట్టించుకోకపోగా ప్రోత్సహించాయి. ఫలితంగా హైదరాబాద్‌కు జలప్రళయం పొంచి ఉంది. బఫర్ జోన్‌లో నిర్మించిన కట్టడాల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ ఎంతవరకు వెళతారో తెలియదు. ఇక 111 జీవో వ్యవహారం ఉండనే ఉంది. దశాబ్దాల క్రితం అమలులోకి వచ్చిన ఈ జీవో విషయంలో ప్రభుత్వం ఇప్పటికైనా స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాల పరిరక్షణకు ఈ జీవోను అప్పట్లో తెచ్చారు. అది కూడా సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు. ఇప్పుడు హైదరాబాద్ ప్రజల మంచినీటి అవసరాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. అదే సమయంలో ఔటర్ రింగురోడ్డు వచ్చింది. నీటి ప్రవాహానికి అడ్డుగా ఔటర్ రింగు రోడ్డు నిర్మించిన తర్వాత దాని లోపల ఉన్న ప్రాంతాన్ని 111 జీవో పరిధిలోనిదిగా పరిగణించడం అర్థరహితం. ఔటర్ లోపలా, వెలుపలా విచ్చలవిడిగా నిర్మాణాలు వచ్చాయి. శంషాబాద్ ఎయిర్ పోర్టు కూడా 111 జీవో పరిధిలోని భూమిలోనే నిర్మించారు. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌ను ఇప్పుడు మంచినీటి అవసరాలకు ఉపయోగించడం లేదు. ఈ నేపథ్యంలో ఆ రెండు జలాశయాలను టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేసి 111 జీవో పరిధిలోని ప్రాంతంలో కొన్ని పరిమితులతో ఒక క్రమ పద్ధతి ప్రకారం నిర్మాణాలకు అనుమతించడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుంది. అదే సమయంలో అక్రమ కట్టడాలు, పద్ధతీ పాడూ లేకుండా జరుగుతున్న విస్తరణకు అడ్డుకట్ట వేయవచ్చు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 111 జీవో ఎత్తివేస్తున్నట్టు ప్రకటన మాత్రమే చేశారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెరువులను పరిరక్షించడంతో పాటు 111 జీవో విషయంలో స్పష్టమైన విధాన నిర్ణయం తీసుకోవాలి. లేని పక్షంలో 111 జీవో పరిధిలోని చెరువులు కూడా ఆక్రమణలకు గురవుతాయి. మళ్లీ కూల్చివేతలు అంటూ హడావిడి చేయవలసి వస్తుంది. అందుచేత 111 జీవో పరిధిలో శాస్త్రీయ పద్ధతిలో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం వాంఛనీయం. ఇప్పటికే 60 అంతస్తుల వరకు భవన నిర్మాణాలకు వేలం వెర్రిగా అనుమతులు ఇచ్చిన కేసీఆర్ ప్రభుత్వం, సైబరాబాద్‌కు కూడా తీరని అపచారం చేసింది. వందలు, వేల ఎకరాలు ఖాళీగా ఉన్నప్పుడు 50 నుంచి 60 అంతస్తుల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం ఏమిటి? ఇకపై అక్రమ కట్టడాలకు అనుమతించిన అధికారులను అందుకు బాధ్యులను చేయడంతో పాటు 111 జీవో విషయంలో హేతుబద్ధమైన నిర్ణయం తీసుకుంటే గ్రేటర్ హైదరాబాద్‌కు మేలు చేసిన వ్యక్తిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిగిలిపోతారు!

> ఎమ్మెల్యే భర్త ఆదేశాల ప్రకారం తక్కువ ధరకు భూమి విక్రయించడానికి నిరాకరించిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టిన ఇన్‌స్పెక్టర్‌ను చంద్రబాబు ప్రభుత్వం వెంటనే బదిలీ చేసింది. ఆ అధికారిని వేకెన్సీ రిజర్వుకు బదిలీ చేశారు. అధికార పార్టీ నాయకుల ఆదేశాలను పాటించడమే తమ విధి అన్నట్టుగా వ్యవహరించే అధికారులకు ఇదొక హెచ్చరిక! ఎమ్మెల్యే భార్య పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న పోలీసు అధికారులు అందరికీ మెమోలు జారీ చేయాలని కూడా చంద్రబాబు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. రూల్ ఆఫ్ లా పాటించడం అంటే ఇదీ. ప్రజాస్వామ్యంలో పాలకులైనా, అధికారులైనా ప్రజలకే జవాబుదారీగా ఉండాలి. తప్పు జరిగినప్పుడు తర తమ భేదం చూపకుండా చర్యలు తీసుకుంటే రూల్ ఆఫ్ లా పాటించినట్టు అవుతుంది. అది నాగరిక పాలన అవుతుంది. గత ఐదేళ్లలో ఆటవికంగా సాగిన పాలనను చూశాం. ఇప్పుడు కూడా అవే పరిస్థితులు పునరావృతం అయితే ప్రజలు ఎంత మాత్రం సహించరు.


> ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు కుటుంబానికి చెందిన భవనాన్ని కూడా మొదటి రోజే కూల్చివేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం మిగతా విషయాలతో పాటు కూల్చివేతలపై చర్చించడానికి రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్ రెడ్డిని ఢిల్లీకి పిలిపించుకుంది. ఈ సందర్భంగా పళ్లంరాజు ఫిర్యాదుపై ఖర్గే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నిలదీశారని తెలిసింది. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు పళ్లంరాజు ఎలా ప్రయోజనాలు పొందారో వివరించి, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాబోదని పళ్లంరాజు ఎవరెవరి వద్ద వ్యాఖ్యానించారో కూడా రేవంత్‌రెడ్డి సాక్ష్యాధారాలతో అధిష్ఠానానికి వివరించారు. అంతేకాకుండా కూలగొట్టిన భవనం అక్రమంగా నిర్మించినదని నిరూపించారు. దీంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కల్పించుకొని, ముఖ్యమంత్రి రేవంత్ చర్యలను తాను సమర్థిస్తున్నానని, ఆయనను అడ్డుకోవద్దని కాంగ్రెస్ ముఖ్యులకు స్పష్టంచేశారు. అంతే, రేవంత్‌రెడ్డికి కొండంత అండ లభించింది. ఈ సంఘటన పర్యవసానంగా కూల్చివేతలపై రాష్ట్ర కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు వినిపించకుండా పోయాయి. ఏ లక్ష్యంతో కూల్చివేతలు ప్రారంభించారో కానీ, రేవంత్‌రెడ్డి ప్రస్తుతం అటు పార్టీ అధిష్ఠానం నుంచి, ఇటు ప్రజల నుంచి మంచి మార్కులు కొట్టేస్తున్నారు.

సమాజహితమే బోవెరా బతుకుబాట

సమాజ హితానికి జీవితాన్ని ధారబోసిన ధన్యజీవి కరీంనగర్ గాంధీ. బోయినపల్లి వెంకటరామారావు. ఆయన 73 ఏళ్ల సుదీర్ఘ జీవనప్రస్థానం దేశ చరిత్రతో విడదీయరానిది. తోటపల్లి గాంధీగా పేరెన్నికగన్న బోయినపల్లి వెంకటరామారావు కరీంనగర్ జిల్లా తోటపల్లిలో పద్మనాయక కుటుంబంలో 1920 సెప్టెంబర్ 2న జన్మించారు. బాల్యం నుంచే స్వతంత్ర ఆలోచనలు కలిగి, గాంధీ ప్రభావానికి లోనైనారు.

ఆర్యసమాజం, సంఘ సంస్కరణ ఉద్యమాలు, క్విట్ ఇండియా ఉద్యమానికి ఆకర్షితులై నిజాం పాలనకు, ఉర్దూ మీడియం పట్ల నిరసన వ్యక్తం చేశారు. నిజాం వ్యతిరేక సాయుధ రైతాంగ పోరాటంలో క్రియాశీలక పాత్ర పోషించారు. తర్వాతి కాలంలో మహాత్ముని ఆహార్యం, సిద్ధాంతాల ప్రభావాలకు లోనై, వాటిని పాటించడంతో తోటపల్లి గాంధీ అని పిలిచేవారు. 1935 డిసెంబర్ 29, 30, 31, 1936 జనవరి 1 తేదీలలో సిరిసిల్లలో జరిగిన ఆంధ్ర మహాసభలలో స్వచ్ఛంద దళ నేతగా సేవలందించారు. 1940లో చిల్వాకోడూరు, 1948లో జగిత్యాలలో, కోరుట్లలో వితంతు పునర్వివాహాలు జరిపించారు. 1945లో హరిజనులను దేవాలయ ప్రవేశం చేయించి సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. సురవరం ప్రతాపరెడ్డి గోల్కొండ పత్రికకు విలేఖరిగా పనిచేశారు. బోయినపల్లి కార్యకలాపాలను తెలుసుకున్న నిజాం, కుటుంబ సభ్యులను వేధించి తండ్రి కొండల్‌రావును మాలీ పటేల్ పదవి నుంచి తొలగించి, కుమారుని తలపై బహుమతి ప్రకటించారు. కొండల్‌రావును అక్టోబర్‌లో అరెస్టు చేసి జైలుపాలు చేయగా, వెంకటరామారావు తప్పించుకుని, మెట్‌పల్లి ఖాదీ వస్త్ర కర్మాగారంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి అజ్ఞాతవాసం గడిపారు. జమ్మికుంట రైల్వే లైను తొలగింపు కుట్ర కేసులో జైలుకు పంపారు. 1948లో గాంధీ మరణ వార్త విని జైలులో సంతాప సభ నిర్వహించారు. 1981లో ఖాదీ ఉద్యమాన్ని విస్తరించి, భారీ ఉత్పత్తులను, చేతి వృత్తులను కాపాడేందుకు "ఖాదీ నవ నిర్మాణ సమితి"ని స్థాపించారు. గాంధీ నెలకొల్పిన "అఖిల భారత సర్వసేవా సంఘం"లో సభ్యులైనారు. 1994లో ఎన్టీఆర్ ప్రభుత్వం మద్య నిషేధం విధించగా, జిల్లా కమిటీ అధ్యక్షులుగా పనిచేశారు. చంద్రబాబు ప్రభుత్వం మద్యనిషేధ ఉపసంహరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, ధర్నాలు, సత్యాగ్రహాలు చేశారు. హైదరాబాద్‌లో "దక్షిణ భారత హిందీ ప్రచారసభ" వ్యవస్థాపక సభ్యులు. స్వాతంత్ర్యానంతరం కరీంనగర్ జిల్లాలో సాహిత్య వికాసానికి ఎనలేని కృషి చేసిన సంస్కృతీపరుడు బోవెరా. గ్రంథాలయ ఉద్యమంలో భాగస్వామి అయిన అనుభవంతో "జిల్లా గ్రంథాలయ సంస్థ"కు పలుమార్లు "అధ్యక్షులు"గా సేవలందించారు. ఆంధ్ర విద్యాభివర్ధినీ గ్రంథాలయంను 1939లో తన 19వ ఏట స్థాపించి, 93వ ఏట మరణించే వరకూ కొనసాగించారు. 1962లో కరీంనగర్ జిల్లా రచయితల సంఘాన్ని స్థాపించి, కవిసమ్రాట్, విశ్వనాథ, దివాకర్ల, వానమామలై, దూపాటి, ఖండవల్లి, పల్లా దుర్గయ్య, దాశరథి, సినారె, శేషేంద్రశర్మ, పోరంకి, దేవులపల్లి, గజ్జెల మల్లారెడ్డి, కాళోజీ, శతావధాని కృష్ణమాచార్య, పీవీ నరసింహారావు, చొక్కారావు ఆదిగా పలువురు ప్రముఖులను తమ సంస్థ ద్వారా సన్మానితుల గావించారు. సినారె రాజ్యసభ సభ్యులుగా ఉండగా, ఆయన సహకారంతో కరీంనగర్ జిల్లా రచయితల, సారస్వత జ్యోతి మండలికి వేరు వేరుగా భవనాల నిర్మాణాలు చేయించారు. కరీంనగర్ జిల్లా చరిత్ర, శాసనాల పరిశోధనలలో దూపాటి వెంకట రమణాచార్యులు, బీఎన్ శాస్త్రి లాంటి వారితో స్వయంగా పర్యటనలో పాల్గొన్నారు. నాణేలు, ఇటుకలు, తాళపత్రాలు, బండ రాతలు, పురా వస్తువులు సేకరించి శాఖాపరం చేశారు. జిల్లాలో దేవాలయాలు, స్వాతంత్ర్య సంగ్రామం నాటి అనుభవాల వ్యాస సంకలనం, ఆంధ్ర మహాసభల నిర్వహణ పుస్తకం, వెంకటరామారావు గేయాలు స్వీయ రచనలు వెలువరించారు. 2001లో భారతమాత పురస్కారం, దివ్యజ్ఞాన సమాజం చెన్నై వారిచే లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు, రాజీవ్ మెమోరియల్ ట్రస్టు ద్వారా బంగారు కంకణం, గాంధీ మనమరాలు చేతుల మీదుగా రూ. లక్ష నగదు పొందారు. స్వర్ణ కంకణాలు, స్వర్ణ అభిషేకాలు స్వీకరించి, గ్రంథాలయ విభూషణ్, ఉపన్యాస కేసరి, విశ్వ బంధు. హరిజన బంధు, అపరగాంధీ లాంటి బిరుదులకు పాత్రులైనారు. 2005లో కాకతీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ బిరుదుతో సన్మానించింది. భారత ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధుల ఎంపిక కమిటీ రాష్ట్ర అధ్యక్షుడుగా, కేంద్ర ప్రభుత్వ కమిటీ సభ్యులుగా ఉన్నారు. 93 ఏళ్ల ప్రాయంలో జారిపడి 2014 అక్టోబర్ 27న చికిత్స పొందుతూ డెక్కన్ హాస్పిటల్‌లో తుదిశ్వాస విడిచారు. రాష్ట్ర ప్రభుత్వం మానేరు తీరాన అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించగా, నాటి సీఎం కేసీఆర్ తదితర ప్రముఖులు పాల్గొని నివాళులు అర్పించారు.

> కరీంనగర్ జిల్లాలో సాహిత్య వికాసానికి ఎనలేని కృషి చేసిన సంస్కృతీపరుడు బోవెరా. గ్రంథాలయ ఉద్యమంలో ఆంధ్ర విద్యాభివర్ధినీ గ్రంథాలయంను 1939లో తన 19వ ఏట స్థాపించి, 93వ ఏట 1962లో కరీంనగర్ జిల్లా రచయితల సంఘాన్ని స్థాపించి, కవిసమ్రాట్ విశ్వనాథ, దివాకర్ల, వానమామలై, దూపాటి, ఖండవల్లి, పల్లా దుర్గయ్య, దాశరథి, సినారె, శేషేంద్రశర్మ, పోరంకి, దేవులపల్లి, గజ్జెల మల్లారెడ్డి, కాళోజీ, శతావధాని కృష్ణమాచార్య, పీవీ నరసింహారావు, చొక్కారావు ఆదిగా పలువురు ప్రముఖులను సన్మానితుల గావించారు.



■ రామకిష్టయ్య సంగనభట్ల

బోవెరా 104వ జయంతి

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, సమసమాజ స్వాప్నికులు బోయినపల్లి వెంకటరామారావు (బోవెరా) 104వ జయంతి, బోవెరా స్మారక ఉపన్యాసం, బోవెరా కవితా పురస్కార ప్రదానం. ఈ కార్యక్రమాలు సెప్టెంబరు 2 మధ్యాహ్నం 3 గంటలకు పద్మనాయక కళ్యాణ మంటపం, హాల్ నెం.2, ముకరంపుర, కరీంనగర్‌లో జరుగుతాయి. బోవెరా స్మారక ఉపన్యాసాన్ని పూర్వ సీబీఐ అధికారి, జై భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జె.డి. లక్ష్మీనారాయణ చేస్తారు. బోవెరా కవితా పురస్కారాన్ని కీ.శే. గద్దర్‌కు మరణానంతరం ప్రదానం చేస్తారు. పురస్కారాన్ని గద్దర్ సతీమణి విమలా గద్దర్, తనయుడు సూర్యకిరణ్ స్వీకరిస్తారు. సభకు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ మరియు రవాణా శాఖామాత్యులు పొన్నం ప్రభాకర్; సభాధ్యక్షులుగా తెలంగాణ తొలి శాసన సభాపతి, ప్రస్తుత శాసనమండలి సభ్యులు సిరికొండ మధుసూదనాచారి; విశిష్ట అతిథిగా తెలంగాణ ఉద్యమ నాయకులు, శాసనమండలి సభ్యులు కె.కోదండరామ్; ప్రత్యేక అతిథిగా పురస్కార ప్రదాతగా తెలంగాణ రాష్ట్ర గీతకర్త అందెశ్రీ; ఆత్మీయ అతిథులుగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ యాదగిరి సునీల్‌రావు పాల్గొంటారు. మాడిశెట్టి గోపాల్ సభను నిర్వహిస్తారు.

– బోయినపల్లి హనుమంతరావు

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 24.6 కనిష్ఠం 22.3



ట్యాంక్‌బండ్‌పై గాలివానకు ఊగుతున్న కొమ్మలు

అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి

- హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం



భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్న వాతావరణశాఖ హెచ్చరికలతో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, వాటర్‌వర్క్స్, డీఆర్‌ఎఫ్, ఎన్డీఆర్‌ఎఫ్, విద్యుత్ విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, 141 వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద సిబ్బంది వెంటనే వరద వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పురాతన భవనాల్లో ఉన్నవారిని ఖాళీ చేయించాలన్నారు.


బషీర్‌బాగ్ వద్ద రహదారిపై వరద


అప్పా జంక్షన్ వద్ద కురుస్తున్న వర్షం

చెరువులు, నాలాల వద్ద జాగ్రత్త

- ప్రజలకు కలెక్టర్ పిలుపు
- రేపు ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు సెలవు



రెండురోజులపాటు భారీ వర్షాలు కురవనుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. ప్రధానంగా లోతట్టు, చెరువుల పరీవాహక ప్రాంతాలు, నాలాల వద్ద జాగ్రత్తగా ఉండాలని కోరారు. వర్షాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశం లో కలెక్టర్ అనుదీప్ మాట్లాడారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించామన్నారు. జిల్లాలో 59 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని.. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, విద్యుత్, ఆర్‌అండ్‌బీ అధికారులు నిరంతరం విధుల్లో ఉండాలని ఆదేశించారు. అత్యవసర సమయంలో హైదరాబాద్ కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం 040-23202813/9063423979, హైదరాబాద్ ఆర్డీవో- 7416818610/9985117660, సికింద్రాబాద్ ఆర్డీవో- 8019747481 లను సంప్రదించాలని తెలిపారు.

జడి వాన

గ్రేటర్‌లో రోజంతా జల్లులు

- తడిసిముద్దయిన నగరం
- రహదారులు జలమయం.. ట్రాఫిక్ అవస్థల్లో జనం
- అత్యధికంగా హయత్‌నగర్‌లో 3.5 సెం.మీ వర్షపాతం
- నగరానికి ఎల్లో హెచ్చరిక జారీ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మహానగరం తడిసిముద్దయ్యింది. శనివారం తెల్లవారుజామున మొదలైన వాన అర్ధరాత్రి వరకు కురుస్తూనే ఉంది. పలు మార్లు వస్తూ.. పోతూ కురవడంతో ప్రజా జీవనానికి అంతరాయం కలిగింది. విద్యాసంస్థలు, కార్యాలయాలకు వెళ్లేవారు ఇబ్బందులకు గురయ్యారు. రోజంతా ముసురుగా ఉండడంతో చలి తీవ్రత పెరిగింది. పలు ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. యూసఫ్‌గూడ, ఎర్రగడ్డ, మూసాపేట, అమీర్‌పేట, ఎర్రగడ్డ, పంజాగుట్ట, ఖైరతాబాద్, మెహిదీపట్నం, సికింద్రాబాద్, మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో వరద నిలిచి ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. రాత్రి 10 గంటల వరకు అత్యధికంగా హయత్‌నగర్‌లో 3.5 సెం.మీ వర్షం కురిసింది.


ఆర్టీసీ క్రాస్‌రోడ్డు వద్ద..


వర్షంలోనూ పారిశుధ్య పనుల్లో..

నగరంలో నమోదైన వర్షపాతం (రాత్రి 10 గంటల వరకు)

ప్రాంతం	నమోదైన వర్షపాతం
హయత్‌నగర్	3.5 (సెం.మీ)
సరూర్‌నగర్	3.4
వనస్థలిపురం	3.4
ముషీరాబాద్	3.3
అస్మాన్‌ఘడ్	3.2
మారేడుపల్లి	3.1
బండ్లగూడ	3.1
మల్కాజిగిరి	3.1
నాగోలు	3.1
అల్వాల్ టెలికం కాలనీ	2.0
ఈస్ట్ ఆనంద్‌బాగ్	2.0
కుత్బుల్లాపూర్	2.0
గాయత్రీనగర్	1.9
అడ్డగుట్ట	1.9
రాజేంద్రనగర్	1.9

రాత్రి 9 గంటల తర్వాత..

రాత్రి 9 గంటల తర్వాత పలు ప్రాంతాల్లో వాన దంచికొట్టడంతో రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మ్యాన్‌హోళ్లు ఉప్పొంగడంతో

మిగతా 4వ పేజీలో..



సెక్రటేరియట్ వద్ద బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

అత్యవసరమైతేనే బయటకు రండి

- పౌరులకు మేయర్ విజయలక్ష్మి హితవు
- సహాయం కోసం 040-21111111ను సంప్రదించండి



4

జంట జలాశయాలకు వరద

30 రోజుల్లో ఖాళీ చేయమంటే ఎలా?

- 30 ఏళ్లుగా నివాసముంటున్నాం..
- ప్రభుత్వాలు మారినప్పుడల్లా కొత్త నోటీసులా?
- అమర్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి
- దుర్గం చెరువు కబ్జా కాలేదు : రిటైర్డ్ ఐజీ



- '30 సంవత్సరాల క్రితమే అన్ని ప్రభుత్వ విభాగాలతో అనుమతులు తీసుకొని ఇళ్లు కట్టుకొని ఉంటున్నాం. ఇంటి పన్ను చెల్లిస్తున్నాం. ఇప్పుడు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చి 30 రోజుల్లో ఖాళీ చేయమంటున్నారు. ఇదెక్కడి న్యాయం? ప్రభుత్వాలు మారినప్పుడల్లా కొత్త నోటీసులు ఇస్తే ఎలా ?'
- అమర్ కోఆపరేటివ్ సొసైటీ వెల్ఫేర్ అసోసియేషన్, నెక్టర్‌గార్డెన్ కాలనీ వాసుల ఆవేదన

6

సుందరీకరణ పేరిట చెరువులకు ఉరి!

- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన హైడ్రా అధికారులు
- పోటీపడి పనులు చేసిన ప్రభుత్వ శాఖలు
- చుట్టూ మట్టి పోసి.. బండ్‌లు నిర్మించి
- మురుగు మళ్లింపు పేరిట పెద్ద మాయ
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ రూల్స్ బేఖాతర్
- ఆక్రమణలు క్రమబద్ధీకరించేలా చర్యలు

- ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలో సుందరీకరణ పనులా? చెరువులను పూడ్చి పనులు ఎలా నిర్వహిస్తారు? ఇలాగైతే ఎగువ నుంచి వరద ఎలా వెళ్తుంది?
- ఇటీవల మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని చంద, మంత్రాల, పెద్ద చెరువులను సందర్శించిన సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ విస్మయం.


ఉప్పల్ నల్లచెరువులో నిర్మించిన కట్ట

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సుందరీకరణ పేరుతో సర్కారీ శాఖలు చెరువులను చెరబట్టాయి. పోటీ పడి పనులు నిర్వహించి ఆక్రమణలకు ఆస్కారమిచ్చాయి. నగరంలో చాలాచోట్ల ఆహ్లాదం, సుందరీకరణ అంటూ గత ప్రభుత్వ హయాంలో చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేపట్టాయి. చుట్టూ మట్టిపోసి వాకింగ్ ట్రాక్‌లు, ల్యాండ్ స్కేపింగ్ నిర్మించారు. సందర్శకులు సరదాగా గడిపేందుకు, సేద తీరేందుకు కుర్చీలు ఏర్పాటు చేశారు. ఏళ్ల తరబడి ఆక్రమణల తొలగింపునకు జరుగుతున్న ప్రయత్నాలు ఫలించడం లేదని.. ఉన్న చెరువులను పనులకు శ్రీకారం చుట్టారు. రూ.161 కోట్లతో 47 చెరువుల్లో సుందరీకరణ పనులు చేపట్టారు. 2018 నుంచి దశలవారీగా పనులు జరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ సాగుతూనే ఉన్నాయి. 2020లో రికార్డు స్థాయిలో కురిసిన వర్షానికి గతంలో ఎప్పుడూ ముంపునకు గురవని కాలనీలు, బస్తీల్లోని ఇళ్లలోకి నీళ్లు రావడానికి చెరువుల చుట్టూ చేసిన పనులే కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సుందరీకరణ పేరిట చెరువులకు ఉరి వేసిన విషయాన్ని హైడ్రా ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది.


కూకట్‌పల్లి ఎల్లమ్మ చెరువులో నిర్మాణ వ్యర్థాలు

నలు వైపులా భారీ కట్టలు

వాస్తవంగా ఏ చెరువుకైనా ఒకవైపు బండ్ (కట్ట), మరో వైపు సామర్థ్యానికి మించిన నీరు దిగువకు వెళ్లేలా అలుగు(మత్తడి) ఉంటాయి. మిగతా వైపుల నుంచి వర్షపు నీరు చెరువులో చేరేందుకు వీలుగా ఇన్‌లెట్‌లు, అనుసంధానంగా నాలాలు, ఖాళీ స్థలం ఉంటుంది. అభివృద్ధి పేరిట జీహెచ్‌ఎంసీ చెరువు చుట్టూ కొంత స్థలాన్ని వదిలి ట్రాక్‌ల నిర్మాణం కోసం చుట్టూ మట్టితో బండ్‌లు నిర్మించారు. దీంతో చెరువులోకి వరద నీరు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఇది సహజసిద్ధ ప్రవాహ వ్యవస్థకు విరుద్ధం. మురుగునీటి మళ్లింపు, వాకింగ్ ట్రాక్‌ల కోసమే బండ్‌లు నిర్మించినట్టు అధికారులు తెలిపారు. నగరంలోని చాకలివాని చెరువు, దోబీ చెరువు, గోపన్‌పల్లి పెద్ద చెరువు, కూకట్‌పల్లి ఎల్లమ్మ చెరువు, బంజారా లేక్, ఉప్పల్ నల్లచెరువు, బాతుల కుంట, కాప్రా తదితర చెరువుల్లో

మిగతా 6వ పేజీలో..

ఆడంబరంగా వినాయక ఉత్సవాలు

- నిరంతరం అప్రమత్తంగా ఉండాలి
- గతేడాది కంటే అదనపు క్రేన్లు
- సమీక్షలో మేయర్ విజయలక్ష్మి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రి ఉత్సవాలను గ్రేటర్ వ్యాప్తంగా ఆడంబరంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని బల్దియా మేయర్ గద్వాల విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ సూచించిన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. వినాయక చవితి సమీపిస్తుండడంతో శనివారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో పోలీస్, జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు, జోనల్ కమిషనర్లు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ పండుగను ప్రజలంతా ఘనంగా జరుపుకునేలా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. ప్రతి జోన్‌లో నిమజ్జనం జరిగే చెరువులు, బేబీపాండ్స్‌ను శుభ్రంగా ఉంచాలని..అవసరమైన చోట తాత్కాలిక టాయిలెట్లు, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. గతేడాది కంటే అదనంగా క్రేన్లను ఏర్పాటు చేయాలని, రోడ్లపై బారికేడ్లు, శానిటేషన్, పబ్లిక్ టాయిలెట్లు, ట్రీ కటింగ్, ఆరోగ్య శిబిరాలు, బోట్లు, నిరంతర విద్యుత్తు సరఫరా,

మిగతా 6వ పేజీలో..


సమావేశంలో పాల్గొన్న మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఆమ్రపాలి, సీపీ కొత్తకోట

నగరాభివృద్ధికి పటిష్ఠ ప్రణాళిక : ఆమ్రపాలి

గ్రేటర్ అభివృద్ధికి జీహెచ్‌ఎంసీ అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ఆమ్రపాలి కోరారు. సిటీ కన్వర్జెన్సీ సమావేశంలో ఆమె మాట్లాడారు. హైదరాబాద్ ఇమేజ్‌ను మరింత పెంచడానికి, పెద్దఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అని చెప్పారు. సిటీ సమగ్ర అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. గతంలో చేపట్టిన పనులు, పూర్తయిన పనులు, ట్రాఫిక్ సమస్యలు, రోడ్‌సేఫ్టీ, వాటర్ లాగింగ్ పాయింట్లు, ఇరుకురోడ్లకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలు, ట్రాఫిక్ నియంత్రణకు ఆయా జంక్షన్లలో చేపట్టాల్సిన పనులపై అంతకుముందు చర్చించారు. అదే విధంగా కొత్త ప్రతిపాదనలకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఫ్లైఓవర్ నిర్మాణాలు, సైన్ బోర్డుల ఏర్పాటు, కొత్త రోడ్ల అభివృద్ధి, జంక్షన్ల విస్తరణ, ఫ్రీలెఫ్ట్, ర్యాంపుల ఏర్పాటు, అండర్‌పాస్ నిర్మాణాలు, ట్రాఫిక్‌సిగ్నల్స్ నిర్వహణ, బ్లాక్ పాయింట్ల గుర్తింపు తదితర పనులకు పరిపాలన మంజూరు, విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటు, తదితరాలపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. రోడ్లు, జంక్షన్లు, ట్రాఫిక్ సమస్యలకు సంబంధించి హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్లు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

వారాంతాల్లో దూకుడు

- పబ్‌లు, క్లబ్‌లపై ఎక్సైజ్, టీజీ న్యాబ్ దాడులు
- 130 మందికి డ్రగ్స్ పరీక్షలు.. ఆరుగురికి పాజిటివ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వారాంతాల్లో పబ్‌లు, క్లబ్‌లు, బార్లలో ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, నార్కోటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్) పోలీసుల సంయుక్త దాడులు కొనసాగుతున్నాయి. శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి 1 గంట వరకు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి తదితర చోట్ల 25 ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. 130 మంది అనుమానితులకు డ్రగ్స్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా ఆరుగురికి పాజిటివ్ నిర్ధారణ అయ్యింది.


పబ్‌లు, క్లబ్‌లలో తనిఖీలు చేస్తున్న అధికారులు

అసెంబ్లీ ముట్టడికి సర్పంచుల యత్నం

● పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే స్థానిక ఎన్నికలను అడ్డుకుంటామని హెచ్చరిక

మంగళ్‌హాట్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జోరువానను లెక్క చేయకుండా తమ పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సర్పంచులు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. అక్కడున్న పోలీసులు వారిని అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడు సుర్వీ యాదయ్యగౌడ్ మాట్లాడుతూ... గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేసిన సర్పంచులు పెండింగ్ బిల్లులు రాక, వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికే కొంతమంది ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకొని న్యాయం చేయాలని కోరారు. తమ పెండింగ్ బిల్లులను చెల్లించకపోతే స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఎన్నికల కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.


ఎన్నికల సంఘం కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచులు

ఆకట్టుకున్న ఐదుగురు నాట్య గురువుల ప్రదర్శన

రవీంద్రభారతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య కవితా సౌందర్యంపై ప్రత్యేక శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. శనివారం రవీంద్రభారతిలో భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, శంకరానంద కళాక్షేత్ర, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తామ్రపాత్ర లైవ్ శీర్షికన అన్నమయ్య కవితా సౌందర్యంపై ఆధారపడిన ప్రత్యేకమైన శాస్త్రీయ నృత్యాన్ని ప్రదర్శించారు.

కార్యక్రమంలో భాగంగా ఐదుగురు ప్రముఖ నాట్య గురువులు ఆనంద శంకర్ జయంత్, అనుపమ కైలాష్, దీపికారెడ్డి, గోపికావర్మ, వైభవ్ అరేకర్ ప్రదర్శన ఇచ్చారు. భరతనాట్యం, కూచిపూడి, మోహినియట్టం రూపాల్లో ప్రదర్శన సాగింది. ముందుగా అన్నమయ్యకు శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం వైభవ్ అరకర్ కృష్ణుడి పాత్రలో మధురకు వెళ్లే ముందు రాధతో తన చివరి క్షణాలను గుర్తుచేసుకుంటూ నర్తించి భళా అనిపించారు. నాట్యకారిణి ఆనంద శంకర్ జయంత్ అలివేలుమంగ, వెంకటేశ్వరుల సమాగమాన్ని వర్ణించే సంకీర్తన ద్వారా ప్రేక్షకుల్ని మైమరిపించారు. వేంకటేశ్వరుడిని కీర్తిస్తూ ప్రముఖ కూచిపూడి నర్తకి దీపికారెడ్డి అన్నమయ్య కీర్తనపై నర్తించారు. కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ కళాకారులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదుగురు ప్రముఖ నర్తకులు ఒకే వేదికపై ఒకే సమయంలో ప్రదర్శించడం ఆనందకరమని అన్నారు.


నాట్యం చేస్తున్న ఐదుగురు నాట్య గురువులు

అత్యవసరమైతేనే బయటకు రండి

హైదరాబాద్ సిటీ: గ్రేటర్ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో అత్యవసరమైతేనే బయటకు రావాలని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి కోరారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, కమిషనర్ ఆమ్రపాలి, జోనల్ కమిషనర్లతో మేయర్ సమావేశమయ్యారు. మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలు 24 గంటలు అందుబాటులో ఉండాలని, అధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఏదైనా సహాయం కావాలంటే జీహెచ్‌ఎంసీ కంట్రోల్ రూం 040-21111111ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. మ్యాన్‌హోల్స్ ఓపెన్ చేయవద్దని, వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద సిబ్బంది నీటిని తొలగించాలని కమిషనర్ ఆమ్రపాలి ఆదేశించారు.

జంట జలాశయాలకు వరద

రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో కురుస్తున్న వర్షాలకు జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్(గండిపేట), హిమాయత్‌సాగర్ రిజర్వాయర్లకు వరద భారీగా చేరుతోంది. రెండుమూడు రోజులపాటు వర్షాలు ఉంటాయన్న వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో మూసీ పరీవాహక ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సూచించారు. క్షేత్రస్థాయిలో ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లు (ఈఆర్టీ), ఎస్పీటీ వాహనాల సిబ్బంది చురుగ్గా పనిచేయాలని, తరచూ పొంగే మ్యాన్‌హోళ్లు గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

నిండుకుండలా హుస్సేన్‌సాగర్



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో హుస్సేన్‌సాగర్ నిండుకుండలా మారింది. బంజారా, పికెట్, కూకట్‌పల్లి నాలాలతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వరద పోటెత్తడంతో సాగర్‌కు భారీగా వరద చేరుతోంది. నీటి మట్టం ఫుల్ ట్యాంక్‌లెవల్ దాటడంతో తూముల ద్వారా నీటిని మూసీలోకి వదులుతున్నారు. దీంతో మూసీ పరీవాహక ప్రాంత ప్రజలను జీహెచ్‌ఎంసీ అప్రమత్తం చేసింది. హుస్సేన్‌సాగర్ ఫుల్ ట్యాంక్ లెవల్ 513.41 మీటర్లు కాగా, ప్రస్తుతం 513.43 మీటర్లుగా ఉంది.

జడి వాన

(3వ పేజీ తరువాయి)

వాహనాలు నెమ్మదిగా సాగాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం తలెత్తడంతో చీకట్లు కమ్ముకున్నాయి.

అధికారులు, సిబ్బంది అలర్ట్‌గా ఉండాలి: ముషారఫ్, సీఎండీ, దక్షిణ డిస్కం

వర్షాల నేపథ్యంలో ఉన్నతాధికారులు, సిబ్బంది, క్షేత్రస్థాయిలో ఫ్యూజ్ ఆఫ్ కాల్ (ఎఫ్ఓసీ) బృందాలు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని దక్షిణ డిస్కం సీఎండీ ముషారఫ్ ఫారూఖి సీఈలను ఆదేశించారు. ఎక్కడా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా, అంతరాయాలు లేకుండా చూడాలన్నారు. విద్యుత్ సమస్యలపై 1912 టోల్‌ఫ్రీ నంబర్‌తోపాటు టీజీఎస్పీడీసీఎల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.



నినాదాలు చేస్తున్న వాటర్‌బోర్డు నాయకులు, ఉద్యోగ ప్రతినిధులు

ఏకీకృత పెన్షన్ విధానాన్ని అనుమతించొద్దు

టీజీఓ, టీఎన్‌జీఓల ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏకీకృత పెన్షన్ విధానాన్ని అనుమతించొద్దు అని.. 1980 రివైజ్డ్ పెన్షన్ రూల్స్ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది. ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం గన్‌పార్కు వద్ద చేపట్టే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీజీఓ, టీఎన్‌జీఓలకు చెందిన వాటర్‌బోర్డు నాయకులు, ఉద్యోగ ప్రతినిధులు ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏకీకృత పెన్షన్ విధానం వల్ల ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు. ఏకీకృత పెన్షన్ విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించేది లేదని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో టీజీవో హైదరాబాద్ జిల్లా సెక్రెటరీ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ఇతర యూనియన్ నాయకులు ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.



గోషామహల్‌లో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోటి శైలేష్, వినోద్ యాదవ్, బస్తీవాసులు

గోషామహల్‌లో ఉస్మానియా ఆస్పత్రిని నిర్మించొద్దు

● పోలీసు స్టేడియం వద్ద బస్తీవాసుల నిరసన

గోషామహల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ పోలీసు స్టేడియంలో ఉస్మానియా ఆస్పత్రి నూతన భవనాన్ని నిర్మించొద్దని బీఆర్‌ఎస్ బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోటి శైలేష్, వినోద్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం గోషామహల్‌లో ఆర్యసమాజ్, కొత్త బస్తీ, జోషివాడీ, చాక్నావాడికి చెందిన వందలాదిమంది బస్తీవాసులు అక్కడికి చేరుకొని ఉస్మానియా ఆస్పత్రిని నిర్మించొద్దంటూ నిరసన తెలపడంతో పాటు స్థానికుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ... ప్రస్తుతం ఉన్న ఆస్పత్రిలోని ఖాళీ స్థలంలో ఉస్మానియా ఆస్పత్రి నూతన భవనాన్ని నిర్మించవచ్చన్నారు. గోషామహల్ మైదానం చుట్టూ అనేక కాలనీలు ఉన్నాయని.. ఒకవేళ ఉస్మానియా ఆస్పత్రితోపాటు మార్చురీ ఏర్పాటు చేస్తే పరిసరాలు కలుషితం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

సాహచర్య బంధం పుస్తకావిష్కరణ

రవీంద్రభారతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మనసున మనసై ఫేస్‌బుక్ సమూహపు సంయుక్త ఆధ్వర్యంలో పద్మా దాశరథి రచించిన పద్మాదాశరథి రచనలు, సాహచర్య బంధం పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం శనివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మి సభాధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ రచయిత ప్రభాకర్ జైని, ఆత్మీయ అతిథిగా మామిడన్న సుబ్బారావు, విశిష్ట అతిథిగా మామిడి హరికృష్ణ, కాకునూరి దాశరథి తదితరులు హాజరై పుస్తకాలను ఆవిష్కరించారు. సాహచర్య బంధంలోని మొదటి నవల సాహచర్యంలో వృద్ధాప్యంలోని స్త్రీ పురుషుల మధ్య ఉండాల్సిన స్నేహ బంధాన్ని వివరించారని అన్నారు. ఈ కార్యక్రమంలో దూసి గీత, నందూరి సుందరీనాగమణి, జొన్నలగడ్డ కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ మండపాలకు ఉచితంగా విద్యుత్‌పై హర్షం

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వినాయక మండపాలకు ఉచితంగా విద్యుత్‌ను అందించడానికి సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నామని ప్రకటించడంపై హర్షం వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయంతో తెలంగాణ చరిత్రలో రేవంత్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. ఈ మేరకు శనివారం గాంధీభవన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి కూడా వినాయక ఉత్సవాలకు ఉచిత కరెంటు ఇస్తానని చెప్పలేదని గుర్తుచేశారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి అభ్యర్థన మేరకు సీఎం సానుకూలంగా స్పందించడం శుభపరిణామమన్నారు.

రోడ్డుపై చెట్లకొమ్మలను తొలగించండి

గోషామహల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జియాగూడ దుర్గానగర్‌బస్తీలోని భారత అభ్యుదయ పాఠశాల పక్కన కొట్టివేసిన చెట్లకొమ్మలను అక్కడే వేశారు. దీంతో ఈదారి గుండా వెళ్లే పాఠశాల విద్యార్థులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నా వాటిని తొలగించడంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జియాగూడ పేరెంట్స్ అసోసియేషన్ కన్వీనర్ పి.నాగేశ్వర్, వికలాంగుల సంఘం దుర్గానగర్ నాయకుడు వి.నరేశ్ అన్నారు. ఈ మేరకు శనివారం వారు దుర్గానగర్ బస్తీని సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సమస్యను స్థానిక కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేదన్నారు. దీంతో ప్రాంతమంతా చెత్తకుప్పగా మారిందని, దోమల బెడద తీవ్రంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

మారం జగదీశ్వర్



మాట్లాడుతున్న టీఎన్‌జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్

రాజేంద్రనగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్వవిద్యాలయాల ఉద్యోగులు, నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలను త్వరలోనే సీఎం ఎ.రేవంత్ రెడ్డి దగ్గర చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని టీఎన్‌జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం హుస్సేనీ ముజీబ్ తెలిపారు. టీఎన్‌జీవోస్ సెంట్రల్ యూనియన్ పాలకవర్గం సభ్యులతోపాటు టీజీవోస్ కేంద్ర సంఘం నాయకులను శనివారం రాజేంద్రనగర్‌లోని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం టీచింగ్, నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సన్మానం అందుకున్న నాయకులు మారం జగదీశ్, డాక్టర్ ఎస్ఎం హుస్సేనీ ముజీబ్, ఏలూరి శ్రీనివాస్, ఎ.సత్యనారాయణ మాట్లాడుతూ, పశువైద్య విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సంఘం నాయకులకు అండగా ఉంటామన్నారు. వర్సిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మహ్మద్ షర్ఫుద్దీన్ మాట్లాడుతూ, విశ్వవిద్యాలయాలకు పూర్తిస్థాయి వైస్‌చాన్సులర్లను నియమించేలా టీఎన్‌జీవోస్, టీజీవోస్ కేంద్ర నాయకత్వం చొరవ తీసుకోవాలన్నారు. పాతపెన్షన్ స్కీమ్‌ను అందరు ఉద్యోగులకు అమలు చేయాలన్నారు. విశ్వవిద్యాలయాల పాలక మండలిలో బోధనేతర సిబ్బంది నుంచి ఒకరికి అవకాశం కల్పించాలన్నారు. హెల్త్ కార్డులను అందజేసి, నగదు రహిత వైద్య సేవలను ప్రతి ఉద్యోగికీ ఇవ్వాలన్నారు. ఆరు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లుల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. టైంస్కేల్ వర్కర్స్‌ను పర్మినెంట్ చేయాలన్నారు. ఖాళీగా ఉన్న నాలుగో తరగతి ఉద్యోగుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలన్నారు. కార్మికులను కాంట్రాక్టు పద్ధతిన కాకుండా దినసరి కూలీలుగా తీసుకుని వేతనాలు ప్రభుత్వమే చెల్లించాలన్నారు.

సంబురంగా బృంద నృత్యాలయ వార్షికోత్సవం



కార్యక్రమంలో కళాకారులు

రవీంద్రభారతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ నృత్యరీతులను అలవోకగా ప్రదర్శిస్తూ సాగిన కళాకారుల ప్రదర్శన ప్రేక్షకుల్ని సమ్మోహనపరిచింది. శనివారం తెలుగు వర్సిటీలోని ఆడిటోరియంలో బృంద నృత్యాలయ వార్షికోత్సవం జరిగింది. ప్రముఖ నాట్య గురువు పీఎస్ ప్రియాంక శిష్యబృందంతో కలిసి శాస్త్రీయ నాట్యాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ఇండియన్ ఐడియల్ సింగర్ కేశవ్ రామ్ ముఖ్య అతిథిగా విచ్చేసి కళాకారులను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ కళారూపాలు అరుదుగా కనిపించే ఈ రోజుల్లో చిన్నారులు అద్భుతమైన నృత్యాలను ప్రదర్శించడం అభినందనీయమని అన్నారు. చిన్నారుల్లో విద్యతో పాటు శాస్త్రీయ కళల్లో ప్రావీణ్యం పొందేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. నాట్యగురువు ప్రియాంక మాట్లాడుతూ నాట్యమంటే తనకు ఆరాధన అని అన్నారు. రేపటి తరానికి నాట్యాన్ని అందించే ప్రయత్నం చేస్తున్నానని అన్నారు. సభకు ముందు కళాకారులు పలు నృత్యాంశాలను ప్రదర్శించారు. పుష్పాంజలి, దశావతారం, మంగళం, తిల్లాన, తదితర అంశాల్లో నర్తించి భళా అనిపించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల రాంప్రసాద్ తదితరులు

4న కలెక్టరేట్ల ముట్టడి

● ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి

బర్కత్‌పుర , ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 4 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కో కన్వీనర్లు బత్తుల రాంప్రసాద్, పిల్లి సుధాకర్, జంగా శ్రీనివాస్, గుడిమల్ల వినోద్‌కుమార్, సత్యనారాయణ తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఈనెల 4న రాష్ట్రంలోని 33 జిల్లాల కలెక్టరేట్ల ఎదుట నిరసన దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పిస్తామన్నారు. ఈనెల 11న ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్ పిలుపుమేరకు చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించి జంతర్ మంతర్ వద్ద ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మహాధర్నా నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. ఈనెల 19న సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఎంఆర్‌పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని వారు ఆరోపించారు.

10న విద్యార్థుల మహాగర్జన: ఎస్ఎఫ్ఐ



మహాగర్జన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బర్కత్‌పుర , ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడిచినా విద్యారంగ సమస్యలు తిష్టవేశాయని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 10న విద్యార్థి మహాగర్జన నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. ఉదయం 10 గంటలకు ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఈ మహాగర్జనను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం బసీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మహాగర్జన వాల్‌పోస్టర్‌ను ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ ఎల్.మూర్తి, ప్రధానకార్యదర్శి టి.నాగరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇంతవరకు రాష్ట్రంలో విద్యాశాఖమంత్రిని నియమించలేదని వారు ఆరోపించారు. రూ.8 వేల కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలలో 70శాతానికి పైగా ఉన్న ప్రొఫెసర్ పోస్టుల ఖాళీలను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఎం.మమత, డి.కిరణ్, కె.అశోక్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎ.లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడింగ్‌లో అధిక లాభాలిస్తామని వృద్ధుడిని నమ్మించి రూ.10.53 లక్షలు కొల్లగొట్టిన సైబర్‌నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ట్రేడింగ్‌లో అధిక లాభాలు ఇస్తామని నమ్మించిన సైబర్ క్రిమినల్స్ .. 62 ఏళ్ల వృద్ధుడిని 'మామ్' వాట్సాప్ క్లబ్‌లో చేర్పించి, లాభాలు ఇస్తున్నట్లు నటించి రూ.10,53,696లను కొల్లగొట్టారు. బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి గోడు వెల్లబోసుకున్నాడు. సైబర్‌క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫేస్‌బుక్ చూస్తున్న బాధితుడికి ఒక ప్రకటన కనిపించింది. స్టాక్ ట్రేడింగ్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే.. అధిక లాభాలు వస్తాయని ఉంది. దాంతో ఆ లింక్‌పై క్లిక్‌చేశాడు. వెంటనే లైన్‌లోకి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు బాధితుడి ఫోన్ నంబర్‌ను 'మామ్ క్లబ్ వాట్సాప్‌లో చేర్పించారు. ముందుగా కొద్దిమొత్తంలో పెట్టుబడి పెట్టించిన క్రిమినల్స్ కొద్దిమొత్తంలో లాభాలు ఇచ్చారు. వాటిని విత్‌డ్రా చేసుకున్న బాధితుడు ఇదంతా నిజమైన స్టాక్ ట్రేడింగ్ అని నమ్మాడు. అలా సైబర్ నేరగాళ్లు మెల్లగా బాధితుడిని ఊబిలోకి దింపి.. ఇంకా ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మించి ప్లేస్టోర్ నుంచి 'ఎంటీపీఎస్' అప్లికేషన్ డౌన్‌లోడ్ చేయించారు. ఆ తర్వాత నలుగురు మాత్రమే ఉన్న మరో గ్రూపు 'మామ్ క్లబ్ వీఐపీ ఏ97' లో చేర్పించారు. ఆ తర్వాత నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్ సృష్టించి విడతలవారీగా పెట్టుబడులు పెట్టించి రూ.10,53,696 కొల్లగొట్టారు. విత్‌డ్రా ఆప్షన్ క్లోజ్ చేసిన మోసగాళ్లు.. ఇంకా ఇంకా పెట్టుబడులు పెట్టాలని ఒత్తిడి చేయడంతో బాధితుడు మోసపోయినట్లు గుర్తించి సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిరమలై రామన్

దేశ వనరులు దోచుకున్న సంపన్నుల ఆస్తులను జాతీయం చేయాలి

ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్

హిమాయత్‌నగర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): దేశవనరులను యథేచ్ఛగా దోచుకుంటున్న సంపన్నుల ఆస్తులను జాతీయంచేయాలని ఏఐవైఎఫ్ జాతీయ ప్రధానకార్యదర్శి తిరుమలై రామన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏఐవైఎఫ్ విభాగం ఆధ్వర్యంలో శనివారం హిమాయత్‌నగర్‌లోని కామ్రేడ్ సత్యనారాయణ రెడ్డి భవన్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ సంపదను అడ్డదారుల్లో అంబానీ, అదానీ వంటి బడా వ్యాపారులు దోచుకున్నారని, రాజకీయ అండ కూడా వారి అక్రమాలకు తోడైందని ఆరోపించారు. అలాంటి వారు దోచుకున్న ఆస్తులను జాతీయం చేస్తే దేశంలో పేదరికం చాలా వరకు తగ్గిపోతుందని అన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలిఉల్లా ఖాద్రీ, కల్లూరి ధర్మేంద్ర మాట్లాడుతూ భగత్‌సింగ్ జీవిత చరిత్రను రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యాంశాల్లో చేర్చాలని, లేదంటే బీజేపీ పూర్తిగా వక్రీకరిస్తూ ప్రజలు, విద్యార్థుల, యువతను తప్పుదోవపట్టిస్తుందని ఆరోపించారు. సంఘం నేతలు శ్రీకాంత్, లింగంరవి, రాజ్‌కుమార్, లక్ష్మణ్, సత్యప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో ప్లకార్డులను ప్రదర్శిస్తున్న కుకీలు

మణిపూర్‌లో కుకీ తెగ నివాస ప్రాంతాన్ని కేంద్రపాలితంగా ప్రకటించాలి

● కుకీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్

బర్కత్‌పుర , ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మణిపూర్‌లో కుకీలు నివసిస్తున్న ప్రాంతాన్ని కేంద్రపాలిత ప్రాంతం(యూనియన్ టెర్రిటోరి)గా ప్రకటించి, పూర్తిరక్షణ కల్పించాలని కుకీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ బ్రాంచి డిమాండ్ చేసింది. పాండిచ్చేరి మాదిరిగా రాజ్యాంగంలోని 239వ ఆర్టికల్ ప్రకారం కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటిస్తే మణిపూర్ రాష్ట్రంలో కుకీలు శాంతియుత జీవనం సాగిస్తారని వారు తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుకీ ఐఎస్ఎస్‌పీ ప్రతినిధులు లూనాడొంగల్, లెట్‌కోలన్ నవంటక్, ఫ్రాన్సిస్ హోకిట్, కూకి స్టూడెంట్ ఆర్గనైజేషన్ ప్రధానకార్యదర్శి తొంగమిన్ తాంగాహాకిప్, కోశాధికారి గ్రేసి కాన్సాయి, జోయ్‌సీ చాంగులాయి తదితరులు మాట్లాడారు. మణిపూర్‌లో కుకి, నాగోస్ 48శాతం జనాభా ఉండగా మైతాస్ కులస్థులు 52 శాతం ఉన్నారని గత సంవత్సరం జరిగిన సంఘటనల్లో కుకీలు తీవ్రంగా నష్టపోయారని వారు ఆరోపించారు. మణిపూర్‌లో మెజార్టీ కులస్థులైన మైథాస్‌లతో కలిసి జీవించాలని కుకీలు కోరుకోవడం లేదని, మళ్లీ దాడులు జరుగుతాయోమనని, తాము ఇండియా నుంచి విడిపోయే ప్రసక్తే లేదని వారు స్పష్టం చేశారు.



విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ప్రదర్శన

చార్మినార్ ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వ్యర్థాలను బయట వేయకుండా వాటితో కొత్తకొత్త వస్తువులు తయారు చేసి పర్యావరణాన్ని కాపాడాలని హుస్సేనిఆలం ప్రభుత్వ మహిళా కళాశాల, ప్రిన్సిపాల్ సీహెచ్.అప్పియ చిన్నమ్మ అన్నారు. శనివారం హుస్సేనీ ఆలం కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం, ఇకో క్లబ్ ఆధ్వర్యంలో బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్ (వ్యర్థపదార్థాల నుంచి ఉత్తమ సృజనాత్మక వస్తువులను సృష్టించడం అనే అంశం మీద (ఎగ్జిబిషన్)ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అప్పియ చిన్నమ్మ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు వాడిన వేస్ట్ న్యూస్ పేపర్స్ వుడెన్, అట్టముక్కలను ఉపయోగించి వివిధ రకాల సృజనాత్మక వస్తువులను, పూలకుండీలను, పెన్ స్టాండ్స్, పోస్టర్‌ను తయారు చేసి ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పి.లత, వి.సునీత, కె.విద్యాధరి, కె.శ్రీదేవి, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.



కాలే సత్‌కీర్తన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ వై.కృష్ణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఆలే భాస్కర్ రాజ్ తదితరులు

మాజీ కార్పొరేటర్ సతీమణి సత్‌కీర్తన సంతాప సభ

చాంద్రాయణగుట్ట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ గౌలిపురా డివిజన్ మాజీ కార్పొరేటర్, ఫ్లోర్ లీడర్ దివంగత కాలే ముత్యాలు సతీమణి కాలే సత్‌కీర్తన దశదినకర్మ గౌలిపురాలోని గంగపుత్ర సంఘంలో ఘనంగా జరిగింది. సత్‌కీర్తన చిత్రపటానికి మాజీ కార్పొరేటర్ వై.కృష్ణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షులు ఆలే భాస్కర్ రాజ్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వై.కృష్ణ మాట్లాడుతూ... అనాడు ముత్యాలు కార్పొరేటర్‌గా కొనసాగుతున్న సమయంలో భార్య సత్‌కీర్తన ప్రజాసమస్యల పరిష్కారంలో ఆయనకు చేదోడువాదోడుగా ఉండేదని.. ఈరోజు ఆమె మన మధ్య లేకపోవడం బాధాకర విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె కుటుంబ సభ్యులు కాలే కృష్ణ, కాలే ఆనంద్, కాలే శ్రీనివాస్, కాలే అమరేశ్, కాలే అనిల్‌కుమార్, కాలే అమర్‌నాథ్, కాలే శ్రీకాంత్, కాలే అభిలాష్, కాలే అశ్విన్, కాలే సాయి కుమార్, కాలే అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతం



వరలక్ష్మి వ్రతం చేస్తున్న మహిళలు

చార్మినార్ ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకొని మీరాలం మండిలోని శ్రీమహంకాళేశ్వర దేవాలయంలో సాయంత్రం నుంచి సామూహిక వరలక్ష్మీ వ్రతం పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మీరాలమంమండి భక్తులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మహిళలు పూజలు నిర్వహించారు. పంచ హారతి, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను కనులపండువగా నిర్వహించారు.



కార్యక్రమంలో పాల్గొన్న రిజిస్ట్రార్ భట్టు రమేష్

తెలుగు వర్సిటీలో ఇద్దరికి విరమణ వీడ్కోలు

రవీంద్రభారతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): పొట్టిశ్రీరాములు, తెలుగు విశ్వవిద్యాలయంలో దశాబ్దాలుగా శిల్పం, చిత్ర లేఖన శాఖలో పనిచేస్తున్న డా.కె.శ్రీనివాసాచారి, వర్సిటీ ఆర్థికాధికారిగా పనిచేస్తున్న ఎం.ప్రసాద్ ఉద్యోగ విరమణ చేశారు. శనివారం వర్సిటీలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ పాల్గొని ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులను సత్కరించారు. వీరద్దరూ వర్సిటీకి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆచార్య రెడ్డిశ్యామల, ఆచార్య వెంకట్రామయ్య, డా.వెంకటేశం, డా.రింగు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



మధుకుమార్ దంపతులను సన్మానిస్తున్న వినియోగదారుల ఫోరం అధికారులు

వినియోగదారుల ఫోరం సూపరింటెండెంట్ ఉద్యోగ విరమణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా 1 వినియోగదారుల కమిషన్ సూపరింటెండెంట్ కె.మధుకుమార్ శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఫోరంలో శనివారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో మధుకుమార్ సతీమణి మహబూబ్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి ఇందిరను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల స్టేట్ కమిషన్ ఇన్‌చార్జి ప్రెసిడెంట్ మీనా రామనాథన్, సభ్యులు ఆర్ఎస్ రాజశ్రీ, వీవీ.శేషుబాబు, జిల్లా కమిషన్ అధ్యక్షులు వక్కంటి నరసింహరావు, సీహెచ్.లతాకుమారి, రాంగోపాల్‌రెడ్డి, ఉమాసుబ్బలక్ష్మి, సభ్యులు జవహర్ బాబు, జనార్దన్‌రెడ్డి, నారాయణ రెడ్డి, శ్రీదేవి, శ్యామల, మాధవీలత, మాధవి, స్టేట్ కమిషన్ రిజిస్ట్రార్ రామ్ కుమార్, రాజిరెడ్డి, తిరుమలరావు, ప్రవీణ్, వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రవీందర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ అనుదీప్

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తే తప్పకుండా గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ప్రజా సంబంధాలు, సమాచార శాఖలో 33 ఏళ్లుగా పనిచేసి శనివారం ఉద్యోగ విరమణ పొందిన చెంగల రవీందర్‌ను కలెక్టరేట్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు, ఉద్యోగ విరమణలు సహజమన్నారు. ఉద్యోగ సమయంలో వారు చేసిన సేవలు చిరకాలం నిలుస్తాయన్నారు. సమాచారశాఖలో రవీందర్ వృత్తి నిబద్ధతతో పనిచేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమాచారశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అబ్దుల్‌కలీం, అధికారులు అనంతం, వెంకటయ్య, హబీబ్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ స్టార్టప్ కాన్‌క్లేవ్
వేదిక : ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్
సమయం : ఉదయం 10.30 గంటలకు

పాస్ అండ్ క్లియర్ ఎగ్జిబిషన్
వేదిక : స్టేట్ ఆర్ట్ గ్యాలరీ మాదాపూర్
సమయం : ఉదయం 11 గంటలకు

స్ఫూర్తి థియేటర్ రోడ్ షో పపెట్ షో
వేదిక : అవర్ సేక్రెడ్ ప్లేస్, సికింద్రాబాద్
సమయం : సాయంత్రం 6 గంటలకు

దాసరి శిరీష జ్ఞాపిక
వేదిక : సోమాజిగూడ ప్రెస్‌క్లబ్
సమయం : సాయంత్రం 4.30 గంటలకు

పుస్తకావిష్కరణ (బండారు దత్తాత్రేయ)
వేదిక : భారతీయ విద్యాభవన్
సమయం : సాయంత్రం 5 గంటలకు

పండిత్ అభిమాన్ కౌశల్ తబలా ప్రదర్శన
వేదిక: సప్తపర్ణి ఆడిటోరియం
సమయం : సాయంత్రం 6 గంటలకు


తమిళనాడు అంకాలజిస్టులతో బసవతారకం ఆస్పత్రి వైద్యులు

బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో తమిళనాడు అంకాలజిస్టులకు శిక్షణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గైనకలాజికల్ క్యాన్సర్ల చికిత్సపై తమిళనాడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే సర్జికల్ అంకాలజిస్టులకు బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి - రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆఫ్ జపాన్, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి మధ్య జరిగిన అవగాహన ఒప్పందం మేరకు మొదటి విడత ఆగస్టు 5నుంచి 30వ తేదీ వరకు తమిళనాడు ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి వచ్చిన 8మంది ప్రముఖ సర్జికల్ అంకాలజిస్టులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని జపాన్ అంతర్జాతీయ సహకార ఏజెన్సీ(జీకా) సహకారంతో తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (అంటువ్యాధి కాని రోగాలు) నియంత్రణ, నివారణ ప్రాజెక్టులో భాగంగా నిర్వహిస్తున్నట్లు మెడికల్ డైరెక్టర్, సర్జికల్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ టి.సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు.


వాక్‌లో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

సంజీవయ్య పార్కు వద్ద చిన్నారుల వాక్

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): బాల్య విద్యలో మార్గదర్శకులు, ప్రపంచవ్యాప్తంగా పాఠశాలలు అనుసరించే సూత్రాలకు ఆద్యులు ఇటాలియన్ వైద్యురాలు, విద్యావేత్త డాక్టర్ మరియా మాంటిస్సోరి 154వ జయంతి సందర్భంగా చిన్నారులతో శనివారం సంజీవయ్య పార్కు వద్ద వాక్ నిర్వహించారు. మాంటిస్సోరి ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ట్రస్ట్ సహకారంతో ఆంథియా మాంటిస్సోరి ఆధ్వర్యంలో ఈ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంథియా మాంటిస్సోరి మాట్లాడుతూ... స్త్రీలపై వివక్ష కొనసాగే 19వ శతాబ్దం చివరలో మరియా మాంటిస్సోరి తన పేరును కలిగి ఉన్న విద్యా విధానాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు. ఆమె జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ వాక్‌లో నగరంలోని 21 పాఠశాలలకు చెందిన దాదాపు 900మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జక్కని సంజయ్‌కుమార్‌కు తీవ్ర అస్వస్థత

- ఆపోలో ఆస్పత్రికి తరలించిన బీసీ నేతలు
- బీసీ డిక్లరేషన్ కోసం నిరాహార దీక్ష చేస్తున్న నేత


సంజయ్ కుమార్‌ను అపోలో ఆస్పత్రికి తరలిస్తున్న బీసీ నాయకులు

అడ్డగుట్ట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని కొద్ది రోజులుగా గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నిరాహార దీక్ష చేస్తున్న బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శనివారం రాత్రి ఆయనకు వాంతులు కావడంతో పాటు బీపీ, షుగర్ లెవెల్స్ పడిపోవడంతో అస్వస్థతకు గురయ్యారని బీసీ నేతలు తెలిపారు. మెరుగైన వైద్యం అందించేందుకు ఆపోలో ఆస్పత్రిలో చేర్పిస్తున్నట్లు బీసీ నేతలు తెలిపారు.

ఆడంబరంగా వినాయక ఉత్సవాలు

(3వ పేజీ తరువాయి)

వీధిలైట్లు, అగ్నిమాపక యంత్రాలు, తాగునీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. డిప్యూటీ మేయర్ శ్రీలత మాట్లాడుతూ నగరంలో ఈసారి ముంబై తరహాలో ఉత్సవాలను నిర్వహించుకుందామన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి మాట్లాడుతూ ఉత్సవాలు మొదలు నిమజ్జనం వరకు శానిటేషన్ పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అందరి సమన్వయంతో గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకుందామన్నారు. ఈ సమావేశంలో అదనపు సీపీ విక్రమ్‌సింగ్ మాన్, ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వనాథ్‌ప్రసాద్, బల్దియా జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్‌పాటిల్, అనురాగ్ జయంతి, అపూర్వ చౌహాన్, రవి కిరణ్, ఉపేందర్‌రెడ్డి, వెంకన్న, ఆయా శాఖల ఉన్నతాధికారులు, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు ఉరి!

(3వ పేజీ తరువాయి)

సుందరీకరణ పనులు జరిగాయి. నలువైపులా మట్టి పోస్తుండడంతో వర్షపు నీరు చెరువులోకి వెళ్లే పరిస్థితి లేకుండా పోతోంది. అక్కడక్కడా కల్వర్టులు నిర్మిస్తామని చెప్పినా చాలా ప్రాంతాల్లో అందుబాటులో లేవు.

సర్కారు దృష్టికి సుందరీకరణ

నగరంలో చెరువులు, నాలాల పక్కన ఉండే కాలనీలు, బస్తీలు ఎక్కువగా నీట మునుగుతున్నాయి. ఇన్‌లెట్, అవుట్‌లెట్లు ఇప్పటికే దాదాపు మూతపడగా..జీహెచ్‌ఎంసీ ట్రాక్‌ల నిర్మాణం సమస్యను మరింత జటిలం చేసింది. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఎల్‌బీనగర్, కుత్బుల్లాపూర్, నిజాంపేట, మియాపూర్, మాదాపూర్ తదితర ప్రాంతాల్లో ముంపు ముప్పునకు కారణమిదే. హెచ్‌ఎండీఏ, రెవెన్యూ, ఇరిగేషన్ విభాగాలు ఎఫ్‌టీఎల్‌ను నోటిపై చేసినా.. అదేం పట్టించుకోకుండా ఖాళీగా ఉన్న స్థలం వరకు బండ్‌లు నిర్మించారు. ఉప్పల్ నల్లచెరువు మధ్యలో బండ్ నిర్మించడంతో 15-20 ఎకరాల భూమి అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుతం బాగానే ఉన్నా...మున్ముందు కట్ట అవతలి వైపు ఉన్న స్థలం ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం చెరువు వాస్తవ విస్తీర్ణం 64.02 ఎకరాలు ఉండగా...కాలక్రమంలో ఆక్రమణలతో బక్కచిక్కిపోయింది. నాలాలు విస్తరించి, చెరువులను కాపాడి సమస్యకు పరిష్కారం చూపాల్సిన ప్రభుత్వ విభాగాలు కొత్త సమస్యలను తీసుకువచ్చాయి. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలను తొలగిస్తున్న హైడ్రా.. సుందరీకరణ పనుల విషయంలో ఏం చేయబోతుందన్నది ఆసక్తికరంగా మారింది. సర్కారు నుంచి స్పష్టత వచ్చిన తర్వాతే ఏం చేయాలన్నది నిర్ణయిస్తామని హైడ్రా అధికారి ఒకరు తెలిపారు.

సుందరీకరణ పనులు చేపట్టిన చెరువుల్లో కొన్ని..

1. రూ.14.45 కోట్లతో బోయిన్‌పల్లి హస్మత్‌పేట చెరువు సుందరీకరణ
2. రూ.25 కోట్లతో ప్రగతినగర్ అంబీర్‌చెరువు సుందరీకరణ
3. రూ.5 కోట్లతో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మార్కండేయనగర్‌లో నర్సాబాయికుంట పనులు
4. రూ.9 కోట్లతో కాప్రా చెరువు సుందరీకరణ పనులు
5. రూ.12 కోట్లతో నేరేడ్‌మెట్ ఆర్‌కేపురం చెరువు సుందరీకరణ
6. రూ.8 కోట్లతో నెక్నాంపూర్ చెరువు సుందరీకరణ.

సిబిల్‌స్కోరును మీరే సరిచేయించాలి

- ఈఎంఐ వివరాలు సరిగా నమోదు చేయక తగ్గిన సిబిల్‌స్కోరు
- టాటా మోటార్ ఫైనాన్స్ తీరును తప్పుబట్టిన వినియోగదారుల ఫోరం
- 9 శాతం వడ్డీ, రూ. 35 వేల పరిహారం చెల్లించాలని తీర్పు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సరైన సమయంలో వాయిదాలు కట్టినా, వివరాలు సరిగా నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేసిన ఫైనాన్స్ సంస్థపై వినియోగదారుల ఫోరం ఆగ్రహం వ్యక్తం చేసింది. రుణ వాయిదాల వివరాలు సరిగా నమోదు చేయకపోవడంతో తగ్గిన సిబిల్ స్కోరును సరిచేయాల్సిన బాధ్యత ఫైనాన్స్ సంస్థదేనని స్పష్టం చేసింది. జరిగిన నష్టానికి పరిహారంగా రూ.35 వేలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. ఆమోద పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వాహన కొనుగోలు కోసం టాటా మోటార్స్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో రుణం తీసుకుంది. ఈఎంఐలు కట్టేందుకు పోస్ట్‌డేటెడ్ చెక్కులను ఫైనాన్స్ సంస్థకు ముందే ఇచ్చింది. ఫైనాన్స్ సంస్థ నిర్వాహకులు ఈఎంఐ సమయానికి చెక్కులను బ్యాంకులో జమచేయడంలో జాప్యం చేయడంతో ఓవర్ డ్యూ చార్జీలు విధించారు. ఇలా పలుమార్లు జరగడంతో దీని గురించి ఆమోద పబ్లికేషన్స్ ప్రతినిధులు ప్రశ్నించగా, ఇలాంటి తప్పులు పునరావృతం కావని టాటా మోటార్స్ ఫైనాన్స్ సంస్థ మెయిల్ ద్వారా వివరణ ఇచ్చింది. కానీ, ఈఎంఐ చెల్లింపుల నమోదు జరగకపోవడంతో లోన్ చెల్లింపులో 900 రోజులకు పైబడి జాప్యం జరిగినట్లు రికార్డుల్లో నమోదయ్యింది. దీని కారణంగా ఆమోద పబ్లికేషన్స్ సంస్థ సిబిల్ స్కోరు తగ్గి, ఇతర లోన్‌లు వచ్చే అవకాశం లేకుండా పోయింది. సిబిల్ స్కోరును సరిచేయాలని టాటాఫైనాన్స్ నిర్వాహకులను పలుమార్లు సంప్రదించగా, చేయాల్సింది చేశామని, ఇకపై తమ చేతిలో ఏమీ లేదని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. దాంతో ఆమోద పబ్లికేషన్స్ నిర్వాహకులు వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశారు. కేసును విచారించిన హైదరాబాద్ జిల్లా వినియోగదారుల ఫోరం-2 ప్రెసిడెంట్ జస్టిస్ వక్కంటి నరసింహారావు, సభ్యులు జస్టిస్ డి.శ్రీదేవి, జస్టిస్ జనార్దన్‌రెడ్డిల బెంచ్ సాక్ష్యాలను పరిశీలించింది. టాటాఫైనాన్స్ తీరును తప్పుబట్టిన ఫోరం.. ఫైనాన్స్ సంస్థ నిర్లక్ష్యం కారణంగా తగ్గిన సిబిల్‌స్కోరును వెంటనే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. అంతేకాకుండా 45 రోజుల్లో ఓవర్ డ్యూ ఇంట్రస్ట్ పేరుతో వసూలు చేసిన రూ.38,349కి 9శాతం వడ్డీ, మానసిక వేదనకు గురిచేసినందుకు రూ.30 వేల పరిహారం, కోర్టు ఖర్చుల నిమిత్తం మరో రూ.5 వేలు చెల్లించాలని జిల్లా వినియోగదారుల ఫోరం-2 తీర్పును వెలువరించింది.

జానపద కళల పరిరక్షణకు కృషి

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవం


కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, రమణాచారి తదితరులు

రవీంద్రభారతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో జానపద కళారూపాలలో పునరుత్తేజాన్ని తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రభుత్వం కళారంగానికి పెద్దపీట వేస్తుందని, కవులు, కళాకారులు, రచయితలకు సముచితస్థానం కల్పిస్తుందని తెలిపారు. శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సారిపల్లి కొండలరావు ఫౌండేషన్, యువకళావాహిని, తెలంగాణ జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ జానపద దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పలు జిల్లాల నుంచి విచ్చేసిన కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు కళాకారులను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్న యువతలో మార్పు కోసం కవులు, రచయితలు కృషి చేయాలని సూచించారు. పర్యాటక రంగంలో జానపద కళాకారుల సేవలను ఉపయోగించుకునేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ అలేఖ్య పుంజాల, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు కెతావత్ సోమలాల్, గడ్డం సమ్మయ్య, రిటైర్డ్ ఐఏఎస్ డా. కేవీ రమణాచారి, సారిపల్లి కొండలరావు, లంకా లక్ష్మీనారాయణ, రమణారెడ్డి, మామిడి హరికృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతలో స్వయం సమృద్ధి సాధించాలి

రాయదుర్గం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఏ దేశమైనా స్వావలంబన సాధించాలంటే అత్యాధునిక సాంకేతికతలో స్వయం సమృద్ధి సాధించాలని రక్షణమంత్రి శాస్త్రీయ సలహాదారు, జీఓఐ ఎఫ్ఆర్ చైర్మన్, డీఆర్డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి అన్నారు. రాయదుర్గం నాలెడ్జ్‌సిటీలోని టీహబ్‌లో వేద విజ్ఞానం, ఆధునిక సాంకేతికతపై నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును ఆయన బిట్స్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ వైస్ చాన్సలర్, ఐఐటీ ఢిల్లీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ రాంగోపాల్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతికతలో భారత్ మంచి పురోగతి సాధిస్తుందన్నారు. దేశీయ ఉత్పత్తి, ఆవిష్కరణలను ప్రోత్సహించడమే లక్ష్యంగా భారత్ ముందుకు సాగుతుందని.. పరిశోధనలకు కేంద్రంగా హైదరాబాద్ నిలుస్తుందన్నారు. ప్రొఫెసర్ రాంగోపాల్‌రావు మాట్లాడుతూ.. డీఆర్డీఓ వంటి సంస్థలు వ్యూహాత్మక అనువర్తనాల కోసం ఈ సదస్సుకు హాజరైన శాస్త్రి ఉత్పత్తి చేసిన మెటీరియల్ ఉపయోగించాయన్నారు. టీహబ్ సీఈవో ఎం.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. పురాతన భారతీయ శాస్త్రాలపై తనకు అపారమైన ఆసక్తి ఉందన్నారు. కొన్ని జాతీయవాద కథనాల ద్వారా తాను ప్రభావితమైనట్లు తెలిపారు. జర్మన్ అసోన్ అధ్యక్షుడు డాక్టర్ ఉల్రిచ్‌బెర్క్, అవధూత దత్తపీఠం డాక్టర్ వీకే గణపతి, ఐఎఎస్సీ యూఎస్ఏ చైర్మన్ డాక్టర్ బలరామ్‌సింగ్, విజ్ఞాన భారతి జాతీయ అధ్యక్షుడు, సీఎస్ఐఆర్ మాజీ డీజీ డాక్టర్ శేఖర్ సిమండే, సపియంజా యూనివర్సిటీ, ఇటలీ సైంటిఫిక్ రీసెర్చర్ సాహితీ శ్రీరామోజు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బదిరుల ఫ్యాషన్ షో


11వ మిస్, మిస్టర్, మిసెస్ డెఫ్ ఇండియా 2024 విజేతలు

పంజాగుట్ట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు విభిన్న ప్రతిభావంతులని, ఎవరికీ తీసిపోరని తెలంగాణ వికలాంగుల కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. ఆల్ ఇండియా డెఫ్ ఆర్ట్స్ కల్చరల్ సొసైటీ, హెలెన్ కెల్లర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్, రిహాబిలిటేషన్ ఫర్ డిసేబుల్డ్ చిల్డ్రన్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హైటెక్ సిటీ బ్రాంచ్ సహకారంతో శనివారం రాత్రి ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో డెఫ్ కల్చరల్ ఫెస్ట్ పేరుతో 11వ మిస్, మిస్టర్, మిసెస్ డెఫ్ ఇండియా 2024 జాతీయ స్థాయి బదిరుల ఫ్యాషన్ షో పోటీలు జరిగాయి. ఇందులో 16 రాష్ట్రాల నుంచి 60 మంది యువతీయువకులు, వివాహిత మహిళలు పాల్గొన్నారు. మిస్ డెఫ్ ఇండియా, మిస్టర్ డెఫ్ ఇండియా, మిసెస్ డెఫ్ ఇండియా ఈ మూడు విభాగాల్లో పోటీలు ఉత్సాహంగా జరిగాయి. మిస్ డెఫ్ ఇండియా జాతీయ విజేతగా అంజన్ వీఎన్(కేరళ), ద్వితీయ స్థానంలో సంలం చులియో(నాగాలాండ్), తృతీయ స్థానంలో ఖుష్బు పటేల్(ఎంపీ), మిస్టర్ డెఫ్ జాతీయ విజేతగా నసిరుద్దీన్ అత్తర్(కర్ణాటక), ద్వితీయ స్థానంలో మహమ్మద్ జాఫర్(యూపీ), తృతీయ స్థానంలో ఆశల్ పి.ఆగస్టిన్(కేరళ), మిసెస్ డెఫ్ జాతీయ విజేతగా నియతి జి.మల్గోన్కర్(గోవా), ద్వితీయ స్థానంలో చిత్ర(కర్ణాటక), తృతీయ స్థానంలో సంచిత సంజయ్(మహారాష్ట్ర) నిలిచి కిరీటం, మెమెంటో, నగదు పురస్కారాన్ని గెలుచుకున్నారు. ఈ డెఫ్ కల్చరల్ ఫెస్ట్‌లో బ్రిటీష్ డిప్యూటీ గవర్నర్ గారేత్ వెన్ ఓవెన్, మిస్ డెఫ్ ఇంటర్నేషనల్ 2024, మోడల్ సరిత ముసుకు, హెలెన్ కెల్లర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్, రిహాబిలిటేషన్ ఫర్ డిసెబుల్డ్ చిల్డ్రన్ వ్యవస్థాపక చైర్మన్ పఠాన్ ఉమార్‌ఖాన్, ప్రిన్సిపాల్ అంజయ్య జాజుల, ఆల్ ఇండియా డెఫ్ ఆర్ట్స్ కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు బి.కల్యాణ్, దైవజ్ఞశర్మ, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

'మనువాద భావజాలాన్ని బలవంతంగా రుద్దుతున్నారు'


మాట్లాడుతున్న డాక్టర్ అపర్ణ

కవాడిగూడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం దేశ ప్రజలపై మనువాద భావజాలాన్ని బలవంతంగా రుద్దుతోందని పీఎఫ్‌టీయూ కేంద్ర కార్యదర్శి డాక్టర్ అపర్ణ ఆరోపించారు. ఇది మహిళలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. శనివారం పీఓడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర 7వ మహాసభల సందర్భంగా నగరంలోని వీఎస్‌టీ నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్, అశోక్‌నగర్ మీదుగా ఇందిరాపార్కు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇందిరాపార్కు వద్ద జరిగిన బహిరంగ సభలో అపర్ణ మాట్లాడుతూ.. ఢిల్లీలో జరిగిన నిర్భయ అత్యాచారం ఘటన సందర్భంగా పోరాడి ప్రత్యేక చట్టం తెచ్చుకున్నా మహిళలపై లైంగిక వేధింపులు ఆగడం లేదన్నారు. పశ్చిమబెంగాల్‌లో మహిళా డాక్టర్ హత్య కుట్రలో భాగంగానే జరిగిందని ఆమె ఆరోపించారు. ఈ ఘటనపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలు చేస్తూ సరైన చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. మహిళల గొంతు నొక్కడానికి ప్రభుత్వాలు రకరకాల కుట్రలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు చట్టాలను సంఘటిత పోరాటాలతో తిప్పికొట్టగలిగామని.. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా బలమైన పోరాటాలు చేయాలని ఆమె పిలుపునిచ్చారు. పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జి.ఝాన్సీ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1, 2 తేదీలలో పీఓడబ్ల్యూ 7వ మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు వి.సంధ్య, ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ, ఉపాధ్యక్షులు అరుణ, జి.అనసూయ, ఎం.జ్యోతి, డాక్టర్ పిట్ల సరిత, కార్యదర్శులు పాల్గొన్నారు.

30 ఏళ్లుగా ఉంటున్నాం..

- 30 రోజుల్లో ఖాళీ చేయమంటే ఎలా..?
- ప్రభుత్వాలు మారినప్పుడల్లా కొత్త నోటీసుల?
- అమర్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి
- దుర్గం చెరువు కబ్జాకు గురి కాలేదు: రిటైర్డ్ ఐజీ

రాయదుర్గం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తాము ముప్పై సంవత్సరాల క్రితమే అన్ని ప్రభుత్వ విభాగాల అనుమతులు తీసుకొని ఇళ్లు కట్టుకుని ఇక్కడ ఉంటున్నాం.. ఇప్పుడు రెవెన్యూ అధికారులు నోటీసులిచ్చి 30 రోజుల్లో ఖాళీ చేయమంటున్నారు.. ఇదెక్కడి న్యాయం అని.. అమర్ కోఆపరేటివ్ సొసైటీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, నెక్టర్‌గార్డెన్ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దుర్గంచెరువు శిఖం స్థలంలో చట్ట విరుద్ధంగా ఇళ్లు కట్టుకున్నారంటూ రెవెన్యూ అధికారులు ఇటీవల యజమానులకు ఇచ్చిన నోటీసులపై వారు స్పందించారు. ఈ మేరకు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి మాట్లాడారు. దుర్గం చెరువు పైభాగంలో 1991లో అన్ని అనుమతులతో అమర్ కోఆపరేటివ్ సొసైటీ 140 ప్లాట్లతో లేఅవుట్ వేసిందని, అప్పుడు జీహెచ్‌ఎంసీ అధికారుల నుంచి అన్ని అనుమతులు తీసుకొని ఇళ్లు నిర్మించుకున్నామన్నారు. అయితే, ప్రభుత్వాలు మారినప్పుడు నిబంధనలు మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో మా ప్లాట్లు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి రావని రిపోర్టులు ఇచ్చిన అధికారులే.. ఇప్పుడు కొత్త ప్రభుత్వంలో ఎఫ్‌టీఎల్‌లోకి వస్తుందని చెబుతున్నారని.. ఇది ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. 1994లో అనుమతులు వచ్చిన ప్లాట్లకు 2002లో సెక్షన్ 23 వాల్టా యాక్ట్ కింద నోటీసులు ఇచ్చారు.. 2010లో ఎఫ్‌ఎటీఎల్‌లోకి వచ్చిందన్నారు.. ప్రభుత్వాలు మారినప్పుడల్లా కొత్త నోటీసులు వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. 30 ఏళ్లుగా ఇక్కడ ఉంటున్న వాళ్లు.. 30 రోజుల్లో వెళ్లి పోవాలంటే ఎక్కడికి వెళ్లాలని ఆవేదన వ్యక్తం చేశారు.

చెరువులో ఇప్పటికీ 100 ఎకరాల్లో నీళ్లు

మేము ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న సమయంలో, ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వానికి ట్యాక్స్ కట్టిన సమయంలో ఈ స్థలం ఎఫ్‌టీఎల్‌లో ఉందని తెలియదా అని గోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. రికార్డుల ప్రకారం దుర్గం చెరువు 65.12 ఎకరాల్లో ఉందని, చెరువులో ఇప్పటికీ 110 ఎకరాల్లో నీరు ఉందన్నారు. వాల్టా చట్టం రాకముందే తాము ఇళ్లు కట్టుకుని ఇక్కడ నివాసం ఉంటున్నామన్నారు. రెవెన్యూ నోటీసులపై తమ సొసైటీ సభ్యులమంతా కోర్టును ఆశ్రయించామని తెలిపారు. కోర్టుకు అన్ని ఆధారాలు చూపించిన తర్వాత సానుకూలంగా స్పందించిందన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, హైడ్రా అధికారులు ఈ పొరపాట్లు ఎక్కడ జరిగాయనే దానిపై రికార్డులను మరోసారి పరిశీలించుకోవాలని కోరారు. తమ లేఅవుట్ల ప్రాంగణానికి 1991లో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల అంశం లేదని వివరించారు. కాగా, ఇదే సమావేశంలో పాల్గొన్న నెక్టార్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఐజీ వజ్జ వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ డీమార్కేషన్ సమయంలో అధికారులు నిబంధనలు పరిగణలోకి తీసుకోకుండా హద్దులు నిర్ణయించడంతోనే చెరువు పైభాగంలోని కాలనీవాసులకు సమస్యలు వస్తున్నాయన్నారు. ఈ ప్రాంతంలో తాము 1989లో ప్లాట్లుకొని 1994లో ఇల్లు కట్టుకొని నివాసం ఉంటున్నామని తెలిపారు. తాము ప్లాట్లు కొన్న సమయంలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ప్రస్తావన ఎక్కడా లేదని వివరించారు. 2000 సంవత్సరం వరకు దుర్గం చెరువు పైభాగంలో ఉన్న అమర్ సొసైటీ, నెక్టర్ గార్డెన్, కావూరి హిల్స్, కల్యాణ్‌నగర్ కాలనీ, బృందావన్ కాలనీలకు ఎఫ్‌టీఎల్ సమస్య లేదన్నారు. 2015లో ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన నోటీసులకు సమాధానమిచ్చామని, అప్పుడు సద్దుమణిగిన సమస్య.. మళ్లీ ఇప్పుడు హైడ్రా కూల్చి వేతలు చేపడుతున్న నేపథ్యంలో రావడం నివాసితులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నదని వాపోయారు. దుర్గం చెరువు 65.12 ఎకరాల రికార్డును ఇరిగేషన్ అధికారులు హెక్టార్లుగా పరిగణిస్తుండటంతోనే సమస్య వచ్చిందని ఆయన పేర్కొన్నారు.


సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో రిటైర్డ్ ఉద్యోగులతో సీపీ తదితరులు

ట్రై కమిషనరేట్ల పరిధిలో పలువురి రిటైర్మెంట్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): నగరంలో మూడు కమిషనరేట్ల పరిధిలో పలువురు అధికారులు శనివారం రిటైర్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయా కమిషనరేట్లలో నిర్వహించిన కార్యక్రమంలో వారిని కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా సత్కరించారు. హైదరాబాద్ కమిషనరేట్‌లో ఉద్యోగ విరమణ పొందిన 29 మంది అధికారులను జాయింట్ సీపీ గజరావ్ భూపాల్ ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. రిటైర్‌మెంట్ అనంతరం పోలీసు శాఖ నుంచి రావాల్సిన అన్నిరకాల బెనిఫిట్స్ సకాలంలో అందేవిధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అకౌంట్స్ అధికారి శ్రీనివాస్, ఏడీఓ శ్రీదేవి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ఎస్.శంకర్ రెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రాచకొండ పరిధిలో ..

రాచకొండ కమిషనరేట్ పరిధిలో శనివారం రిటైర్ అయిన ఆరుగురు అధికారులను సీపీ సుధీర్ బాబు ఘనంగా సత్కరించారు. కమిషనరేట్‌లో జరిగిన కార్యక్రమంలో డీసీపీలు పి.ఇందిర, మురళీధర్, ఏసీపీ, శ్రీధర్‌రెడ్డి, అకౌంట్స్ అధికారి సుగుణ, పుష్పరాజ్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు సీహెచ్ భద్రారెడ్డి, కార్యదర్శి జి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబరాబాద్ పరిధిలో...

సైబరాబాద్‌లో ఆరుగురు అధికారులు రిటైర్ అయ్యారు. గచ్చిబౌలి కమిషనరేట్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సీపీ అవినాష్ మహంతి పాల్గొని అధికారులను సత్కరించి, ఘనంగా వీడ్కోలు పలికారు.

కానిస్టేబుల్ సస్పెన్షన్

- డీసీపీకి పరుషంగా సమాధానం ఇచ్చినందుకు..

యూసుఫ్‌గూడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఆలస్యంగా వచ్చినందుకు మందలించిన డీసీపీకి పరుషంగా సమాధానం చెప్పిన కానిస్టేబుల్‌ను నగర కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సస్పెండ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి... కొద్ది రోజుల క్రితం మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ విజయ్ కుమార్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రోల్ కాల్‌కు కానిస్టేబుల్ తిరుమలనాయక్ ఆలస్యంగా వచ్చాడు. 'ఇలాగైతే ఎలా... ఇప్పుడే ఆలస్యంగా వచ్చావు డ్యూటీ అంటే అంత అలుసా.. విధులు సక్రమంగా నిర్వహిస్తున్నావా లేదా' అంటూ కానిస్టేబుల్‌ను డీసీపీ మందలించారు. ఆ తరువాత డీసీపీ విజయ్‌కుమార్ వెళ్లేటప్పుడు 'నా భార్య గర్భవతి చూసుకుని వచ్చే సరికి ఆలస్యమైంది. దీనికి మీరు అలా అంటారా' అంటూ పరుషంగా మాట్లాడాడు. అప్పటికి ఏమీ అనకుండా వెళ్లిపోయిన డీసీపీ విజయ్‌కుమార్ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నగర కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి విచారణ జరిపి కానిస్టేబుల్ తిరుమలనాయక్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మత్తు పదార్థాలు వినియోగిస్తున్న ఐదుగురి అరెస్ట్

బంజారాహిల్స్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మత్తు కోసం మందు బిళ్లలను పొడి చేసి ఇంజక్షన్ చేసుకుంటున్న ఇద్దరు యువకులు, ముగ్గురు యువతులను పోలీసులు అరెస్టు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని ఓ గదిలో ఉన్న కొంత మంది మత్తు పదార్థాలు వినియోగిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో అక్కడకు వెళ్లారు. మిజోరాంకు చెందిన అబ్రహం, లలోపియా, ఫ్రాంకిని, లాలిండికి, కేథరిన్ మత్తులో కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా నొప్పి నివారణ కోసం వాడే ట్రెడాల్, ఒత్తిడిని తగ్గించేందుకు ఉపయోగించే నైట్రోవిట్‌లను పొడిగా చేసి మత్తు కోసం ఇంజక్షన్ చేసుకుంటున్నట్లు తేలింది. వీరితో కలిసి రిక్కి జోమాన్ సంగా అనే యువకుడు సైతం మత్తు తీసుకుంటున్నట్లు విచారణలో తెలిసింది. ఐదుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు మందు బిళ్లలు, సిరంజీలను స్వాధీనం చేసుకున్నారు.

కేరళలో డ్రగ్స్ కేసు.. హైదరాబాద్‌లో లింకులు!

హైదారాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కేరళలో వెలుగులోకి వచ్చిన డ్రగ్స్ కేసులో ముగ్గురు నిందితులను అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. కేసును లోతుగా విచారించిన పోలీసులు.. డ్రగ్స్ కేసులో ప్రధాన నిందితుడు సహా డ్రగ్స్ మూలాలు హైదరాబాద్‌లోనే ఉన్నట్లు గుర్తించారు. దాంతో కేరళ పోలీస్ బృందం ఆగస్టు 30న హైదరాబాద్‌కు వచ్చినట్లు తెలిసింది. కేరళలో అరెస్టయిన స్మగ్లర్లు ఇచ్చిన సమాచారం, సాంకేతిక సాక్ష్యాల ఆధారంగా సైబరాబాద్ పోలీసుల సహకారంతో సైబరాబాద్ కమిషనరేట్ బాలానగర్ డివిజన్ శివారులోని ఓ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రధాన నిందితుడు నరసింహరాజును అరెస్టు చేసినట్లు తెలిసింది. అతని వద్ద రెండున్నర కిలోల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. నిందితుడు నరసింహరాజు సినిమా పరిశ్రమకు చెందిన వ్యక్తిగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిసింది. పోలీసులను సంప్రదించగా.. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ప్రస్తుతం కేరళ పోలీసుల అదుపులో ఉన్న నిందితున్ని విచారణ అనంతరం సైబరాబాద్ పోలీసులు కస్టడీకి తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

డ్రగ్స్ తయారీపై పోలీసుల ఆరా!

సైబరాబాద్ శివారు ప్రాంతంలోని ఓ పారిశ్రామిక ప్రాంతంలో ఒక కంపెనీలో నిందితులు గుట్టుగా డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు గుర్తించిన కేరళ పోలీసులు.. సైబరాబాద్ పోలీసులతో కలిసి ఏకకాలంలో దాడి చేసి నిందితున్ని పట్టుకున్నట్లు సమాచారం. అక్కడ సుమారు రెండున్నర కిలోల ఎండీఎంఏ డ్రగ్స్ పట్టుబడటంతో పోలీసులు అవాక్కయ్యారు. కొంతకాలంగా అక్కడ గుట్టుగా డ్రగ్స్ తయారు చేస్తున్న నిందితులు రహస్యంగా దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాలు, నగరాలకు సరఫరా చేస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నగరంలోని ఫార్మా కంపెనీలో పనిచేసే కొంతమంది డ్రగ్గిస్టులు, కెమిస్టుల సహకారంతో మాదక ద్రవ్యాలు తయారు చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇలాంటి పరిశ్రమలపై సైబరాబాద్ పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.


హై-రిస్క్ ప్రెగ్నెన్సీపై అవగాహన


హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వయసు పెరుగుతున్న కొద్దీ సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గుతుందని.. పురుషుల్లో స్పెర్మ్, మహిళల్లో అండాల నాణ్యత వయసుతో పాటు తగ్గుతూ వస్తుందని వైద్యులు తెలిపారు. హైటెక్‌సిటీలోని మెడికవర్ ఉమెన్ అండ్ చైల్డ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఐటీ కారిడార్లలోని మహిళలకు ఆలస్య గర్భం, హై-రిస్క్ ప్రెగ్నెన్సీలపై అవగాహన కల్పించారు. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సైబర్ క్రైమ్స్ సీఐడీ డాక్టర్ లావణ్య మాట్లాడుతూ.. గర్భధారణ సమయంలో సరైన నియమాలను పాటించకపోతే తల్లి ఆరోగ్యానికి నష్టం కలిగే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి తల్లి గర్భంలో ఉన్న శిశువు ఆరోగ్యంగా ఉండాలని, సంతోషకరమైన బిడ్డకు జన్మనివ్వడానికి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎస్వీ లక్ష్మి మాట్లాడుతూ.. ప్రస్తుతం మహిళలు, పురుషుల్లో సంతానోత్పత్తి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ప్రసవాలు సైతం హై రిస్క్‌తో కూడుకుంటున్నాయన్నారు. మొదటిసారి గర్భం దాల్చాలనుకునే వారు 30 ఏళ్ల లోపే ప్రయత్నించాలని ఆమె సూచించారు. అనంతరం గర్భిణులకు మాతృదేవోభవ ప్రత్యేక డెలివరీ ప్యాకేజీని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త, మహిళా సాధికారత ప్రతినిధి ఆంచల్ బన్సల్, లావణ్య వల్లూరి, డాక్టర్ రవీందర్‌రెడ్డి పరిగె, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీ డిగ్రీ, పీజీ ప్రవేశగడువు పెంపు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ, పీజీ కోర్సుల్లో చేరడానికి చివరి తేదీ సెప్టెంబర్ 30 వరకు పొడిగించినట్లు విశ్వవిద్యాలయ అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయంలో 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో డిగ్రీలో చేరిన ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా ట్యూషన్ ఫీజును చెల్లించాలని, అంతకు ముందు చేరిన విద్యార్థులు సకాలంలో ఫీజు చెల్లించలేక పోయినా వారు సెప్టెంబర్ 30లోపు ట్యూషన్ ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. పూర్తి సమాచారం కోసం సమీపంలోని అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ హెల్ప్ డెస్క్ నంబర్లు 7382929570, 040-23680222/333/444/555, టోల్‌ఫ్రీ నంబర్ 18005990101లో సంప్రదించాలని సూచించారు. వివరాల కోసం www.braouonline.లేదా www.braou.ac.inలో సంప్రదించాలని

ఆదివారం





పౌరాణికం, జానపదం, చరిత్రాత్మకం, సాంఘికం...
ఇలా జానర్ ఏదైనా బాలకృష్ణకు టైలర్‌మేడ్. మంచి పాత్ర పడిందంటే...
అభిమానులకు పండగే. రొమాన్స్ నుంచి రౌద్రం వరకూ ఏ రసాన్నైనా
అలవోకగా అభినయించి, మెప్పించడం... ఆయనకే సాధ్యం.
అందుకే... థియేటర్లే కాదు, పబ్‌లు, పార్టీల్లోనూ... ఇతర నటుల సినిమాల్లో సైతం
'జై బాలయ్య' అనే అరుపే జనంలో జోష్ నింపే తారకమంత్రం.
అయిదు దశాబ్దాల ఆయన నట జీవితాన్ని ప్రేక్షకలోకం వేడుక చేసుకుంటోంది.
తెలుగు చలన చిత్ర పరిశ్రమ నేడు ఘనసత్కారం చేస్తోంది.
ఈ సందర్భంగా యాభయ్యేళ్ళ వెండితెర బాలుడు 'నవ్య'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ.

(సీవీఎల్ఎన్ ప్రసాద్)



ఫొటో: అశోకుడు

ఇప్పటికీ బాల కృష్ణుడినే!

నా జీవితంలో నేను ఇప్పటికీ స్టూడెంట్‌నే! నేను ఇంకో 50 ఏళ్లు ఉంటా! నా కొడుకు, నా మనవడు నాకు పోటీ అవ్వాలి. ఇది అహంకారం కాదు. ఆత్మవిశ్వాసం.

▸▸ హీరోగా మీ తొలి సినిమా 'తాతమ్మ కల' విడుదలయి 50 ఏళ్లు పూర్తయింది. ఆ సినిమాలో తొలి షాట్ మీకు గుర్తుందా?

ఎందుకు గుర్తులేదు... ఇప్పటికీ కళ్ల ముందు కదులుతోంది. అప్పట్లో నాన్నగారి సినిమాల ప్రభావం నాపై చాలా ఉండేది. ఆయన నడిచే తీరు, హావభావాలు నా మనసులో గాఢంగా పడిపోయాయి. 'తాతమ్మ కల' సినిమాలో నా మొదటి షాట్ భానుమతిగారితో! నేను ఆవిడ మనవడిని. నాకు ఆవిడ తన భర్త పేరు పెట్టుకుంటుంది. అందువల్ల నన్ను పేరుతో పిలవదు. నా మొదటి షాట్‌లో- నేను స్కూలు నుంచి ఇంటికి వస్తాను. ఈ లోపులో భానుమతిగారు- "ఆయన ఏరీ?" అని మిగిలిన వారిని అడుగుతారు. నాన్నగారు కెమెరా వెనక ఉన్నారు. "యాక్షన్" అన్నారు. భానుమతిగారు - "ఆయన ఏరీ?" అన్నారు. నేను ఆవిడ దగ్గరకు నాన్నగారిలా- భుజాలు అటూ ఇటూ కదుపుతూ వెళ్లా. నాన్నగారు వెంటనే "కట్" అని అరిచారు. "గాడిదా... రౌడీలా ఆ నడకేంటి? డీసెంట్ ఫెలోలా రా!" అన్నారు. ఒక్క నిమిషం నాకు ఏం చేయాలో అర్థం కాలేదు. మిమ్మల్నే అనుకరించానంటే అక్కడే కొడతారు. ఆ తర్వాత మామూలుగా నడిచాను. షాట్ ఓకే అయింది. ఇదీ నా తొలిషాట్ అనుభవం.

▸▸ 50 ఏళ్ల నట జీవితం తర్వాత మీలో వచ్చిన మార్పులేమిటి?

మార్పు సహజం. అందరూ అంగీకరించాల్సిందే. నాన్నగారు మాకు చాలా క్రమశిక్షణ నేర్పారు. దానిని ఇప్పటికీ పాటిస్తా. ప్రతి రోజు ఉదయాన్నే మూడున్నరకు లేస్తా. కొన్నిసార్లు రెండున్నరకు కూడా లేస్తూ ఉంటా. లేచి నా ఎక్సెర్‌సైజ్‌లు చేసుకుంటా. పూజ చేసుకుంటా. ప్రపంచమంతా లేవకముందే - ఇవన్నీ కానిచ్చి- షూటింగ్ ఉంటే వెళ్లిపోతా. లేకపోతే వేరే పనులలో బిజీ అయిపోతా. ఒక్కోసారి నా దినచర్యను చూసుకుంటే నా చిన్నప్పటి రోజులు గుర్తుకొస్తాయి. మేము పెరిగింది హైదరాబాద్‌లో. నాన్నగారు ఎప్పుడూ షూటింగ్‌లలో ఉండేవారు. ఆయన హైదరాబాద్‌కు వచ్చినప్పుడు కూడా చుట్టూ జనం ఉండేవారు. లేకపోతే ఆడిటర్స్, ఆర్కిటెక్ట్స్- ఇలా అందరూ చుట్టుముట్టేవారు. రాత్రి వచ్చారనుకొనేవాళ్లం. మర్నాడు ఉదయం లేచి చూస్తే- మద్రాసు వెళ్లిపోయేవారు. ఒక విధంగా ఆయన మాకు అపరిచితుడే! సినిమాల్లోనే ఆయనను చూసేవాళ్లం.

▸▸ నిజమైన బాలకృష్ణ ఎవరు అని అడిగితే మీరేం సమాధానం చెబుతారు..?

ప్రపంచానికంతా తెలిసిన బాలకృష్ణే నాకు కూడా తెలుసు. నా పని, నా కుటుంబం, ప్రజాసేవ... ఈ మూడే నాకు తెలుసు. ఆర్టిస్టుగా పనిచేస్తున్నా. ఎమ్మెల్యేగా ప్రజాసేవ చేస్తున్నా. బసవతారకం ఆసుపత్రి ఛైర్మన్‌గా ఆసుపత్రిని ముందుకు తీసుకువెళ్తున్నా. ఈ మూడే తప్ప నాకు వేరే వ్యాపకాలు లేవు. నేను పార్టీలకు వెళ్లను. ఎవరినీ కలవను. కలవాలన్నా ఖాళీ దొరకదు. ఇక వేరే విధంగా చెప్పాలంటే నాలో రెండు కోణాలున్నాయి. సరదాగా చూస్తే- ఇప్పటికీ నేను బాలకృష్ణుడినే! మరో కోణంలో నేను ఒక అగ్నిపర్వతాన్ని. ఎప్పుడూ నాలో నేను మధనపడుతూ ఉంటాను. వరమో, శాపమో నాకు తెలియదు కానీ మొదటినుంచి నాకు ఆత్మాభిమానం చాలా ఎక్కువ.

▸▸ మీకు ప్రథమ కోపం చాలా ఎక్కువ అనే పేరు ఉంది కదా...

నేను కచ్చితంగా ఉంటా. ఇతరుల నుంచి కచ్చితత్వాన్ని కోరుకుంటా. అది లేకపోతే కోపం వస్తుంది. మీకో ఉదాహరణ చెబుతా. నేను వేస్తున్న ఒక పాత్రలో- గుర్రం మీద స్వారీ చెయ్యాలి. ఆ సమయంలో నా భుజం మీద ఒక తుపాకీ ఉంటుంది. నేను స్వారీ చేసే సమయంలో- ఆ తుపాకీ నిటారుగా ఉండకుండా పడిపోతోంది. ఇలా చాలాసార్లు జరిగింది. పనిచేసేవాళ్లు జాగ్రత్తగా, నైపుణ్యంతో పని చేయాలి కదా. ఇలాంటి సందర్భాలలో నాకు విపరీతమైన కోపం వస్తుంది. ఇంకో విషయం కూడా చెబుతాను. నన్ను కలవటానికి అనేకమంది వస్తూ ఉంటారు. వారిలో ఎవరు నటిస్తున్నారు? ఎవరు నిజమైన వారు? అనే విషయం నాకు తెలిసిపోతూ ఉంటుంది. నేను పొగడ్తలను దూరంగా ఉంటాను. ఎవరైనా నాతో సంభాషణ మొదలుపెట్టడం కోసం ముందు - "మేము నాన్నగారి ఫ్యాన్స్ అండి" అంటారు. నాకు చిర్రెత్తుకొస్తుంది. "ఎన్టీఆర్ ఫ్యాన్స్ కానివారు ఎవరో చెప్పండి. చెప్పకపోతే దెబ్బలు పడతాయి..." అంటాను. వాళ్లదీ తప్పు కాకపోవచ్చు. కానీ వాళ్లకు సమాధానం ఎలా చెప్పాలి?

▸▸ ఈ 50 ఏళ్ల నట జీవితంలో మీకు ఆదర్శం ఎవరు?

నాన్నగారు. ఆ తర్వాత నన్ను నేనే ఆదర్శంగా తీసుకుంటా. ఈ విషయంలో ఎవరు ఏమనుకున్నా నాకు పర్వాలేదు. ఇక స్ఫూర్తి అంటారా... నాన్నగారి నుంచి క్రమశిక్షణ, పట్టుదలలను స్ఫూర్తిగా తీసుకుంటా! నాగేశ్వరరావు గారి నుంచి పొగడ్తలకు దూరంగా ఉండటం, భజనపరులను దూరంగా పెట్టడం స్ఫూర్తిగా తీసుకున్నా.



పెద్దపాప అంటే భయం...

నాకు పెద్ద పాప బ్రాహ్మిణి అంటే భయం! తనది పూర్వాషాడ నక్షత్రం. పోరాడే తత్వం. తనకు ఏదీ తక్కువ లేదు. 'హెరిటేజ్' సంస్థను చూస్తుంది.. సీఎం కోడలు, మినిస్టర్ భార్య, బాలకృష్ణ కూతురు. అయినా ఏదో చేయాలనే తపనతో ఉంటుంది. నా నుంచి వచ్చిన హైపర్‌నెస్ కూడా తనలో ఉంది. ఇక చిన్న పాప తేజస్విని బ్యాలెన్సింగ్ చేస్తుంది. అన్నీ వింటుంది. అన్నీ పడుతుంది. 'అన్‌స్టాపబుల్'కు పనిచేసింది. ఇప్పుడు నా సినిమాకు కూడా పనిచేస్తోంది. మొన్న తనో సబ్జెక్ట్ చెప్పింది. 'నో' చెప్పా. ఒకసారి నేను 'నో' చెబితే మళ్లీ ప్రస్తావించరు.

తను భూదేవి...

నా భార్య వసుంధర నాకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలన్నీ చూసుకుంటుంది. తన పేరులోనే 'భూదేవి' అని ఉంది. ఓర్పు, సహనం చాలా ఎక్కువ. తనపైనే నేను ఎక్కువ ఆధారపడతా. ఇక నాన్నగారి దగ్గర నుంచి ఎలా ఉండాలో నేర్చుకున్నా. ఎలా ఉండకూడదో కూడా నేర్చుకున్నా. ఇక ఒత్తిడి బాగా ఉన్నప్పుడు- పుస్తకాలు చదువుతా. మంచి పాటలు వింటా. నాన్నగారి పాటలు వింటే ఎంత చిరాకైనా పోతుంది.

▸▸ సినీ నిర్మాణంలో కొత్త టెక్నాలజీలు అందుబాటులోకి వచ్చాయి. వాటిని మనం సమర్థంగా వాడుకుంటున్నామా?

ఈ మధ్యకాలంలో టెక్నాలజీ, టెక్నిక్- ఇవన్నీ ఊతపదాలయిపోయాయి. అందరూ మాట్లాడేస్తున్నారు. ఇప్పుడు ఉన్నన్ని ఆధునిక టెక్నాలజీలు లేకపోయినా, సౌకర్యాలు లేకపోయినా మన వాళ్లు గొప్ప సినిమాలు తీశారు. నాన్నగారు తీసిన 'సీతారామకళ్యాణం'లోని లైటింగ్, కెమెరా యాంగిల్స్ చూస్తే టెక్నిక్ అంటే ఏమిటో మనకు అర్థమవుతుంది. నా ఉద్దేశంలో సినిమాకు భాష, అభినయం- ఈ రెండూ ప్రధానం. ఆ తర్వాతే టెక్నిక్ వస్తుంది. ఇక టెక్నాలజీ విషయానికి వస్తే మనం దాన్ని సరిగ్గా వాడుకోవటం లేదనుకుంటా! 'భైరవ ద్వీపం' సమయంలో మన దేశంలోకి రెండు గ్రాఫిక్ కంపెనీలు వచ్చాయి. ఒక గ్రాఫిక్ కంపెనీ ఓపెనింగ్‌కు సింగీతం శ్రీనివాసరావుగారిని, నన్ను పిలిచారు. మహాబలిపురం రోడ్డులో ఆ ఓపెనింగ్ జరిగింది. అక్కడికి గ్రాఫిక్స్‌కు సంబంధం లేనివారు చాలామంది వచ్చారు. ఆ సమావేశంలో నన్ను కూడా మాట్లాడమన్నారు. "దీన్ని అంగడిలో వస్తువు చేయకండి. కస్టమైజ్ చేయండి. మా అవసరాలు గుర్తించండి. కార్పొరేట్ స్థాయి అంటే దెబ్బతింటారు" అని చెప్పాను. ఆ తర్వాత అదే జరిగింది. ఇప్పుడు కాలం మారింది. వీధి వీధికి ఒక గ్రాఫిక్ స్టూడియో వచ్చేసింది.



▸▸ మీ అబ్బాయి మోక్షజ్ఞ సినిమాల్లోకి రాబోతున్నాడు. తనకు మీరు ఇచ్చే సలహాలేమిటి?

వాడు డిగ్రీ చదువుకున్నాడు. న్యూయార్క్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌కు వెళ్లాడు. సత్యానంద్‌గారి దగ్గర తర్ఫీదు కూడా తీసుకున్నాడు. ఒక్క సినిమా కూడా రాకుండానే స్టార్ అయిపోయాడు. వాడికి నేను మూడు సలహాలిచ్చాను. మొదటిది- "వారసత్వ భారాన్ని మోయొద్దు. 'మనదో గొప్ప ఫ్యామిలీ. దాని పేరు నిలబెట్టాలి' అనుకోవద్దు" అని చెప్పాను. రెండోది- "మమ్మల్ని ఎవరినీ అనుకరించకు" అని చెప్పాను. మూడోది- క్రమశిక్షణతో ఉండమని, ఎక్కువ సినిమాలు చేయమని చెప్పాను. నా ఉద్దేశంలో ఆర్టిస్టు ఒక నిత్యావసర వస్తువులాంటివాడు. ఎప్పుడూ కనబడుతూ ఉండాలి. పరిశ్రమను, ప్రొడ్యూసర్‌ను, పంపిణీదారుణ్ణి, ఎగ్జిబిటర్‌ను జాగ్రత్తగా చూసుకోవాలి. అప్పుడే ఇండస్ట్రీ బావుంటుంది. ఇండస్ట్రీ బావుంటే ఎక్కువ మందికి ఉపాధి దొరుకుతుంది. అప్పుడు అందరూ ఆనందంగా ఉంటారు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. వాడిపై చాలా అంచనాలు ఉన్నాయి. అందువల్ల వాడి సబ్జెక్ట్ నేనే ఎంపిక చేస్తున్నా. నా కెరీర్ విషయంలో నాన్నగారు ఎప్పుడూ పట్టించుకోలేదు. 'జననీ జన్మభూమి' సినిమా తప్ప వేరే సినిమాలేవీ చూడలేదు కూడా. కానీ నేను అలా కాదు. అమరశిల్పి జక్కన్న చెక్కినట్లు వాడిని చెక్కుతా!





'అన్‌స్టాపబుల్' వెనక కథ!

నేను అప్పటి తరానికే కాదు, ఇప్పటి తరానికి కూడా కనెక్ట్ అవుతున్నా. అనుబంధాలు అప్పుడూ, ఇప్పుడూ ఒక్కటే! 'అన్‌స్టాపబుల్ షో' పెద్ద సక్సెస్. యూత్ అందరూ చూశారు. ఈ షో పేరు వెనక చిన్న కథ ఉంది. నా పుట్టిన రోజునాడు ముగ్గురు పిల్లలూ మూడు కప్‌లు బహుమతులుగా ఇచ్చారు. పెద్ద పాప బ్రాహ్మిణి ఇచ్చిన కప్పు మీద- 'ఐయామ్ ది ఎల్డెస్ట్- సో ఐ మేక్ ది రూల్స్' అని ఉంది. చిన్నపాప తేజస్విని ఇచ్చిన కప్పు మీద- 'ఐయామ్ ది మిడిల్- ఐయామ్ రీజన్ టూ హేవ్ ది రూల్స్' అని ఉంది. మోక్షజ్ఞ ఇచ్చిన కప్పు మీద - 'ఐ యామ్ యంగెస్ట్- రూల్స్ డోంట్ ఎఫెక్ట్ మీ' అని ఉంది. ఒక రోజు నాకు పుస్తకాలు ఇవ్వటానికి ఒక రచయిత, ఆయన కుమార్తె వచ్చారు. ఆ పాపను... "ఈ మూడింటితో ఒక పాట రాస్తావా?" అని అడిగా. తను వెంటనే ఇంగ్లీషు, ఫ్రెంచ్, జర్మన్ పదాలతో ఒక పాట రాసింది. వినోద్ అనే కీబోర్డు ప్లేయర్‌ను ఆ పాటకు ట్యూన్ చేయమన్నా. ఇంకో స్నేహితుడి పాప మాటల్లో- "బోర్ కొడుతోంది అంకుల్" అంది. తనను వచ్చి పాట పాడమన్నా. పాడేసింది. మూడు రోజుల తర్వాత నేను రికార్డింగ్ స్టూడియోకి వెళ్లి పాట పాడాను. ఆ పాటే 'అన్‌స్టాపబుల్'. ఈ సంగతి అల్లు అరవింద్ గారి దగ్గర ప్రస్తావించినప్పుడు- ఆయన - "మన షోకు ఆ పేరు పెడదాం" అన్నారు. వెంటనే ఇచ్చేశాను. నేను పాడిన ఇంగ్లీషు పాట ఇంకా రిలీజ్ కావాల్సి ఉంది.




చిన్నప్పటి నుంచే ఆసక్తి...

50 ఏళ్ల సినీ ప్రస్థానంలో 109 సినిమాలు మాత్రమే చేశా. దీనికి కారణం- నాన్నగారు 10 ఏళ్ల పాటు మా బ్యానర్‌లో మాత్రమే చేయమన్నారు. ఇక్కడో విషయం చెప్పాలి. నాన్నగారికి పిల్లలు బాగా చదువుకోవాలని ఉండేది. డిగ్రీ అయితే తప్ప హీరోగా చేయటానికి ఒప్పుకోలేదు. నాకు చదువు మీద ఇంట్రెస్ట్ ఉండేది కాదు. 'కెమెరా ముందుకు ఎప్పుడెప్పుడు వస్తానా?' అని ఎదురుచూస్తూ ఉండేవాడిని.

ఎన్టీఆరే తెలీదు...

'దానవీరశూరకర్ణ' సినిమాలో చలపతిరావుగారు నాలుగు వేషాలు వేశారు. నాన్నగారితో ఆయన చాలా సన్నిహితంగా మెలిగేవారు. సత్యన్నారాయణ, చలపతిరావు, రమాప్రభగార్లను నాన్నగారు మాత్రమే ఏకవచనంతో పిలిచేవారు. మూడు వేషాలు అయిపోయిన తర్వాత ఒక రోజు ఆయనను నాన్నగారు ఉదయాన్నే లేపి, వేరే వేషం వేయమన్నారు. చలపతిరావుగారు అలిగారు. "ప్రజలేమైనా పిచ్చోళ్లు అనుకుంటున్నారా? ఇప్పటికే మూడు వేషాలు వేశాను. ఇంకోటి కూడా నేనే వేస్తే - కొందరు 'ఎన్టీఆర్ లోభి' అనుకుంటారు. డబ్బు ఖర్చు పెట్టరనుకుంటారు" అన్నారు. అప్పుడు నాన్నగారు నవ్వి- "కొన్ని కొన్ని పల్లెటూళ్లలో ఎన్టీఆర్ ఎలా ఉంటాడో తెలీదు. నిన్నెవరు గుర్తుపడతారురా గాడిద! పో.. మేకప్ వేసుకొని రా!" అన్నారు.



సిద్ధుడి కథ...

'...బ్రహ్మంగారి చరిత్ర' సినిమా క్లైమాక్స్ షూట్ చేస్తున్నాం. అప్పుడు నాన్నగారు పిలిచి- "ఒరేయ్! ఈ సినిమా అంతా ఒక ఎత్తు. ఈ క్లైమాక్స్ ఒక ఎత్తు. నువ్వు దీన్ని పండించగలిగితే సినిమా హిట్ అయినట్లే!" అన్నారు. 'నేను ఈ సీన్ పండిస్తే హిట్ అంటారేమిటి?' అనుకున్నా. నాకు అర్థం కాలేదు. భయపడుతూ చేశా. షూటింగ్ చూడటానికి వచ్చిన వాళ్లందరూ అక్కడ ఉన్నారు. నాన్నగారు సీన్ అయిపోయిన వెంటనే- "నా సినిమా హిట్ రా! సీన్ బాగా పండించావు." అన్నారు. నేను చేసిన వాటిలో అదో గొప్ప పాత్ర.

విందు భోజనంలా...

బాలకృష్ణ సినిమా అంటే విందు భోజనంలా ఉండాలి. అయితే నా కథల ఎంపిక విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటా. కొందరు వచ్చి - "డేట్స్ ఇవ్వండి... చాలు" అంటారు. వెంటనే గెటౌట్ అంటాను. "నాకు మంచి కథ ఉంటే చెప్పు. నచ్చితే దాన్ని డెవలప్ చేద్దాం. ఎవరెవరు ఉండాలో డిసైడ్ చేద్దాం. అదే నా విధానం" అని చెబుతా. నాకు అందరూ పుస్తకాలు పంపుతూ ఉంటారు. వాటిని చదువుతాను. ప్రస్తుతం 'అసుర' అనే పుస్తకం చదువుతున్నా. చాలా బావుంది. 'దీన్ని ఒక సినిమాగా కుదించాలా లేక వెబ్‌సిరీస్‌గా తీస్తే బావుంటుందా?' అని ఆలోచిస్తున్నా.

రెండు తత్వాలు

నా లగ్నం మిధునం. రాశి ధనస్సు. కాబట్టి నాలో వాయుతత్వం, అగ్నితత్వం కలిసి ఉంటాయి. అందుకే ఎప్పుడూ నేను ఎండలోనే ఉంటాను. షూటింగ్ సమయంలో మేకప్ వేసుకొని బయటకు వస్తే- కారవాన్‌లోకి కూడా వెళ్లను. 'అఖండ' సినిమా షూటింగ్ విపరీతమైన ఎండలో జరిగేది. అందరూ షాట్ అయిన వెంటనే వెళ్లిపోయేవారు. నేను మాత్రం చెప్పులు లేకుండా ఎండలో నిలబడే ఉండేవాడిని. నేను ఎవరినీ సినిమాలు కావాలని అడగను. ఈ మధ్యకాలంలో ఉత్తరాది వారు కూడా కంటెంట్ కోసం మనవైపే చూస్తున్నారు. 'నేలకొండ భగవంత్ కేసరి'కి హిందీ డబ్బింగ్ నేనే చెప్పాను. దానికి మంచి రెస్పాన్స్ వచ్చింది.

నా కోసమే వస్తారు...

ప్రేక్షకులు థియేటర్‌కు నా కోసం వచ్చి సినిమాలు చూస్తారు. కాబట్టి సినిమాలో వారికి కావాల్సినవన్నీ ఉండాలి. అందుకే నా సినిమాల్లో ఎక్కువ పాటలు పెట్టమని చెబుతా. నా సినిమాల్లో ఐదు కాదు... ఏడు పాటలు పెట్టినా ప్రేక్షకులు చూస్తారు. ఇది అహంకారం కాదు. ఆత్మవిశ్వాసం.

అస్సలు ఫాలో కాను...

నేను సోషల్ మీడియాను అస్సలు ఫాలో కాను. వివాదాస్పదమైన కామెంట్స్ చేయను. వివాదాలకు దూరంగా ఉంటా. ఇక నన్ను విమర్శించే వారి విషయం అంటారా.. అది వాళ్ల ఖర్మ... అంతే!



ఓ యువకుడి న్యాయపోరాటం



ప్రియదర్శి కొత్త చిత్రం మొదలైంది. హీరో నాని సమర్పణలో వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై తయారయ్యే ఈ చిత్రానికి ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. రామ్ జగదీశ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ప్రియదర్శిపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు నాని తొలి క్లాప్ ఇచ్చారు. అన్యాయంగా ఒక కేసులో ఇరికించిన ఓ కుర్రాడి కోసం జరిగే న్యాయపోరాటం ఈ చిత్రకథ అని దర్శకుడు చెప్పారు. శివాజీ, సాయికుమార్, రోహిణి, హర్షవర్ధన్, శ్రీదేవి ఇతర ముఖ్యతారాగణం.

సుబ్రహ్మణ్య సాహసాలు



ప్రముఖ నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్ రవిశంకర్ మరోసారి మెగాఫోన్ పట్టారు. తన కుమారుడు అద్వయ్‌ని హీరోగా పరిచయం చేస్తూ 'సుబ్రహ్మణ్య' చిత్రానికి ఆయన దర్శకత్వం వహిస్తున్నారు. తిరుమల్‌రెడ్డి, అనిల్ కడియాల ఈ చిత్రానికి నిర్మాతలు. ఇప్పటికే అరవై శాతం నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న ఈ సినిమాను అడ్వంచర్ థ్రిల్ అందించడానికి బిగ్ ఫార్మెట్‌లో చిత్రీకరిస్తున్నారు. అద్భుతమైన కథతో గ్రాండ్ విజువల్స్, ఎమోషనల్ ట్రీట్‌తో సినిమా ఉంటుందని దర్శకుడు చెప్పారు. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీత దర్శకుడు. విఘ్నేష్ రాజ్ ఛాయాగ్రాహకుడు.

ఏడాది కిందట



రఘు గద్వాల్ హీరోగా, ప్రియాంక శ్రీ, శివ ప్రసన్న హీరోయిన్లుగా టించిన ప్రేమకథా చిత్రం 'వెంకటలక్ష్మితో' పోస్టర్‌ను హీరో శ్రీకాంత్ విడుదల చేశారు. 'ఏడాది కిందట' అనేది ట్యాగ్‌లైన్. రామమూర్తి కొట్టాల దర్శకత్వంలో ఆలేటి రాజేశ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'ఇది స్వచ్ఛమైన ప్రేమకథాచిత్రం. థ్రిల్లర్, సస్పెన్స్ ఎలిమెంట్స్ ఉంటాయి. అంతా కొత్తవారితో తీశాం' అన్నారు దర్శకుడు.

'ప్రణయ గోదారి' పాట



సదన్ హీరోగా, ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటించిన 'ప్రణయ గోదారి' చిత్రం నుంచి 'గు గు గ్గు' అంటూ సాగే హుషారైన పాటను ప్రముఖ కొరియోగ్రాఫర్ గణేశ్ విడుదల చేశారు. మార్కండేయ రాసి స్వరపరిచిన ఈ పాటను భార్గవి పిళ్లై పాడారు.ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత పారమళ్ల లింగయ్య చెప్పారు. పి.ఎల్.విఘ్నేశ్ ఈ చిత్రానికి దర్శకుడు.

అమ్మగా నటించడానికి ఇబ్బంది పడలేదు

ఇప్పుడు సొసైటీలో 22 ఏళ్లకే పెళ్లి ఎప్పుడు అని అడుగుతున్నారు. అందుకే నేను హౌస్ వైఫ్‌గా, అమ్మగా నటించడానికి ఇబ్బంది పడలేదు. నటిగా అన్ని పాత్రలూ చేయాలి. అయితే తల్లిగా బాగా చేశావు అనేకంటే సరస్వతి పాత్రను చక్కగా పోషించావని అంటే సంతోషిస్తా' అన్నారు నివేదా థామస్. రానా సమర్పణలో రూపుదిద్దుకున్న ' 35.. చిన్న కథ కాదు' చిత్రం ఈ నెల ఆరున విడుదలవుతున్న సందర్భంగా శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఇందులో సరస్వతి పాత్రకు, నాకు వయసులో పెద్ద తేడా లేదు. సరస్వతి నాకంటే ఏడాది చిన్నది. తనకు పెళ్లయి పిల్లలు ఉన్నప్పటికీ చైల్డ్ నేచర్ ఉంటుంది. '35 చిన్న కథ కాదు.. కథని దర్శకుడు నందకిశోర్ అద్భుతంగా రాశారు. తిరుమల వేంకటేశ్వర స్వామి కూడా ఈ కథలో ఓ పాత్ర పోషించారు. ఆ డివైన్ ఫీలింగ్ అన్ని సీన్స్‌లో ఉంటుంది. ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చే సినిమా అవుతుంది' అన్నారామె. 'ఇందులో తిరుపతి స్లాంగ్ కోసం దాదాపు నెల రోజులు వర్క్ షాప్ చేశాం. పతి పదాన్నీ క్షుణ్ణంగా నేర్చుకున్నా' అని చెప్పారు నివేద. గౌతమి కీలక పాత్ర పోషించారనీ, ఆమెతో నటించడం ఇది రెండో సారని నివేద చెప్పారు. కొత్త ప్రాజెక్టులు ఏవీ ఒప్పుకోలేదని, త్వరలోనే చెబుతానని అన్నారు.



ఈ సక్సెస్‌తో ఆ వెలితి తీరింది

'పదిహేను రోజులుగా మా టీమ్‌లో ఎవరికీ సరిగ్గా నిద్ర లేదు. రిలీజ్ రోజు నుంచి ఎన్నో అభినందనలు, ప్రశంసలు వస్తున్నాయి. సినిమా బాగుంటే ప్రేక్షకుల తల మీద పెట్టుకుంటారని మరో సారి నిరూపించినందుకు కృతజ్ఞతలు. ఇంత వర్షంలో కూడా అన్ని చోట్లా హౌస్‌ఫుల్స్ అవుతున్నాయి. 'అంటే సుందరానికి' రావాల్సిన బాక్సాఫీసు సక్సెస్ రాలేదనే చిన్న వెలితి ఉండేది. 'సరిపోదా శనివారం'తో అది బ్యాలెన్స్ అయింది. 'నిన్ను కోరి' తర్వాత దానయ్యగారితో రెండో సినిమా. మా మూడో సినిమాపై



అంచనాలు భారీగా ఉంటాయి. దానికి తగ్గ సెటప్ చేద్దాం. సెప్టెంబర్ 5న ఈ సినిమా గ్రాండ్ సెలబ్రేషన్స్ ఈవెంట్ ఉంటుంది' అన్నారు హీరో నాని. శనివారం జరిగిన 'సరిపోదా శనివారం' థాంక్స్ మీట్‌లో ఆయన మాట్లాడారు. దర్శకుడు వివేక్ ఆత్రేయ మాట్లాడుతూ 'నా మీద నాకున్న నమ్మకం కంటే నా మీద నానికి నమ్మకం ఎక్కువ. ఆయన ఫ్రీడమ్ ఇచ్చారు కనుకే ఇలాంటి మంచి సినిమా వచ్చింది. ఇంత భారీ చిత్రాన్ని నేను హ్యాండిల్ చేయగలనని నమ్మి భారీ బడ్జెట్ పెట్టిన దానయ్యగారికి థాంక్స్. తొలి సినిమాతోనే పెద్ద హిట్ కొట్టిన కల్యాణ్‌కు అభినందనలు' అన్నారు. 'ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లోనే సినిమా పెద్ద హిట్ అవుతుందని చెప్పాను. ఈ రోజు రిజల్ట్ అలాగే ఉంది' అన్నారు దానయ్య.

అమ్మ కల నెరవేరింది



సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ శనివారం కర్ణాటకలోని ఉడుపి శ్రీకృష్ణమఠాన్ని సందర్శించారు. తన తల్లి శాలిని, భార్య లక్ష్మీ ప్రణతితో కలసి ఆయన ఉడుపికి వెళ్లారు. 'మా అమ్మ ఎప్పుడూ తన సొంతూరు కుందాపురాతో పాటు ఉడుపి శ్రీకృష్ణుని దర్శనానికి తీసుకెళ్లమని అడుగుతుంది. ఇన్నాళ్లకు అమ్మ కల నెరవేరింది. సెప్టెంబర్ 2న అమ్మ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆమెకు నేను ఇచ్చే బహుమతి ఇదే' అని ఎన్టీఆర్ తెలిపారు. ఇటీవల జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు పొందిన 'కాంతార' ఫేం రిషబ్ శెట్టి, దర్శకుడు ప్రశాంత్ నీల్ వారిని సాదరంగా ఆహ్వానించారు. ఆ తర్వాత శ్రీకృష్ణ మఠంలో అందరూ పూజలు నిర్వహించారు.

బెంగళూరు, (ఆంధ్రజ్యోతి)

మా జీవితాల్ని మార్చిన సినిమా



హరీశ్ శంకర్ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ హీరోగా రూపొందిన 'గబ్బర్‌సింగ్' చిత్రం ఆయన పుట్టినరోజు సందర్భంగా సోమవారం రీ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో బండ్ల గణేశ్ మాట్లాడుతూ 'నా తల్లితండ్రులు నాకు జన్మనిస్తే పవన్‌కల్యాణ్ బతుకునిచ్చారు. నన్ను నేను నమ్మలేని స్థితిలో ఉన్నప్పుడు ఆయన పిలిచి 'గబ్బర్‌సింగ్ 'సినిమా ఇచ్చి నన్ను నిలబెట్టారు. ఈ చిత్ర దర్శకుడు హరీశ్ శంకర్ రాబోయే పాతికేళ్ల తెలుగు చిత్రపరిశ్రమలో నంబర్ వన్‌గా ఉంటారు' అని చెప్పారు. 'సోషల్ మీడియా విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న ఈ రోజుల్లో 'గబ్బర్‌సింగ్' రిలీజ్ అయి ఉంటే ఎంత బాగుండేదో అనే వెలితి నా మనసులో ఉండేది. ఇప్పుడు ఆ సినిమా రీ రిలీజ్‌తో అది తీరుతోంది. మా జీవితాలను మార్చేసిన సినిమా 'గబ్బర్‌సింగ్'' అని హరీశ్‌శంకర్ చెప్పారు.

అన్ని రంగాల్లో ఉన్నదే సినీ పరిశ్రమలోనూ జరుగుతోంది

- లైంగిక వేధింపులపై మోహన్‌లాల్ స్పందన
- నేనెవరికీ వత్తాసు పలకలేదు

'సమాజంలో సినీరంగం కూడా ఒక భాగం. అన్ని రంగాల్లో ఉన్నట్లే సినీ రంగంలోనూ లైంగిక వేధింపులు ఉన్నాయి. పరిశ్రమలో తలెత్తే ప్రతి సమస్యకు బాధ్యత వహించాల్సిన అవసరం అమ్మ (అసోసియేషన్ ఆఫ్ మలయాళ మూవీ ఆర్టిస్ట్స్)కు లేదు' అని మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్ అన్నారు. 'అమ్మ'కు రాజీనామా చేశాక శనివారం ఆయన తొలిసారి మీడియా ముందుకొచ్చారు. 'హేమ కమిటీ నివేదికను స్వాగతిస్తున్నాం, కేరళ ప్రభుత్వం, పోలీసులు నివేదికపై దర్యాప్తు చేస్తున్నందువల్ల నిజం తేలేవరకూ ఓపికపట్టాలి, పరిశ్రమ పేరును చెడగొట్టొద్దు' అని ఆయన మీడియాకు విజ్ఞప్తి చేశారు. 'ఫిల్మ్ ఇండస్ట్రీలోని పవర్ గ్రూప్ గురించి నాకు తెలియదు. ఇలాంటిది ఒకటుందని హేమ కమిటీ చెబితేనే విన్నాను. ఏ పవర్ గ్రూప్‌తోనూ నాకు సంబంధం లేదు. సినీ పెద్దలకు అండగా నిలుస్తున్నట్లు నాపై అసత్యాలను ప్రచారం చేస్తున్నారు. పరిశ్రమలో మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాల్సిందే, ఆ విషయంలో పోలీసులకు సహకరిస్తాం' అని స్పష్టం చేశారు. పరిశ్రమలో ఎన్నో అసోషియేషన్లు ఉండగా, ఏం జరిగినా 'అమ్మ'పైన రుద్దే ప్రయత్నం చేస్తుండడం దురదృష్టకరమన్నారు. మహిళలపై వేధింపుల విషయంలో మొత్తం చిత్ర పరిశ్రమ బాధ్యత తీసుకోవాలి కానీ కావాలనే అమ్మను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. 'వేలాది మందికి ఉపాధిని కల్పిస్తోన్న మలయాళ చిత్ర పరిశ్రమ కుటుంబం లాంటిది. దయచేసి దాన్ని లక్ష్యంగా చేసుకోవద్దు. పరిశ్రమను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. అందరూ సంయమనం పాటించాలి' అని మోహన్‌లాల్ కోరారు. 'అమ్మ' కార్యవర్గం రాజీనామా వైఫల్యం



కాదు, బాధ్యతల నుంచి మేం పారిపోలేదు. మా స్థానంలో కొత్త కార్యవర్గం వచ్చి అమ్మను సమర్థవంతంగా నడుపుతుంది' అని తెలిపారు. బాధ్యతల నుంచి నేనెప్పుడూ పారిపోలేదు, అత్యవసర పనుల వల్ల ఇప్పటివరకూ మీడియా ముందుకు రాలేకపోయాను అని మోహన్‌లాల్ చెప్పారు.

సీక్రెట్ కెమెరాలు పెట్టారు - నటి రాధిక ఆరోపణ

మాలీవుడ్‌లో కేరవాన్‌లలో రహస్య కెమెరాలు అమర్చి హీరోయిన్లు దుస్తులు మార్చటాన్ని వీడియో తీసిన ఘటనలు జరిగాయని, అలాంటి వీడియోలను సినీ యూనిట్ సభ్యులు వీక్షించడాన్ని తాను స్వయంగా గమనించానని సీనియర్ సినీనటి రాధిక శరత్‌కుమార్ ఆరోపించారు. కేరవాన్‌లలో కెమెరాలు అమర్చుతున్నారని తెలిసిన తర్వాత తాను హోటల్ గదుల్లో దుస్తులు మార్చుకున్నానని చెప్పారు. ఆమె ఓ తమిళ టీవీ ఛానెల్‌తో మాట్లాడుతూ.. సినీ పరిశ్రమ విధానమే సక్రమంగా లేదని, మగవారెవరూ హీరోయిన్లకు, నటీమణులకు మద్దతుగా మాట్లాడటం లేదని వాపోయారు. హీరోయిన్ల గది తలుపులు తట్టే పరిస్థితులు అన్ని సినీ విభాగాల్లో ఉన్నాయన్నారు. లైంగిక వేధింపులను ఎదుర్కొనే ధైర్యాన్ని మహిళలు మరింత పెంచుకోవాలని ఆమె సూచించారు.


నాకు ఎవరూ ఫొటోలు పంపలేదు

సజీర్ అనే వ్యక్తి నగ్న చిత్రాలను ఫోన్‌లో చిత్రీకరించి వాటిని నటి రేవతికి పంపినట్లు మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్‌పై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. సినిమాల్లో అవకాశం ఇస్తానని తనపై దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ లైంగిక దాడికి పాల్పడినట్లు సజీర్ అనే వ్యక్తి ఇటీవలే ఆరోపించాడు. ఆ సంఘటన జరిగిన రోజు నటి రేవతి కూడా హోటల్ రూమ్‌లో ఉన్నట్లు రంజిత్ చెప్పినట్లు సజీర్ తెలిపాడు. ఈ ఆరోపణలపై రేవతి స్పందించారు. మీడియాలో తనపై జరుగుతున్న ప్రచారంలో నిజం లేదన్నారు. తనకు ఎవరూ ఎలాంటి ఫొటోలను పంపలేదని స్పష్టం చేశారు. మరోసారి దీని గురించి మాట్లాడాల్సిన అవసరం తనకు లేదని రేవతి పేర్కొన్నారు.

నవ శకానికి నాడు నాంది!

చంద్రబాబు తొలిసారి ముఖ్యమంత్రి అయి 30 ఏళ్లు

- సంక్షోభ సమయంలో పాలన, పార్టీ పగ్గాలు
- పనితీరు, ప్రతిభతో పాలనలో కొత్త పుంతలు
- సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలతో పరుగులు
- 'విజన్' పాలిటిక్స్‌కు తొలిసారిగా శ్రీకారం
- 'సీఈవో - సీఎం'గా ప్రపంచవ్యాప్త గుర్తింపు
- నాలుగు సార్లు సీఎంగా బాబు ఘనత



'నారా చంద్రబాబు నాయుడు అను నేను'... అంటూ తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నేటికి మూడు దశాబ్దాలు! రెండు సార్లు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా... ఇప్పుడు రెండోసారి నవ్యాంధ్ర సీఎంగా చంద్రబాబు సృష్టించిన రికార్డు నభూతో! సంక్షేమంతోపాటు అభివృద్ధి రాజకీయాలకు, 'విజన్' పాలిటిక్స్‌కు శ్రీకారం చుట్టిన నాయకుడు! చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసి మూడు దశాబ్దాలైన సందర్భంగా... ఆయన వేసిన ముద్రపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం...

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'ఈ రోజు గడిస్తేచాలు. మళ్లీ ఎన్నికల్లో గెలిస్తే చాలు' అంటూ ఎప్పటికప్పుడు రాజకీయ లాభం చూసుకునే రోజులవి! అలాంటి రోజుల్లోనే... 'విజన్' పాలిటిక్స్‌తో దేశంలో చరిత్ర సృష్టించిన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు. అత్యంత సంక్షుభిత రాజకీయ వాతావరణంలో 1995 సెప్టెంబరు ఒకటో తేదీన ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అంటే... నేటితో 30వ ఏట అడుగు పెడుతున్నట్లు! తెలుగువారిలో అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా ఉన్న నేతగా రికార్డు సృష్టించారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో 45 ఏళ్ల పిన్న వయసులో ఆ పదవిని అధిష్ఠించిన తొలి వ్యక్తిగా గుర్తింపు పొందారు. రాష్ట్రానికి సీఈవోగా ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందారు.

ఇలా మొదలైంది...

యూనివర్సిటీ రాజకీయాల నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన చంద్రబాబు... 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత అంచెలంచెలుగా ఎదిగి తెలుగుదేశం పార్టీలో కీలక స్థానానికి చేరుకొన్నారు. లక్ష్మీ పార్వతి వ్యవహార శైలితో విసుగు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు తిరుగుబాటు జెండా ఎగరవేయడంతో... ఎన్టీ రామారావు స్థానంలో చంద్రబాబు ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించారు. ఆయన అప్పటికే ఎన్టీఆర్ మంత్రివర్గంలో రెవెన్యూ, ఆర్థిక శాఖల మంత్రిగా ఉన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ఎడతెగకుండా పనిచేస్తూ శ్రమించే సీఎంగా ముద్ర పొందారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తొలి రోజే ఆయన నాటి అసెంబ్లీలో కాంగ్రెస్ పక్ష నేత పి.జనార్దన రెడ్డి ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి కొత్త సంప్రదాయానికి తెరదీశారు. ముఖ్యమైన అంశాలు ఉన్నప్పుడు తన అధ్యక్షతన అఖిలపక్ష సమావేశాలు నిర్వహించి అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకొని ముందుకు వెళ్లేవారు. ఆయన నిర్వహించినన్ని అఖిలపక్ష సమావేశాలు తర్వాతి కాలంలో మరెవరూ నిర్వహించలేదు. ముఖ్యమంత్రి హోదాలో తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అధికార యంత్రాంగాన్ని నిరంతరం అప్రమత్తంగా ఉంచేవారు. పచ్చదనం- పరిశుభ్రం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపట్టి నగరాలు, పట్టణాల్లో పరిశుభ్రత పెంచారు. ప్రతి నెలా రెండో శనివారం దీనికి కేటాయించారు.

'క్లియర్'గా ఫైళ్లు...

'ఫైలు'... అంటే 'పెండింగ్' అనే అర్థం ఉన్న రోజులవి. అలాంటి సమయంలో ఫైళ్ల పరిష్కారానికి వారోత్సవాలు నిర్వహించిన ఘనత దేశంలో మొట్ట మొదట చంద్రబాబుకే దక్కింది. ఏ స్థాయి అధికారి ఎన్ని రోజుల్లో ఫైళ్లు పరిష్కరించాలో గడువు విధించారు. భవన నిర్మాణ అనుమతులు వంటి దరఖాస్తులపై నిర్దిష్ట గడువులోపు నిర్ణయం తీసుకోకపోతే... దానంతట అదే అనుమతి మంజూరయ్యే విధానాన్ని కూడా ఆయనే తెచ్చారు. ఏ మంత్రి వద్ద ఫైళ్లు ఎన్ని రోజులు పెండింగ్‌లో ఉన్నాయో ప్రతి మంత్రివర్గ సమావేశంలో మంత్రులకు లెక్కరాసి ఇచ్చేవారు.

కంప్యూటర్‌లకు స్వాగతం...

ప్రభుత్వ శాఖలను కంప్యూటరీకరించడం చంద్రబాబు సాధించిన అతి పెద్ద విజయం. చంద్రబాబు హయాంలోనే 'ఈ-సేవ' కేంద్రాలు ప్రారంభించారు. బిల్లుల చెల్లింపు, సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో తీసుకోవడం అప్పుడే మొదలైంది. తర్వాత దేశంలోని అన్ని రాష్ట్రాలు ఈ విధానాన్ని అనుసరించాయి.

ఐటీకి శ్రీకారం

యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చిన చంద్రబాబు ఐటీపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రపంచంలో అగ్రగామి ఐటీ కంపెనీ మైక్రోసాఫ్ట్ తన డెవలప్‌మెంట్ సెంటర్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లను హైదరాబాద్‌కు తెచ్చారు. హైదరాబాద్, ఏపీ 'బ్రాండ్' పెంచేందుకు అమెరికాలో విస్తృతంగా పర్యటించి ఐటీ కంపెనీలకు ప్రత్యేక రాయితీతో ప్యాకేజీలు ఇప్పించారు. వాటికి వసతులతో మొదట హైటెక్ సిటీ భవనం నిర్మింప చేయడంతోపాటు తర్వాతి కాలంలో ఏకంగా సైబరాబాద్ నిర్మాణానికి బాటలు వేశారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంలో పనులు వేగంగా జరుగుతాయన్న పేరు రావడంతో... అనేక కంపెనీలు క్యూ కట్టాయి. అలాగే, పరిశ్రమలు, పెట్టుబడుల సాధనలో చంద్రబాబు వినూత్నమైన పంథాలో సాగారు. హైదరాబాద్ శివార్లలో ఫార్మా కంపెనీల కోసం ఫార్మా పార్క్ ఏర్పాటు చేశారు. దేశంలో మొదటిసారిగా ప్రైవేటు రంగంలోని వారితో హైదరాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మింపచేశారు.

సంస్కరణల సారథి

సీఎంగా తన తొలి హయాంలోనే చంద్రబాబు సంస్కరణలను బలంగా ముందుకు తీసుకెళ్లారు. విద్యుత్ రంగంలో ఆయన చేపట్టిన సంస్కరణలు జవాబుదారీతనాన్ని పెంచాయి. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రైవేటు సంస్థలు తమ పెట్టుబడులతో రోడ్లు వేసి టోల్ విధానాన్ని అమలు చేయించారు. ప్రభుత్వ రంగంలో ఉండి ఎదుగూ బొదుగూ లేని టెలిఫోన్ వ్యవస్థలోకి ప్రైవేటు కంపెనీలు అడుగు పెట్టడానికి చంద్రబాబు అధ్యక్షతన ఏర్పాటైన కేంద్ర స్థాయి కమిటీ సిఫారసులు ఉపకరించాయి.

నేటికీ అదే ఉత్సాహం

ముప్పై ఏళ్ళ తర్వాత కూడా నవ్యాంధ్ర సీఎం గా చంద్రబాబు అదే ఉత్సాహం, దూరదృష్టితో పనిచేస్తుండటం విశేషం. ఈసారి ఆయన 'వికసిత ఆంధ్రప్రదేశ్-2047' ప్రణాళిక రూపకల్పనపై దృష్టి పెట్టారు. 'అమరావతి' నిర్మాణానికి పూనుకుని... నవ్యాంధ్ర సమగ్ర ప్రగతిపై దృష్టి సారించారు.

కేంద్రంలో పలుకుబడి... రాష్ట్రానికి ఉపయోగపడి..

తన తొలి ముఖ్యమంత్రిత్వ కాలంలో చంద్రబాబు ఢిల్లీ స్థాయిలో అపారమైన పలుకుబడి పొందారు. ఇది రాష్ట్ర అభివృద్ధికి ఎంతో ఉపయోగపడింది. చంద్రబాబు పలుకుబడి, పాలనా దక్షత ప్రపంచవ్యాప్తంగా విస్తరించడంతో దేశానికి ఏ విదేశీ ప్రముఖుడు వచ్చినా హైదరాబాద్‌కు తప్పక వచ్చేవారు.

ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగంలో క్షేత్రస్థాయి పరిశీలన!


- 189.2 కిలోమీటర్లు.. రెండ్రోజులు.. 20 బృందాలు
- మార్గమంతా జియో ట్యాగింగ్ చేసేందుకు కసరత్తు


హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం నిర్మాణ ప్రారంభానికి ఒక్కొక్కటిగా అడుగులు ముందుకు పడుతున్నాయి. రహదారి అలైన్‌మెంట్‌పై ఇప్పటికే దృష్టి సారించిన ప్రభుత్వం.. తాజాగా దక్షిణ భాగం మార్గం మొత్తాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేక బృందాలను నియమించడంతోపాటు వివిధ ప్రభుత్వ శాఖలను భాగస్వామ్యం చేయాలని భావిస్తోంది. దక్షిణ భాగం నల్లగొండ జిల్లాలోని చౌటుప్పల్ దగ్గర ప్రారంభమై ఇబ్రహీంపట్నం, కందుకూరు, ఆమనగల్, చేవెళ్ల, శంకర్‌పల్లి మీదుగా సంగారెడ్డి వద్ద ప్రారంభమయ్యే ఉత్తర భాగానికి అనుసంధానమవుతుంది. అయితే, ప్రాథమికంగా నిర్ధారించిన దక్షిణ భాగం మార్గం మొత్తాన్ని జియో ట్యాగింగ్ చేయనున్నారు. ఆ మార్గంలో విద్యుత్‌లైన్లు, గుర్తించిన, గుర్తించబడని చెరువులు, కుంటలు, అటవీ భూములు, చెట్లు, గుట్టలు.. ఇలా అన్ని వివరాలు సేకరించనున్నారు. ఇందుకోసం ఇరిగేషన్, పంచాయతీరాజ్, అటవీ, ఆర్అండ్‌బీ శాఖలకు చెందిన అధికారులతో 20 బృందాలను ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయించింది. 189.2 కిలోమీటర్ల మేర వివరాల సేకరణకు 10కిలోమీటర్లకు ఒక బృందాన్ని నియమించనుంది. వివరాల సేకరణను రెండు రోజుల్లో పూర్తి చేయాలని నిర్ణయించినట్టు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మూడు, నాలుగు రోజుల తర్వాత వివరాల సేకరణ ప్రారంభించనున్నట్లు తెలిసింది.

దువ్వాడ డ్రామా

ప్రమాదాన్ని ఎమ్మెల్సీ డైరెక్షన్‌లో ఆత్మహత్యాయత్నంగా చిత్రీకరించిన మాధురి

ఇరువురి ఫోన్ కాల్ సంభాషణ లీక్


శ్రీను


మాధురి

శ్రీకాకుళం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఏపీ, వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆడిన డ్రామా బయటపడింది. దువ్వాడ శ్రీనుతో కలిసి ఆరోపణలు ఎదుర్కొంటున్న దివ్వెల మాధురి ఆత్మహత్యాయత్నం నాటకమని తేలింది. మాధురి ప్రయాణిస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురి కాగా... ఆత్మహత్యకు యత్నించానని ఆమె విలేకరులకు చెప్పారు. దువ్వాడ శ్రీను చేసిన సూచన మేరకే ఆమె ఈ పని చేశారు. ఘటన అనంతరం శ్రీను, మాధురి మధ్య జరిగిన ఫోన్ కాల్ సంభాషణ శనివారం లీకవ్వడంతో ఈ విషయం బయటపడింది. అసలేం జరిగిందంటే దువ్వాడ శ్రీను కుటుంబ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొన్న దివ్వెల మాధురి మూడు వారాల కిందట కారు నడుపుకుంటూ వెళ్లి హైవేలో మరో వాహనాన్ని ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో ఆమె కారు బోల్తాపడింది. ఆ సమయంలో ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో ఆమెకు ప్రాణాపాయం తప్పింది. అయితే, మాధురిని 108 అంబులెన్స్‌లో పలాస ఆస్పత్రికి తరలిస్తుండగా ఆమె దువ్వాడ శ్రీనుకు ఫోన్ చేశారు. తొలుత మాధురి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న శ్రీను.. 'నేను సూసైడ్ చేసుకోవాలనే ఇలా చేశా. నాపై దువ్వాడ వాణి చేసినటువంటి అరాచకం, నాలుగు రోజుల నుంచి జరిగిన అరాచకాల వల్ల చనిపోవాలనే ఇలా గుద్దేశా' అని విలేకరులకు చెప్పమని ఆమెకు సూచించారు. ఆ తర్వాత అంతా నేను చూసుకుంటానని హామీ ఇచ్చారు. ఇందుకు సరే నన్న మాధురి.. 'హా.. నేను మనస్తాపం చెంది గుద్ది చచ్చిపోదామనే చేశా అని చెబుతా. విలేకరులను పంపండి' అని బదులిచ్చారు. అనుకున్నట్టుగానే విలేకరుల ముందు మాధురి నాటకాన్ని రక్తికట్టించారు. కాగా, వీరి సంభాషణ బయటికిరావడంతో స్పందించిన దువ్వాడ వాణి.. తన భర్త దువ్వాడ శ్రీనివాస్‌ను ఇకనైనా వైసీపీ పార్టీ నుంచి ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

తెరపైకి మాజీ డీజీపీ పేరు!

- కాదంబరి కేసులో మరో ట్విస్టు
- రెండోరోజూ ముంబై నటి వాంగ్మూలం

విజయవాడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో రోజుకో ట్విస్టు వెలుగు చూస్తోంది. తాజాగా ఈ వ్యవహారంలో ఓ మాజీ డీజీపీ పేరు తెరపైకి వచ్చినట్టు తెలుస్తోంది. విజయవాడలో కాదంబరి జెత్వానీతో పాటు ఆమె తల్లిదండ్రుల వాంగ్మూలాన్ని విచారణాధికారి స్రవంతిరాయ్ నమోదు చేశారు. శనివారం సుదీర్ఘంగా పది గంటల పాటు కాదంబరి వాంగ్మూలం తీసుకున్నారు. కాదంబరితో పాటు ఆమె తండ్రి నరేంద్రకుమార్ జెత్వానీ, తల్లి ఆశా జెత్వానీలను స్రవంతిరాయ్ విచారించారు. కాదంబరిపై నమోదు చేసిన కేసు డైరీని దగ్గర పెట్టుకుని విచారించారు. కాదంబరి శుక్రవారం వాంగ్మూలం ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ వాంగ్మూలాన్ని స్రవంతిరాయ్ శనివారం మరోసారి నిర్ధారించుకున్నారు. వాంగ్మూలాన్ని వీడియో రికార్డింగ్ చేశారు. ఆ తర్వాత నరేంద్రకుమార్ జెత్వానీ, ఆశా జెత్వానీల వాంగ్మూలం తీసుకున్నారు. కాదంబరిపై నమోదు చేసిన కేసులో పోలీసులు 200 వరకు డాక్యుమెంట్లను జత చేశారు. అన్ని వివరాలను కాదంబరి నుంచి సేకరించారు. ఈ కేసులో ఓ మాజీ డీజీపీ పేరు ప్రస్తావనకు వచ్చినట్టు తెలిసింది. పోలీసు కమిషనరేట్‌లో కొద్దిరోజుల క్రితం వరకు పనిచేసి ఏలూరు రేంజ్‌కు సరెండర్ అయిన మరో ఇన్‌స్పెక్టర్ పేరు ఈ కేసులో వినిపిస్తోంది. కాదంబరి జెత్వానీ ఇచ్చిన వాంగ్మూలాన్ని పోలీసులు ఫిర్యాదుగా స్వీకరించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. కాగా, అన్ని విషయాలను విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖరబాబుకు వివరించానని కాదంబరి చెప్పారు. రెండోసారి శనివారం విజయవాడలో ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఇప్పుడు జరుగుతున్న కేసు డబ్బులకు సంబంధించినది. ఇద్దరికి నేను భూమి అమ్మాలనుకున్నానని ఆరోపించి కేసులో చేర్చారు. ఇప్పుడు ఆ ఇద్దరూ విద్యాసాగర్‌పై కేసు పెట్టారు. ఫోర్జరీ డాక్యుమెంట్లు తయారు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పటి ఇంటెలిజెన్స్ డీజీ సీతారామాంజనేయులు, పోలీసు కమిషనర్ కాంతిరాణా కనుసన్నల్లో నాపై కేసు పెట్టి వేధించారు.' అని చెప్పారు.

30 ఏళ్ల ముందే..
గుండెజబ్బుల గుర్తింపు!

లండన్, ఆగస్టు 31: సాధారణంగా రక్తంలో ఉండే కొలెస్ట్రాల్ స్థాయిని బట్టి గుండెజబ్బు ప్రమాదాన్ని అంచనా వేస్తుంటారు. మరీ ముఖ్యంగా, చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్)పై దృష్టి పెడతారు. అయితే, రక్తపరీక్షను కొలెస్ట్రాల్ మోతాదు చూడటానికే పరిమితం చేయటం వల్ల.. గుండె జబ్బు ప్రమాదాన్ని సూచించే ఇతర కారకాల పట్ల నిర్లక్ష్యం వహించినట్లయ్యిందని తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. ఎల్‌డీఎల్‌తోపాటు, రక్తంలో ఉండే లిపో ప్రోటీన్ అనే కొవ్వు గురించి, మంట పుట్టించే సీ రియాక్టివ్ ప్రోటీన్ల గురించి తెలుసుకోవటం ద్వారా.. 30 ఏళ్ల వ్యవధిలో వచ్చే గుండెజబ్బులను కూడా ముందుగానే తెలుసుకొని నివారణ చర్యలు చేపట్టవచ్చని ఈ అధ్యయనం తెలియజేసింది. 'న్యూ ఇంగ్లండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్'లో దీని వివరాలు ప్రచురితమయ్యాయి. అమెరికాలోని సెంటర్ ఫర్ కార్డియో వాస్క్యులార్ డిసీజ్ ప్రివెన్షన్ డైరెక్టర్ డాక్టర్ పాల్ రిడ్కర్ సారథ్యంలోని శాస్త్రవేత్తల బృందం ఈ పరిశోధన జరిపింది. దీంట్లో భాగంగా 'విమెన్స్ హెల్త్ స్టడీ'లో భాగమైన దాదాపు 30వేల మంది అమెరికా మహిళల ఆరోగ్య సమాచారాన్ని విశ్లేషించారు. 1992-95 మధ్య జరిగిన ఈ స్టడీలో చేరినప్పుడు ఈ మహిళల సగటు వయస్సు 55 ఏళ్లు. ఆ తర్వాత 30 ఏళ్లలో వీరిలో దాదాపు 13% మంది (3,600 మంది) గుండెపోటు/ బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురయ్యారు. స్టడీలో భాగం కావటానికి ముందు మహిళలందరికీ అప్పట్లో రక్త పరీక్ష జరిపారు. ప్రస్తుతం పాల్ రిడ్కర్ బృందం.. ఈ రక్తపరీక్ష ఫలితాలను అధ్యయనం చేసి, గత 30 ఏళ్లలో ఆ మహిళలు ఎదుర్కొన్న గుండెజబ్బులకు, వారి రక్తపరీక్ష ఫలితాలకు మధ్య ఉన్న సంబంధాన్ని విశ్లేషించింది. దీని ప్రకారం.. ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ తక్కువగా ఉన్న వారితో పోల్చితే ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ అత్యధికస్థాయిల్లో ఉన్న వారిలో గుండెజబ్బులు వచ్చే ప్రమాదం 36% అధికం. ఇదే విధంగా, లిపో ప్రోటీన్ (ఎల్‌పీ-ఎ) ఎక్కువగా ఉన్న వారిలో ఈ ప్రమాదం 33% ఎక్కువ. సీ రియాక్టివ్ ప్రోటీన్లు (సీఆర్‌పీ) అత్యధికంగా ఉన్న వారిలో గుండె జబ్బుల ప్రమాదం 70% ఎక్కువని వెల్లడైంది. ఇక మీదట రక్తపరీక్షలో ఎల్‌డీఎల్‌తోపాటు, లిపో ప్రోటీన్, సీ రియాక్టివ్ ప్రోటీన్ల మోతాదును కూడా తప్పకుండా పరిశీలించాలని, తద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని ముందే తెలుసుకోవచ్చని డాక్టర్ పాల్ రిడ్కర్ సూచించారు. శనివారం లండన్‌లో జరిగిన 'యురోపియన్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ కాంగ్రెస్-2024'లో ఈ పరిశోధన పత్రాన్ని సమర్పించారు.

లావోస్ నుంచి 47 మందికి విముక్తి

వీయెంతియాన్, ఆగస్టు 31: లావోస్‌లోని సైబర్ స్కామ్ సెంటర్లలో చిక్కుకుపోయిన 47 మంది భారతీయులని రక్షించినట్లు అక్కడి భారత ఎంబసీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. లావోస్‌లోని బొకెవొ ప్రావిన్స్‌లోని గోల్డెన్ ట్రయాంగిల్ స్పెషల్ ఎకనమిక్ జోన్‌లోని సైబర్ స్కామ్ సెంటర్లలో వీరు చిక్కుకున్నారు. ఆ సెంటర్లపై దాడులు జరిపిన లావోస్ అధికారులు 29 మందిని రక్షించి భారత ఎంబసీకి అప్పగించారు. మరో 18 మంది స్వయంగా ఎంబసీకి వచ్చి తమను రక్షించాలని కోరారని భారత ఎంబసీ 'ఎక్స్'లో తెలిపింది. లావోస్‌లోని భారత రాయబారి ప్రశాంత్ అగ్రవాల్ బాధితులతో మాట్లాడి వారు ఎదుర్కొన్న కష్టాలను తెలుసుకొన్నారు. బాధితుల్లో 30 మంది స్వదేశానికి బయలుదేరారు. మిగిలిన 17 మందిని స్వదేశానికి చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గత నెలలో కూడా భారత ఎంబసీ ఈ సైబర్ స్కామ్ సెంటర్ల నుంచి 13 మందిని స్వదేశానికి చేర్చింది. ఇప్పటి వరకు ఇలా లావోస్‌లో చిక్కుకుపోయిన 635 మంది భారతీయులను భారత ఎంబసీ రక్షించి స్వదేశానికి చేర్చింది.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్

న్యూఢిల్లీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలయింది. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య శనివారం దీన్ని దాఖలు చేశారు. తమ పిటిషన్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకుందని ఆయన మీడియాకు వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కి వ్యతిరేకమని అన్నారు. ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో చట్టం చేయాల్సి ఉంటుందని, ఈ విషయంలో సుప్రీంకోర్టుకు అధికారం లేదన్నారు.

సత్వర న్యాయంతోనే
మహిళలకు భరోసా

వారిపై జరిగే నేరాలపై విచారణ వేగంగా జరగాలి

- ఇందుకు జిల్లా పర్యవేక్షణ కమిటీలు చురుగ్గా పనిచేయాలి: ప్రధాని మోదీ
- జిల్లా న్యాయ వ్యవస్థను 'దిగువ కోర్టులు' అనొద్దు : జస్టిస్ చంద్రచూడ్
- జిల్లా న్యాయ వ్యవస్థపై ఢిల్లీలో సదస్సు


సుప్రీంకోర్టును ప్రారంభించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్టాంపును ఆవిష్కరిస్తున్న మోదీ, జస్టిస్ చంద్రచూడ్

న్యూఢిల్లీ, ఆగస్టు 31: మహిళలపై జరిగే నేరాలకు సంబంధించిన కేసుల్లో సత్వరమే న్యాయం అందాల్సి ఉందని ప్రధాని మోదీ నొక్కి చెప్పారు. అలా అయితేనే భద్రతపై వారికి మరింత భరోసా ఇచ్చినట్టవుతుందని అన్నారు. కోల్‌కతాలో యువ వైద్యురాలిపై హత్యాచారం, మహారాష్ట్రలో ఇద్దరు పాఠశాల విద్యార్థినులపై లైంగికదాడి ఘటనలపై ఆందోళనల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శనివారం ఢిల్లీలో జరిగిన 'జిల్లా న్యాయ వ్యవస్థపై జాతీయ సదస్సు' ప్రారంభోత్సవంలో మోదీ పాల్గొన్నారు. మహిళలపై జరిగిన నేరాల కేసుల్లో విచారణ వేగవంతానికి జిల్లా జడ్జి, కలెక్టర్, ఎస్పీలతో కూడిన జిల్లా పర్యవేక్షణ కమిటీలు కీలక పాత్ర పోషించాల్సి ఉందని చెప్పారు. క్రిమినల్ న్యాయ వ్యవస్థలోని పలు అంశాలను సమన్వయ పరచడంలో ఈ కమిటీలకు ప్రధాన పాత్ర ఉందని తెలిపారు. ఈ కమిటీలు మరింత చురుగ్గా పనిచేయాల్సి ఉందని సూచించారు. ఇలాంటి నేరాలను అరికట్టడానికి చట్టాల్లో కఠినమైన నిబంధనలను పొందుపరిచామని, కేసుల సత్వర విచారణకు 2019లో ఫాస్ట్ ట్రాక్ కోర్టుల విధానాన్ని తీసుకొచ్చామని గుర్తు చేశారు.

న్యాయవ్యవస్థపై అపనమ్మకం లేదు

రాజ్యాంగం, శాసనాల స్ఫూర్తిని కాపాడడంలో న్యాయవ్యవస్థది ముఖ్యమైన పాత్ర అని ప్రధాని ప్రశంసించారు. అందుకే సుప్రీంకోర్టుపైన, న్యాయవ్యవస్థపైనా దేశ ప్రజలు ఎప్పుడూ అపనమ్మకం చూపలేదని అన్నారు. దేశంలో విధించిన అత్యవసర పరిస్థితిని చీకటి రోజులని అభివర్ణించారు. ఆ సమయంలో ప్రాథమిక హక్కులు కాపాడడంలో న్యాయవ్యవస్థ ప్రముఖంగా వ్యవహరించిందని గుర్తు చేశారు. అభివృద్ధి చెందిన భారత్ లక్ష్య సాధనకు న్యాయ వ్యవస్థే బలమైన స్తంభమని మోదీ అన్నారు. దేశ న్యాయ వ్యవస్థకు జిల్లా న్యాయ వ్యవస్థే పునాది అని అభివర్ణించారు. "న్యాయం కోసం పౌరులు తొలుత కింది కోర్టు తలుపు కొడుతారు. న్యాయ ప్రక్రియకు మొదటి ప్రదేశం, తొలి అడుగు ఇదే" అని అన్నారు. న్యాయ వ్యవస్థ మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలన్న సూచనలపై మోదీ స్పందిస్తూ న్యాయం అందుబాటులో ఉండే విధంగా గత పదేళ్లలో పలు చర్యలు చేపట్టినట్టు చెప్పారు. భవిష్యత్తు అవసరాలకు సర్వసిద్ధంగా ఉండే న్యాయ వ్యవస్థ రూపకల్పన దిశగా ముందడుగు వేస్తున్నట్టు చెప్పారు. సుప్రీంకోర్టును నెలకొల్పి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్టాంపును, స్మారక నాణేన్ని ఆవిష్కరించారు.

జిల్లా కోర్టులే న్యాయవ్యవస్థకు వెన్నెముక

ఈ సదస్సులో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ప్రసంగిస్తూ జిల్లా స్థాయి న్యాయ వ్యవస్థను కింది కోర్టులని పిలవడాన్ని మానేయాలని అన్నారు. అవి ఎవరి ఆధీనంలో పనిచేయడం లేదని, నిజానికి అవి న్యాయ వ్యవస్థకు వెన్నెముక లాంటివని చెప్పారు. చట్టబద్ధ పాలన అమలులో కీలక పాత్ర వాటిదేనని తెలిపారు. అందువల్ల బ్రిటిష్ కాలం నాటి దిగువ కోర్టులు (సబార్డినేట్ జ్యుడీషియరీ) అనే మాటను వాడకూడదని సూచించారు. జడ్జీల ఆరోగ్య పరిస్థితిపైనా చర్చ జరగాలని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. జడ్జీలు వృత్తి నిపుణులే అయినప్పటికీ కేసులు పరంగా, ఇతరత్రా ఒత్తిళ్లకు గురవుతున్నారని, దాంతో వారి మానసిక ఆరోగ్యం ప్రభావితమవుతోందని అన్నారు. కొంతకాలంగా జిల్లా న్యాయ వ్యవస్థలో మహిళల సంఖ్య పెరుగుతుండడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కేరళలో ఇటీవల జరిగిన న్యాయాధికారుల భర్తీలో 72% మంది మహిళలే ఉన్నారని అన్నారు. గతేడాది రాజస్థాన్‌లో జరిగిన భర్తీలో 58% మంది, ఢిల్లీలో 66% మంది మహిళలు ఉద్యోగాలు పొందారని తెలిపారు.

'వికసిత్ భారత్'కు దక్షిణాదే కీలకం

తమిళనాడు అభివృద్ధికి మొదటి ప్రాధాన్యం: మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 31: వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి చాలా కీలకమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దక్షిణాది అభివృద్ధికి.. అందులోనూ తమిళనాడు అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని వ్యాఖ్యానించారు. ఈ ఏడాది బడ్జెట్‌లో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు కేటాయింపులు పెంచామని గుర్తు చేశారు. శనివారం ఆయన మూడు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను(మీరట్-లఖ్‌నవూ, మదురై-బెంగళూరు, చెన్నై-నాగర్‌కోయిల్ రూట్ల మధ్య) వర్చువల్‌గా ప్రారంభించారు. వందేభారత్ రైళ్లను అన్ని ప్రాంతాలకు విస్తరించడంతో దేశం 'వికసిత్ భారత్' లక్ష్యం వైపు వేగంగా అడుగులు వేస్తోందని ఈ సందర్భంగా మోదీ అన్నారు. ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేలా రైల్వేలో ఎన్నో సంస్కరణలను తీసుకువచ్చామని, ప్రతీ ఒక్కరికి సౌకర్యవంతమైన రైల్వే ప్రయాణ సేవలను అందించేవరకు ఈ సంస్కరణలు ఆగబోవని మోదీ చెప్పారు.

లోకం తీరు



కేసు నమోదయ్యే వరకు
నాకు తెలియదు!

ఆర్జీకర్ ఘటనపై మాజీ ప్రిన్సిపాల్ ఘోష్

కోల్‌కతా, ఆగస్టు 31: కోల్‌కతా ఆర్జీకర్ వైద్య కాలేజీలో పీజీ వైద్యవిద్యార్థిని మృతిచెందిన విషయం ఆ ఘటనపై కేసు నమోదయ్యేంత వరకూ తనకు తెలియదని ఆ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ చెప్పారు. అలాగే తాను ఘటనాస్థలికి వెళ్లేసరికి అప్పటికే అక్కడ పోలీసులు ఉన్నారని పేర్కొన్నారు. ఆగస్టు 9వ తేదీ ఉదయం 10.20 గంటలకు కళాశాల ఆచార్యుడైన సుమిత్ ఆ ఘటన గురించి తనకు చెప్పారన్నారు. ఈ కేసులో సీబీఐ అధికారులు రెండుసార్లు నిర్వహించిన లై డిటెక్టర్ (పాలిగ్రాఫ్) పరీక్షల్లో ఘోష్ ఈ విషయాలను చెప్పారు. సుమిత్ ఘటన గురించి చెప్పగానే తాను వెంటనే బయలుదేరానని, దారిలోనే తాలా పోలీస్ స్టేషన్‌కు ఫోన్‌చేశానని.. అప్పటికే ఘటన తాలూకు సమాచారం తమకు తెలుసునని వారు చెప్పారని ఘోష్ పేర్కొన్నారు.

రైతుల నిరసనకు వినేశ్ మద్దతు

- శంభూ సరిహద్దు వద్ద అన్నదాతలకు సంఘీభావం
- 200వ రోజుకు చేరిన ఆందోళన.. పాల్గొన్న రెజ్లర్



న్యూఢిల్లీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ హరియాణా-ఢిల్లీ సరిహద్దు శంభూ వద్ద ఆందోళన చేస్తున్న రైతులకు మేటి రెజ్లర్ వినేశ్ ఫొగాట్ మద్దతు పలికారు. శనివారం వారి నిరసనలు 200కు రోజుకు చేరిన సందర్భంగా వెళ్లిన వినేశ్.. సంఘీభావం ప్రకటించారు. రైతు కుటుంబంలో పుట్టడం నా అదృష్టం. మీ కోసం ఎవరూ రారు. హక్కుల కోసం మీరే పోరాడాలి. డిమాండ్లు సాధించేదాకా వెనుదిరగొద్దు. నేను మీ బిడ్డను. మీ వెంటే ఉంటా' అని భరోసా ఇచ్చారు. రైతుల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించేలా చూడాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు. కాంగ్రె‌స్‌లో చేరుతున్నారా? అని మీడియా ప్రశ్నించగా.. వ్యతిరేకంగా స్పందించలేదు. "ఇక్కడ రాజకీయాల గురించి మాట్లాడితే రైతుల ఆందోళనకు ప్రాధాన్యం తగ్గిపోతుంది. మీ దృష్టి నాపై కాదు. అన్నదాతల ఆందోళనపైకి మళ్లించండి" అని మీడియాను అభ్యర్థించారు. పారిస్ ఒలింపిక్స్‌లో కేవలం 100 గ్రాముల అధిక బరువు కారణంగా వినేశ్ పతకం కోల్పోయారు. రెజ్లింగ్‌కు వీడ్కోలు పలికారు. అప్పటినుంచి వినేశ్ రాజకీయాల్లోకి వస్తారనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఒలింపిక్స్ తర్వాత వినేశ్ ఫొగాట్ ఫాలోయింగ్ మరింత పెరిగింది. క్రీడలకు బాగా ప్రాధాన్యమిచ్చే హరియాణాలో వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. వినేశ్ రాజకీయాల్లోకి వస్తే కీలక పాత్ర పోషిస్తారనే అభిప్రాయాన్ని విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. ఆమె పార్టీలో చేరతారా, లేక స్టార్ క్యాంపెయినర్‌గా ఉపయోగపడతారా అన్న చర్చ జరుగుతోందని కాంగ్రెస్ నేత ఒకరు తెలిపారు. గతేడాది బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో రెజ్లర్లు నిర్వహించిన నిరసన ప్రదర్శనలకు కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్, ప్రియాంక సంఘీభావం ప్రకటించారు. మద్దతు ధరకు చట్టబద్ధత కోసం రాహుల్ లోక్‌సభలో డిమాండ్ చేశారు. కాగా, హరియాణాలో తమకు సానుకూల పవనాలు ఉన్నాయని కాంగ్రెస్ అంచనా వేస్తోంది.

హరియాణా ఎన్నికల తేదీల సవరణ

హరియాణా అసెంబ్లీ ఎన్నికల తేదీలను శనివారం ఎన్నికల సంఘం(ఈసీ) సవరించింది. పోలింగ్‌ను అక్టోబరు 1 నుంచి 5వ తేదీకి, ఓట్ల లెక్కింపును అక్టోబరు 4 నుంచి 8వ తేదీకి మార్చింది. అసోజ్ అమావాస్యను పురస్కరించుకొని హరియాణా, రాజస్థాన్‌లోని బిష్ణోయ్ సామాజిక వర్గం వారు తమ గురువైన గురు జంబేశ్వర్ పూజల్లో పాల్గొంటారు. అక్టోబరు 1న ఎన్నికలు నిర్వహిస్తే వారు ఓటు హక్కును కోల్పోతారంటూ వినతులు రావడంతో ఈసీ ఈ మార్పులు చేసింది. కాగా, హరియాణా కారణంగా కశ్మీర్ ఓట్ల లెక్కింపు కూడా అక్టోబరు 8కి మారింది. అక్టోబరు 1న జరగనున్న కశ్మీర్ మూడో దశ పోలింగ్ తేదీలో మార్పుల్లేవు.

ఎస్సీల ఫీజు రీయింబర్స్‌మెంట్.. ఇకపై విద్యార్థుల ఖాతాల్లోనే జమ

- స్కాలర్‌షిప్ కూడా నేరుగా అకౌంట్‌లోకే
- ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు
- కేంద్ర సంస్కరణల అమలుకు రాష్ట్రం ఓకే

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల మంజూరులో కేంద్ర ప్రభుత్వ సంస్కరణలను అమలు చేసేందుకు తెలంగాణ సర్కారు అంగీకరించింది. ఇందులో భాగంగా 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఈ నిధులను నేరుగా విద్యార్థుల ఖాతాల్లో జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను విడుదల చేసేందుకు ఎస్సీ సంక్షేమ శాఖ సిద్ధమవుతోంది. కేంద్ర సంస్కరణల అమలుతో ఏటా రాష్ట్రానికి ఉపకార వేతనాల కింద రూ.250 కోట్ల వరకు అందనున్నాయి. దీంతో పాటు వివిధ వర్గాల విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్‌ల దరఖాస్తులకు సంబంధించిన ప్రక్రియను కూడా సర్కారు సులభతరం చేయబోతోంది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను రూపొందిస్తోంది. సంస్కరణలు అమలులోకి వస్తే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలన్నీ కళాశాలల ఖాతాల్లో కాకుండా విద్యార్థుల ఖాతాల్లోనే జమ అవుతాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను పొందే విద్యార్థులు ఇకపై ఏటా రెన్యువల్ చేసుకోవాల్సిన అవసరం ఉండదు. విద్యా సంవత్సరం ముగిసిన వెంటనే రెన్యువల్ దరఖాస్తు ఆటోమేటిక్‌గా జనరేట్ అవుతుంది. కాగా, ఫీజు రీయింబర్స్‌మెంట్, పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు సంబంధించి 2024-25 విద్యా సంవత్సరానికిగాను తాజా, రెన్యువల్ దరఖాస్తుల స్వీకరణ సెప్టెంబరు 1 నుంచి డిసెంబరు 31దాకా జరగనుందని ఎస్సీ అభివృద్ధి శాఖ ఇన్‌చార్జ్ ముఖ్యకార్యదర్శి శరత్ ఒక ప్రకటనలో తెలిపారు.

42% కోటా ఇవ్వాల్సిందే

స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేయాలి

- అఖిలపక్ష సమావేశంలో బీఆర్‌ఎస్, బీజేపీ డిమాండ్
- నిర్ణయించాల్సింది ప్రభుత్వమే
- ఖరారయ్యాక ఎన్నికలు: ఎన్నికల కమిషన్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలని బీఆర్‌ఎస్, బీజేపీలు డిమాండ్ చేశాయి. రిజర్వేషన్ పెంపుపై అధికార పార్టీ అఖిలపక్ష సమావేశాన్ని పెట్టాలని వామపక్షాలు అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. రాష్ట్రంలో నిర్వహించాల్సిన పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ అన్ని రాజకీయ పార్టీలతో హైదరాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో శనివారం సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం పార్టీలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలో కుల గణన చేపట్టాలని, అనంతరం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ వాటా ఇవ్వాలని బీఆర్‌ఎస్ డిమాండ్ చేసింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిందని గుర్తు చేసింది. పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, ఈ మేరకు కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని బీజేపీ గుర్తుచేసింది. రిజర్వేషన్ల పెంపు అంశం అసలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉందా..? లేదా కేంద్రంతో చర్చించాల్సి ఉందా..? అనే అంశంపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలని వామపక్షాలు కోరాయి. సమావేశంలో కాంగ్రెస్ తరఫున పాల్గొన్న టీపీసీసీ ఎన్నికల కమిషన్ నిర్వహణ కమిటీ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ ఈ విషయంలో స్పందించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అయితే దీనితో కులగణన అంశం ముడిపడి ఉన్నందున అన్ని వర్గాల సహకారమూ ఉండాలన్నారు. కాగా, పార్టీల ప్రతినిధులు అభిప్రాయాలను వెల్లడించిన అనంతరం.. ఎన్నికల కమిషనర్ పార్థసారధి మాట్లాడారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు లోబడి.. రిజర్వేషన్లు 50శాతానికి మించకుండానే ఎన్నికలను నిర్వహిస్తామని తెలిపారు. అయితే ఎవరికి ఎంత రిజర్వేషన్ ఇవ్వాలన్నది రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించాల్సి ఉందన్నారు. స్థానిక సంస్థలకు సంబంధించి ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేస్తే వెంటనే ఎన్నికలు నిర్వహించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. 2024 ఫిబ్రవరి 8న ప్రచురించిన అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితా ఆధారంగా ఎటువంటి మార్పులు లేకుండా వార్డుల వారీగా జాబితాను సెప్టెంబరు 6న ప్రకటిస్తామని తెలిపారు. సెప్టెంబరు 7 నుంచి 13 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని వెల్లడించారు. ఆ అభ్యంతరాలను జిల్లా పంచాయతీ అధికారులు 19 వరకు పరిష్కరిస్తారని, అనంతరం సెప్టెంబరు 21న గ్రామపంచాయతీల వారీగా ఓటర్ల తుది జాబితాను ప్రకటిస్తామని కమిషనర్ తెలిపారు. కాగా, సెప్టెంబరు 9, 10 తేదీల్లో జిల్లా, మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నట్టు కమిషన్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.



గుట్ట విమాన గోపురానికి
త్వరలోనే స్వర్ణ తాపడం

- పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశం
- నివేదిక రూపొందిస్తున్న అధికారులు
- 60 కిలోల బంగారంతో తాపడం పనులు!

యాదాద్రి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి గర్భగుడి విమాన గోపురానికి స్వర్ణతాపడం చేయించే పనుల్లో కదలిక వచ్చింది. యాదగిరిగుట్టలో చేపట్టాల్సిన ఆలయ అభివృద్ధి పనులపై పూర్తిస్థాయి నివేదిక రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాజాగా అధికారులకు ఆదేశించడంతో ఈ దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో విమాన గోపురానికి స్వర్ణతాపడం పనులు వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కాగా, ఆలయ ఉద్ఘాటనకు ముందు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్.. స్వామివారి ఆలయంలోని విమానగోపురానికి తిరుమల మాదిరిగా బంగారం తాపడం పనులు చేయించాలని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందుకోసం భక్తుల నుంచి విరాళాలు సేకరించాలని నిర్ణయించి, తొలి విరాళంగా కిలో 16 తులాల బంగారం అందజేశారు. కేసీఆర్‌తోపాటు అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు కూడా విరాళాలు అందజేశారు. అయితే 2022లో ఆలయ ఉద్ఘాటన అనంతరం భక్తుల నుంచి ఆశించిన స్థాయిలో విరాళాలు, బంగారం రాకపోవడంతో విమాన గోపురానికి బంగారం తాపడం పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.

విరాళాలు, బంగారంపై లెక్కలు..

స్వామివారి విమాన గోపురానికి బంగారం తాపడం పనులపై ప్రభుత్వ నిర్ణయంతో.. ప్రస్తుతం ఆలయ పరిధిలో ఉన్న విరాళాలు, బంగారం ఎంతమేరకు ఉందన్న అంశంపై అధికారులు లెక్కలు తీస్తున్నారు. స్వామివారి ప్రధానాలయంలోని విమాన గోపురం మొత్తం 10,500 చదరపు అడుగులు ఉండగా, 60 కిలోల బంగారంతో తాపడం పూర్తయ్యే అవకాశం ఉందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం భక్తులు సమర్పించిన చందాలు రూ.20.50 కోట్ల మేరకు ఉన్నాయి. మొక్కుల చెల్లింపులో భాగంగా వచ్చిన మిశ్రమ బంగారం దాదాపు 12 కిలోల వరకు, విరాళంగా ఇచ్చిన బంగారం 10.5 కిలోలు ఉంది. భక్తులు సమర్పించిన వెండి 2,300 కిలోల వరకు ఉంది. బంగారంతోపాటు ప్రస్తుతం ఆలయ బ్యాంకు ఖాతాలో ఉన్న విరాళాల నిధులతో 60 కిలోల వరకు బంగారం సమకూరే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బంగారు తాపడం పనుల కోసం ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

విద్యార్థినులు వీధుల్లో పోరాడుతుంటే.. 'జూ' ఏర్పాటుకు ప్రయత్నాలా?: కేటీఆర్

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తమకు కనీస అవసరాలు కల్పించాలంటూ ఓవైపు తెలంగాణ ఆడబిడ్డలైన విద్యార్థినులు వీధుల్లో పోరాటం చేస్తుంటే.. ఇంకోవైపు హైదరాబాద్‌లో మరో 'జూ'ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అంటే.. విద్యార్థినుల సమస్యల పరిష్కారం కన్నా 'జూ'పార్క్ నిర్మాణానికే సీఎం ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని 'ఎక్స్' వేదికగా విమర్శించారు. దయచేసి సీఎంగారు ముందు ప్రజల సమస్యలను పరిష్కరించే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కాగా, ప్రజాపాలన పేరుతో ప్రజలను ఏమార్చి అధికారంలోకి వచ్చి దోపిడీ పాలన చేస్తున్న కాంగ్రెస్ నాయకులే డెకాయిట్లు అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్‌ను డెకాయిట్ అంటూ మంత్రి ఉత్తమ్ సంబోధించడం దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు.

ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి: హరీశ్‌రావు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి విద్యా వ్యవస్థలో సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాల్మాకుల కస్తూర్బాగాంధీ పాఠశాలను సబితారెడ్డితో కలిసి శనివారం ఆయన సందర్శించారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఆ పాఠశాల విద్యార్థులు శుక్రవారం రహదారిపై ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో తమ పాఠశాలకు వచ్చిన మాజీ మంత్రుల వద్ద విద్యార్థినులు తమ సమస్యలు చెప్పుకుని కన్నీటిపర్యంతమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన హరీశ్ రావు.. పాల్మాకుల పాఠశాల విద్యార్థినుల కష్టాలు చూస్తుంటే కన్నీళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాలు, కస్తూర్బా పాఠశాలలను ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు. విద్యార్థులను ఇబ్బంది పెట్టిన పాల్మాకుల పాఠశాల ఉపాధ్యాయులను తక్షణమే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

మంత్రి ఉత్తమ్‌కు నోరెలా వచ్చింది: హరీశ్

తెలంగాణ రాష్ట్ర సాధకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను డెకాయిట్ అని మంత్రి ఉత్తమ్ సంబోధించడం ఆయన దిగజారుడు మనస్తత్వానికి నిదర్శనమని హరీశ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. బూతులు మాట్లాడటంలో ముఖ్యమంత్రి రేవంత్‌కు తానేమి వెనుకబడలేదని నిరూపించుకున్నారా అని ఉత్తమ్‌ను ప్రశ్నించారు. పేరేమో ఉత్తమ్‌కుమార్.. మాట తీరేమో మూసీ ప్రవాహంలాగా ఉందని అన్నారు. కేసీఆర్‌ను డెకాయిట్ అనడానికి ఉత్తమ్‌కు నోరెలా వచ్చిందని ఆయన నిలదీశారు.

ఐఏఎస్ అధికారులకు అదనపు బాధ్యతలు

హైదరాబాద్, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలువురు ఐఏఎస్ అధికారులకు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులను జారీ చేశారు.

కేఎల్‌హెచ్ డీమ్డ్ యూనివర్సిటీకి ఎన్ఐఆర్ఎఫ్ 22వ జాతీయ ర్యాంకు



హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రకటించే 'నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్ఐఆర్ఎఫ్)-2024' ర్యాంకుల్లో కేఎల్‌హెచ్ డీమ్డ్ యూనివర్సిటీ(హైదరాబాద్)కి జాతీయ స్థాయిలో 22వ ర్యాంకు లభించిందని ఆ యూనివర్సిటీ ఉపకులపతి పార్థసారధి వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని అత్యుత్తమ ప్రమాణాలు పాటించే విద్యాసంస్థలకు ఇచ్చే ఈ ర్యాంకుల్లో తమ వర్సిటీకి ర్యాంకు రావడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కేఎల్‌హెచ్ హైదరాబాద్ క్యాంపస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ అజీజ్‌నగర్, బౌరంపేట, కొండాపూర్ క్యాంపస్‌లలో అత్యాధునిక కోర్సులను అందుబాటులోకి తెచ్చామని వివరించారు.

కొత్త ఏడాదిలోనే పంచాయతీ ఎన్నికలు!

(మొదటి పేజీ తరువాయి)

తాజాగా చెప్పారు. దీనికి అనుగుణంగానే కుల గణన కోసం ముందుగా కొత్త బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతమున్న కమిషన్ గడువు ఆగస్టు 31వ తేదీతో ముగిసింది. కొత్త కమిషన్ చైర్మన్, సభ్యులపై సీఎం రేవంత్ ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. త్వరలో కొత్త కమిషన్‌ను ప్రకటిస్తామని ముఖ్యమంత్రి ఇటీవల మీడియాతో చెప్పారు. దీంతో పంచాయతీ ఎన్నికలు ఎప్పుడనే చర్చ రాజకీయ వర్గాల్లో ఊపందుకుంది. కాగా బీసీ కమిషన్ ఏర్పాటైన వెంటనే యుద్ధ ప్రాతిపదిక కుల గణన చేపడుతుంది. కుల గణనకు అవసరమైన విధివిధానాలు, నమూనాలు, పద్ధతులు, సర్వే ప్రశ్నలపై ప్రభుత్వం ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చినట్లు తెలిసింది. ఆయా రాష్ట్రాల్లో చేపట్టిన కుల గణనపై సమాచారాన్ని కూడా తెప్పించుకున్నారు. బిహార్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో చేపట్టిన కుల గణనపై అధ్యయనం చేశారు. కుల గణనకు అవసరమైన నిధుల్ని సమకూర్చాలని ఆర్థిక శాఖకు సమాచారాన్ని చేరవేసినట్లు తెలిసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిధుల కేటాయింపునకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పినట్లు సమాచారం. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే తన పనిలో తానుంది. వార్డుల వారిగా ఓటర్ల వివరాలు తెప్పించే పని మొదలుపెట్టింది. గురువారం జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగు సూచనలిచ్చారు.

కుల గణనకు ఎంత కాలం?

కుల గణనకు సంబంధించి ఇతర రాష్ట్రాల్లో చేపట్టిన ప్రక్రియను పరిశీలిస్తే.. తెలంగాణలో రెండు నుంచి ఆరు నెలల సమయంలో కుల గణన పూర్తి చేయవచ్చు. అయితే యుద్ధప్రాతిపదికన చేపడితే రెండు నెలల్లో పూర్తి చేయవచ్చుననే ప్రతిపాదనకు ప్రభుత్వం ఓకే చెప్పినట్లు తెలిసింది. అయితే ఈ కసరత్తునంతా బీసీ కమిషన్ ఆధ్వర్యంలో జరగాలి. అప్పుడే దానికి చట్టబద్ధత ఉంటుంది. కొత్తగా కమిషన్ ఏర్పాటు అయిన వెంటనే గణన చేపడితే ప్రక్రియ రెండు నెలల్లోపు పూర్తవుతుంది. వచ్చిన డేటాను క్షేత్రస్థాయి పరిశీలన చేసి, దాన్ని విశ్లేషించే కసరత్తు కమిషన్ చేయాల్సి ఉంటుంది. ఇది పూర్తయిన తర్వాత రిజర్వేషన్ల శాతంపై కమిషన్ ఒక నిర్ణయానికి వస్తుంది. ఈ లెక్కన సెప్టెంబరులో కమిషన్ ఏర్పాటయితే కుల గణనకు నవంబరు వరకు సమయం తీసుకునే అవకాశం ఉంది. తర్వాత ఒకటి రెండు నెలల్లో వచ్చిన సమాచారాన్ని క్రోడీకరించి రిజర్వేషన్లపై తుది అంచనాకు రావొచ్చు. అంటే డిసెంబరు, జనవరి మొదటి వారంలో ఇదంతా పూర్తయ్యే అవకాశం ఉందని ప్రభుత్వాధికారి ఒకరు చెప్పారు. ఎన్నికలకు 15 రోజుల ముందుగా షెడ్యూల్ వెలువడుతుంది. ఈ లెక్కన జనవరి నెల చివరి వరకు రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు ముగిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక రాష్ట్రంలో పూర్తి స్థాయిలో రైతు రుణ మాఫీ చేసిన తర్వాతనే పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఒకటి రెండు నెలల్లో ఈ ప్రక్రియ ను పూర్తి చేసి ఎన్నికలకు వెళ్తే.. కాంగ్రెస్‌కు ప్రజల నుంచి సానుకూలత ఉంటుందని, ఆ దిశగా ముందుకెళ్లాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

మీలాగా ఇళ్లల్లో పడుకోలేదు.. ప్రతి రోజూ ప్రజల్లో ఉంటున్నాం

» కేసీఆర్.. ఏం ముఖం పెట్టుకొని ప్రజల్లోకి వస్తావు: భట్టి



పెద్దపల్లి/గోదావరిఖని, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): "మాది ఫ్యూడల్ గవర్నమెంట్ కాదు.. పీపుల్స్ గవర్నమెంట్.. మీలాగా ఇళ్లల్లో పడుకోవడం లేదు.. ప్రతీ రోజు ప్రజల్లోనే ఉంటున్నాం.. నువ్వు, నీ కొడుకు ఈ రాష్ట్రాన్ని దోచుకుని విదేశాల్లో దాచుకున్నారు. ఏం చేశావని, ఏం ముఖం పెట్టుకుని ప్రజల్లోకి వస్తావ్ కేసీఆర్.. కాంగ్రెస్ ఉద్యోగాలు ఇస్తుందని.. సంక్షేమ పథకాలు చేపడుతుందని వద్దు అని చెప్పడానికా.. లక్ష వరకు రుణ మాఫీ చేయలేదని, డబుల్ బెడ్ రూముల ఇళ్లు, మూడు ఎకరాల భూమి, ఉద్యోగాలు ఇవ్వలేదని చెప్పడానికి వస్తావా?" అంటూ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క.. మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. శనివారం మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి పెద్దపల్లి జిల్లా రామగుండం, గోదావరిఖనిలలో ఆయన పర్యటించారు. గోదావరిఖనిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిచారు. అనంతరం అక్కడ జరిగిన సభలో భట్టివిక్రమార్క ప్రసంగించారు. తెలంగాణను మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని, విద్యుత్ అమ్మగా వచ్చిన సంపదను ప్రజలకు పంచి పెడతామని చెప్పారు. రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంటు నిర్మాణం కోసం విధాన పరమైన నిర్ణయం తీసుకున్నామని ప్రకటించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన అందిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నెల రోజుల వ్యవధిలోనే 18 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. ప్రజల్లోకి వస్తానని చెబుతున్న కేసీఆర్ ఏం చేశారని చెప్పడానికి వస్తారని ప్రశ్నించారు. పదేళ్ల పాలనలో విదేశాలకు వెళ్లి పెట్టుబడి తీసుకురాని కేసీఆర్, ఆయన కుమారుడు సంపదను దోచుకుని విదేశాల్లో దాచుకున్నారని ఆరోపించారు.

కొత్త రెవెన్యూ చట్టాన్ని.. సామాన్యులకూ అర్థమయ్యేలా రూపొందిస్తాం

» రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజలకు కూడా అర్థమయ్యే రీతిలో రెవెన్యూ చట్టాన్ని తీసుకొస్తామని ఆ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం ధరణిని రహస్యంగా ఉంచిందని, కొత్త రెవెన్యూ చట్టాన్ని తాము ప్రజలకు అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు. రెవెన్యూ చట్టం-2024 ముసాయిదాపై ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయిన నేపథ్యంలో.. చట్ట రూపకల్పనపై దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా మార్పులు తీసుకురాబోతున్నామని చెప్పారు. ముసాయిదా చట్టంపై ఆగస్టు 2న శాసన సభలో చర్చించి అదే రోజు అందరికీ అందుబాటులో పెట్టామని పొంగులేటి తెలిపారు.

డెంగీ పాజిటివ్ రేటు తగ్గింది:దామోదర

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో డెంగీ పాజిటివ్ రేటు తగ్గిందని, వ్యాప్తి తీవ్రతను అదుపులోకి తీసుకొస్తున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. వారం క్రితం వరకు 7 శాతం ఉన్న పాజిటివ్ రేటు ప్రస్తుతం 6 శాతానికి వచ్చిందన్నారు. దీన్ని మరింత తగ్గించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో భారీ వర్షాలు తగ్గే వరకు వైద్యులు, ఇతర వైద్య సిబ్బందికి సెలవులు ఇవ్వవద్దని, ప్రతీ ఒక్కరూ విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని డీఎంఈ డాక్టర్ వాణి, టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, డీహెచ్‌కు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. కాగా, రాష్ట్రంలో డెంగీ కేసుల సంఖ్య 6,242కు చేరుకుందని వైద్య ఆరోగ్య శాఖ శనివారం విడుదల చేసిన బులెటిన్‌లో తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,06,356 మంది నమూనాలు సేకరించి పరీక్షించగా, అందులో పాజిటివ్ రేటు 6 శాతంగా నమోదయిందని తెలిపింది.

పీసీ ఘోష్ కమిషన్ గడువు మరో 2 నెలలు పెంపు

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గడువును మరో రెండు నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. తాజా ఉత్తర్వుల ప్రకారం అక్టోబరు 31 తేదీలోగా నివేదిక అందించాలని కమిషన్‌ను ప్రభుత్వం కోరింది.

టీపీసీసీ సారథి మహేశ్‌కుమార్ గౌడ్?

(మొదటిపేజీ తరువాయి)

నూతన అధ్యక్షుడిని సోమవారం ఏఐసీసీ ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. టీపీసీసీకి నూతన అధ్యక్షుడి నియామకం కోసం అధిష్ఠానం పెద్దలు.. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పలుమార్లు భేటీ అయ్యారు. ఇటీవల ముగ్గురినీ ఢిల్లీకి పిలిపించుకున్న అధిష్ఠానం.. వారి నుంచి అభిప్రాయాలు తీసుకుంది. ఈ భేటీలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేత రాహుల్ , ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పాల్గొన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బీసీ జనాభాను ఆకట్టుకునేందుకు ఆ వర్గానికి చెందిన నేతను ఎంపిక చేయాలా? లేక ఎస్సీ వర్గీకరణ అంశం తెరపైకి వచ్చిన నేపథ్యంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన నేతను నియమించాలా? అన్న దానిపై అధిష్ఠానం వద్ద తర్జనభర్జన నడిచింది. దేశవ్యాప్తంగా ఒక సందేశం ఇవ్వడానికి ఎస్టీ లంబాడా వర్గం నుంచి ఎంపిక చేయాలన్న ప్రతిపాదనా రాష్ట్ర నేతల నుంచి వచ్చింది. బీసీ సామాజిక వర్గం నుంచి మహేష్ కుమార్ గౌడ్, మధు యాష్కీ, ఎంపీ సురేష్ షెట్కార్, మాజీ ఎంపీలు అంజన్ కుమార్ యాదవ్, వి.హన్మంతరావు తదితర పేర్లు చర్చలోకి వచ్చాయి. ఎస్సీ మాదిగ సామాజిక వర్గం నుంచి ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ కుమార్ పేర్లు పరిశీలించారు. ఎస్టీ లంబాడా నుంచి ఎంపీ బలరాం నాయక్ పేరు ప్రతిపాదనలో ఉంది. సీఎం రేవంత్, భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డిల అభిప్రాయాలు తీసుకున్న అధిష్ఠానం.. బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతనే టీపీసీసీ నూతన అధ్యక్షుడిగా నియమించాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. బీసీ నేతల్లో వడపోతల తర్వాత మహేష్ కుమార్ గౌడ్, మధు యాష్కీల పేర్లు తుది పరిశీలనలో నిలిచాయి. ప్రస్తుతం టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉన్న మహేష్ కుమార్ టీపీసీసీ సంస్థాగత అంశాలూ చూస్తున్నారు. విద్యార్థి దశ నుంచీ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న అధిష్ఠానం.. ప్రస్తుతానికైతే మహేష్ కుమార్ గౌడ్ వైపు కొంత మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అధిష్ఠానం వద్ద విశ్వాసపాత్రుడిగా పేరున్న మధు యాష్కీ తన వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఎవర్ని ఎంచుకోవాలనే విషయమై అధిష్ఠానం ఫ్లాష్ సర్వేలూ నిర్వహించినట్లు చెబుతున్నారు. కాంగ్రెస్ సంస్కృతిలో భాగంగా ఇరువురు నేతల మద్దతుదారులు అధిష్ఠానానికి పరస్పరం ఫిర్యాదులు ఇచ్చుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకుని టీపీసీసీ నూతన అధ్యక్షుడిపై అధిష్ఠానం తన నిర్ణయాన్ని సోమవారం ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మహేష్, యాష్కీలో అధిష్ఠానం ఎవరిని ఎంచుకుంటుంది? లేక ఇంకో పేరు తెరపైకి వస్తుందా అన్న చర్చా పార్టీలో నడుస్తోంది. టీపీసీసీకి అధ్యక్షుడిని మాత్రమే ప్రకటించి.. కార్యవర్గం కూర్పు, మంత్రివర్గ విస్తరణపైన నిర్ణయం తీసుకునేందుకు అధిష్ఠానం మరికొంత సమయం తీసుకొనే అవకాశం ఉందంటున్నారు.

హైదరాబాద్-సాగర్ మధ్య 4 లైన్ల రోడ్డు

(మొదటిపేజీ తరువాయి)

చేయాలన్నారు. ట్యాంక్‌బండ్, తెలంగాణ అమరుల జ్యోతి, నెక్లెస్ రోడ్డు, సంజీవయ్య పార్కు వరకు వలయాకారంలో స్కైవాక్ వే డిజైన్ చేయాలని సూచించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో టూరిజం హబ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం అనుభవమున్న కన్సల్టెన్సీలు, నిపుణులతో అంతర్జాతీయస్థాయి డిజైన్లు తయారు చేయించాలన్నారు. పర్యాటకులు ఆహ్లాదంగా గడిపేలా ఫుడ్ కోర్టులు, వివిధ స్టాళ్లను ఏర్పాటు చేసి, ఈ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. అలాగే, గోల్కొండ చుట్టూ ఉన్న రోడ్లన్నీ ఇరుకుగా మారాయని, ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అక్కడున్న నివాసితులు, దుకాణదారులు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వారికి మరో చోట పునరావాసం కల్పించే చర్యలు చేపట్టాలని సూచించారు.

ఆక్రమణలపై చర్యలు ఖాయం

హైడ్రా కమిషనర్ రంగనాథ్ .. పటాన్‌చెరు, అమీన్‌పూర్, ఖానామెట్‌లో పర్యటన.. చెరువుల పరిశీలన

» స్థానికుల ఫిర్యాదులతో కబ్జాలపై దర్యాప్తు

» క్షేత్రస్థాయిలో చెరువుల విస్తీర్ణంపై విచారణ

పటాన్‌చెరు/మియాపూర్/మోతీనగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రా కార్యాచరణలో దూకుడు మరింత పెరిగింది. జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో చెరువుల ఆక్రమణలు జరిగినట్లు పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తుండడంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగారు. ఫిర్యాదులు వచ్చిన చెరువుల వద్దకు స్వయంగా వెళ్లి పరిశీలించేందుకు తన బృందంతో కలిసి శనివారం సుడిగాలి పర్యటన చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు, అమీన్‌పూర్‌తోపాటు రంగారెడ్డి జిల్లా మాదాపూర్ ఖానామెట్, అల్లాపూర్‌లోని చెరువుల వద్దకు వెళ్లారు. పటాన్‌చెరులోని సాకి చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఆక్రమణల్ని పరిశీలించారు. చెరువును ఆనుకొని ఉండే శాంతినగర్ కాలనీలోని నిర్మాణాలను పరిశీలించారు. చెరువు విస్తీర్ణాన్ని దాటి..వచ్చిన నిర్మాణాలను గుర్తించాలని ఇరిగేషన్, జీహెచ్ఎంసీ సిబ్బందిని ఆదేశించారు. సాకి చెరువు విస్తీర్ణం ఎగువన ఇక్రిశాట్‌లో ఉన్న చెరువుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమీన్‌పూర్ మునిసిపాలిటీ బీరంగూడలోని శంభునికుంటను హైడ్రా కమిషనర్ సందర్శించారు. చెరువు విస్తీర్ణం, ఆక్రమణలను గుర్తించి రూపొందించిన స్కెచ్ మ్యాప్‌లోని వివరాలను ఇరిగేషన్ డీఈ రామస్వామి ద్వారా ఆరా తీశారు. శంభునికుంట ఆక్రమణలపై గతంలో గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను పరిశీలించాలని, కుంట పరిధిలోని కట్టడాలను గుర్తించి నోటీసులు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం అమీన్‌పూర్ గ్రామ శివారులోని సంబి చెరువును పరిశీలించారు. గతంలో ఇచ్చిన నోటీసులు, జరిగిన ఆక్రమణపై నివేదిక ఇవ్వాలన్నారు. మునిసిపాలిటీ పరిధిలోని మొత్తం చెరువులు, కుంటల పరిధిలో జరిగిన ఆక్రమణలు, గొలుసుకట్టు కాల్వలను పూడ్చి నిర్మించిన ఇళ్ల వివరాలతో నివేదిక సిద్ధం చేసి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.



బీరంగూడ శంభునికుంటను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

వెంకటరమణ కాలనీలో కదులుతున్న డొంక

అమీన్‌పూర్ మునిసిపాలిటీ పరిధిలోని వెంకటరమణ కాలనీ లేఅవుట్‌లో వదిలిన పార్కును, పాఠశాల స్థలాన్ని కబ్జా చేశారన్న ఆరోపణలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ దర్యాప్తు ప్రారంభించడంతో అక్రమాల డొంక కదిలింది. 1985లో సర్వే నంబర్ 151, 152లో అప్పటి హుడా అనుమతితో సుమారు 15 ఎకరాల్లో వెంకటరమణ కాలనీ మునోత్ ప్రైవేట్ ట్రస్ట్ పేరుతో లేఅవుట్ వేసి ప్లాట్లను విక్రయించారు. మొత్తం 144 ప్లాట్లను కొందరు కొనుగోలు చేశారు. తరువాత ప్లాట్ల యజమానులకు తెలియకుండా లేఅవుట్ స్థలాన్ని ఇండియన్ బ్యాంక్‌లో తనఖా పెట్టి పెద్దఎత్తున రుణాలు పొందారు. దీంతో వివాదం ఏర్పడి 40 ఏళ్లుగా కోర్టులో తగాదా నడుస్తోంది. న్యాయం కోసం ప్లాట్ల యజమానులు నేటి వరకు పోరాడుతూనే ఉన్నారు. 2021లో ప్లాట్ల యజమానులకు అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చింది. అయితే భూ మాఫియా కన్ను కాలనీలోని ఖాళీ స్థలాలు, పార్కు స్థలాలపై పడింది. ఈ క్రమంలో ధరణి పోర్టల్ అందుబాటులోకి రావడం, లేఅవుట్‌లోని స్థలాలు ఇంకా మునోత్ ప్రైవేట్ ట్రస్ట్ పేరు మీదే ఉండడం అక్రమార్కులకు వరంగా మారింది. ట్రస్ట్ యజమాని జైన్ వారసులు.. భూములను కొందరికి విక్రయించారు. ఈ వ్యవహారంలో స్థానిక ప్రజాప్రతినిధి సోదరుడు కీలకపాత్ర పోషించి సుమారు రూ.100 కోట్ల విలువైన 12 వేల గజాల స్థలాన్ని తమ పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేయించుకోవడం వివాదాస్పదంగా మారింది. కాలనీలో పార్కు, పాఠశాల కోసం వదిలిన స్థలంతోపాటు అనేక ప్లాట్లను కబ్జా చేసి డాక్యుమెంట్లను సృష్టించి అడ్డదారిలో హెచ్ఎండీఏ అనుమతులు పొందినట్లు తెలిసింది. 'గోల్డెన్ కీ' పేరుతో భారీ అపార్ట్‌మెంట్లు నిర్మిస్తూ అమ్మకాలు జరిపి పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. దీనిపై అధికారుల వద్దకు పలుమార్లు తిరిగిన ప్లాట్ల యజమానులు.. లేఅవుట్ సర్వే చేసి హద్దులు నిర్ణయించాలంటూ సర్వేకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే 'గోల్డెన్ కీ' నిర్మాణదారులు, కొందరు ప్రజాప్రతినిధులు సర్వే చేయకుండా అడ్డుకున్నారు.

పారదర్శకంగా సర్వే చేసి నిజాలు నిగ్గు తేలుస్తాం: రంగనాథ్

వెంకటరమణ కాలనీ పార్కు స్థలాల కబ్జా వ్యవహారాన్ని త్వరలోనే తేల్చేస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్లాట్ల యజమానులకు హామీ ఇచ్చారు. శనివారం లేఅవుట్‌ను పరిశీంచి బాధితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మునోత్ జైన్ ట్రస్ట్ భూముల వివాదాన్నీ త్వరలోనే తేల్చేస్తామన్నారు. త్వరలోనే డీఈ సర్వేను పూర్తి చేస్తామని, నివేదిక వచ్చాక తదుపరి చర్యలు చేపడతామని అన్నారు. సర్వేకు అడ్డంకులు లేకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. ఇదిలా ఉండగా.. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ఇరిగేషన్ శాఖ అధికారులు తప్పుదోవ పట్టించారన్న ఆరోపణలు వస్తున్నాయి. బీరంగూడలోని శంభునికుంటలో కబ్జాలు చేసి సుమారు రెండు ఎకరాల స్థలం చుట్టూ రేకుల ఫెన్సింగ్ వేసిన ఆక్రమణల్ని ఇరిగేషన్ డీఈ రామస్వామి చూపించలేదని స్థానికులు అంటున్నారు. కేవలం రోడ్డుపై నుంచి కమిషనర్ దృష్టి మళ్లించేందుకు వేరే వైపు చూపించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన కబ్జాలను చూపించకుండా ఎప్పుడో గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు నోటీసులు ఇచ్చామంటున్నారని తప్పుబడుతున్నారు. ఎవరికి కొమ్ము కాసేందుకు ఇరిగేషన్ శాఖ అధికారి ఇలా వ్యవహరించారని ప్రశ్నిస్తున్నారు.

సున్నం చెరువును పరిశీలన..

అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సున్నం చెరువు ప్రాంతాన్ని కూడా హైడ్రా కమిషనర్ రంగనాథ్ శనివారం పరిశీలించారు. సున్నం చెరువుతోపాటు చెరువు అనుబంధ కాలువలు పెద్ద ఎత్తున ఆక్రమణకు గురికావడంపై హైడ్రాకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో రంగనాథ్ దీనిని సందర్శించారు. చెరువు ఆక్రముల‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఖానామెట్‌లో ఈదులకుంట మాయం..!

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం పరిధిలోని మాదాపూర్ ఖానామెట్ గ్రామంలో కబ్జాకు గురైన ఈదులకుంటను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ప్రభుత్వ భూమి అని రెవెన్యూ రికార్డుల్లో ఉన్నా.. కుంటలోని కొంత భూమిని కొందరు తమ పేరిట పట్టా చేయించుకున్నారు. దానిని చదును చేసి.. త్వరలో భవన నిర్మాణాలు చేపట్టేందుకూ రంగం సిద్ధం చేస్తున్నారు. తాజాగా ఈ విషయాన్ని స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో కమిషనర్ రంగనాథ్ శనివారం ఈదులకుంటను సందర్శించారు. పేరులో మాత్రమే ఉన్న కుంట వాస్తవంగా కనిపించకపోవడంతో ఆయన అవాక్కయ్యారు. చెరువుకు సంబంధించి పూర్తి వివరాలు సిద్ధం చేయాలని, ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కాగా, ఖానామెట్ సర్వే నంబర్ 7లో 6.05 ఎకరాల సర్కారు భూమి ఉంది. 1954-55 పహాణి నుంచి నేటి ధరణి రికార్డుల వరకు కూడా చెరువు ప్రభుత్వ భూమి అనే ఉంది. తమ్మిడికుంట నుంచి నాలా ఈదులకుంటలోకి వస్తుంది. కానీ, కబ్జాదారులు ఈ నాలాను అక్రమంగా దారి మళ్లించారు. చెరువులోకి నీరు రాకుండా చేశారు. సర్వే నంబర్ 5లో 1.34 ఎకరాలు, సర్వే నంబర్ 8లో 1.08 గుంటలు, సర్వే నంబర్ 6లో 18 గుంటల భూమిని తమ పేరిట పట్టా చేయించుకున్నారు. అయితే ఈ మొత్తం భూమి కూడా ఈదుల కుంట చెరువు పరిధిలోకే వస్తుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. గ్రామ రెవెన్యూ మ్యాప్ కూడా సదరు నంబర్లలో ఈదులకుంట చెరువు ఉన్నట్లు చూపిస్తోంది. ఈ చెరువు గత కొన్నేళ్ల నుంచి కనుమరుగైంది.



తూము నుంచి బయటకు ప్రవహిస్తున్న నీరు

నాడెం చెరువు తూము ధ్వంసం

» దిగువకు వెళ్లిపోయిన చెరువునీరు, చేపలు

» 'బఫర్'లో నిర్మాణాలు లేవని చెప్పేందుకే...

» అనురాగ్ యూనివర్సిటీ యాజమాన్యం పనేనని ఆరోపిస్తున్న మత్స్యకారులు

» పోలీసులకు ఇరిగేషన్ ఏఈ ఫిర్యాదు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్ నాడెం చెరువు తూమును శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి నీటిని కిందికి వదిలిపెట్టారు. తాడు సాయంతో షట్టర్‌ను జేసీబీతో లాగి ధ్వంసం చేశారు. నాడెం చెరువు బఫర్ జోన్‌లో అనురాగ్ విద్యా సంస్థలు, గాయత్రి ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌కు సంబంధించిన నిర్మాణాలతో పాటు పలువురికి చెందిన హాస్టల్ భవనాలు కూడా ఉన్నాయి. హైడ్రా చర్యల నేపథ్యంలో బఫర్ జోన్ విస్తీర్ణాన్ని తగ్గించి, దానికి దూరంగా ఉన్నామని చెప్పడానికే అనురాగ్ విద్యాసంస్థల యాజమాన్యం తూమును ధ్వంసం చేసి నీటిని కిందికి విడిచిపెట్టిందని పలువురు మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. నీరు అనురాగ్ విద్యాసంస్థల పక్కన ఉన్న నారాయణరావు చానెల్‌లోకి ప్రవహించింది. నీటితో పాటు చేపలు అధిక సంఖ్యలో తూము నుంచి బయటకు వెళ్లిపోయాయి. ఇరిగేషన్ ఏఈ పరమేశ్ పోచారం ఐటీ కారిడార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తూమును ధ్వంసం చేసిన దుండగులను గుర్తించేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేశామని సీఐ తెలిపారు. కాగా, నాడెం చెరువు తూమును పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ శనివారం పరిశీలించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులో నీరు పెరిగి తమ కట్టడాల వరకు రావడంతో రాత్రికి రాత్రి అనురాగ్ విద్యా సంస్థల యాజమాన్యం తూమును ధ్వంసం చేసిందని ఆరోపించారు. బఫర్, ఎఫ్‌టీఎల్ కబ్జాలపై హైడ్రా కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

జగన్ నివాసానికి నోటీసులు అవాస్తవం:రంగనాథ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ లోటస్‌పాండ్‌లోని ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నివాసానికి హైడ్రా నోటీసులు జారీ చేసినట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. తాము ఎలాంటి నోటీసులు జారీ చేయలేదని స్పష్టం చేశారు. జగన్ నివాసం బఫర్ జోన్‌లో ఉందని, దీంతో హైడ్రా నోటీసులు జారీ చేసిందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండడంతో.. పలు మీడియా సంస్థల ప్రతినిధులు అక్కడికి వెళ్లి ఆరా తీశారు. ఈ నేపథ్యంలో రంగనాథ్ స్పందిస్తూ.. జీవో 99 ప్రకారం నోటీసులు జారీ చేసే అధికారం హైడ్రాకు లేదన్నారు. చెరువుల ఎఫ్‌టీఎల్‌లో, బఫర్‌జోన్‌లో ఉన్న న్యాయపరమైన వివాదాల్లేని నిర్మాణాలను నేరుగా కూల్చివేస్తామన్నారు.

పైకి షెడ్లు.. లోన బిల్డింగులు

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహిస్తున్నారు. స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న 13 షెడ్లను తొలగించారు. మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆక్రమణలను కూల్చివేశామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. బయటకు తాత్కాలిక నిర్మాణాల్లాగా రేకులు కనిపిస్తున్నా లోపల మాత్రం కాంక్రీట్ శ్లాబులు ఉన్నాయి. చెరువు ఎఫ్‌టీఎల్‌లో భూములు ఉండడంతో బయటకు తాత్కాలిక నిర్మాణంగా కనిపించేలా రేకులు ఏర్పాటు చేశారు. మునిసిపల్, రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారుల సమక్షంలో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరిశ్రమలో ఉన్న యంత్రాలు, ఇతర వస్తువులు తీసుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు. ఆ తరువాతే కూల్చివేతలు ప్రారంభించారు. కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా రాజేంద్రనగర్ నుంచి పోటీ చేశారు. ఆయన కుటుంబానికి ఉన్న పదెకరాల భూమి శిఖం పట్టా అని రెవెన్యూ అధికారులు చెబుతుండగా, మెట్టపట్టా అని శ్రీనివాసరెడ్డి తండ్రి శ్రీశైలంరెడ్డి చెబుతున్నారు. వీరి కుటుంబం ఇందులో 3 వేల చదరపు గజాలను ఇతరులకు విక్రయించింది. అన్నీ కలిపి మూడు ఎకరాల్లో షెడ్లు వేశారు. అందులో రెండు రెండు కార్పొరేటర్‌వే అని తెలుస్తోంది. కూల్చివేతలను అడ్డుకునేందుకు కొందరు స్థానికులు ప్రయత్నించినా పోలీస్ అధికారులు సర్ది చెప్పి పంపారు. వాటర్ ప్యాకెట్ల పరిశ్రమ నిర్వహిస్తున్న ఓ మహిళ తమ షెడ్డు కూల్చవద్దని శంషాబాద్ ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు వద్దకు వచ్చి వేడుకుంది. ఎఫ్‌టీఎల్‌లో ఉంటే మేమేం చేయలేమని ఆమెకు నచ్చచెప్పారు.

అప్ప చెరువు తెగి ఆగమాగం

గగన్‌పహడ్‌లోని సర్వేనెంబర్ 89, 90లో 17.35 ఎకరాల విస్తీర్ణంలో రైలు పట్టాలకు రెండు వైపులా అప్ప చెరువు ఉంది. వర్షపు నీరు ఒక వైపు నుంచి మరో వైపు వచ్చేలా పట్టాల కింద ప్రవాహ వ్యవస్థ ఉంది. ఓ వైపు షెడ్లు, గోదాములు నిర్మించిన స్థానికులు నీరు రాకుండా ప్రవాహ వ్యవస్థకు అడ్డుగా గోడలు నిర్మించారు. 2020లో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైన సమయంలో అప్ప చెరువు కట్ట తెగింది. వరదల్లో భారీ నష్టం సంభవించింది. చెరువు నుంచి సహజ సిద్ధంగా వెళ్లాల్సిన నీటి ప్రవాహానికి అడ్డుగా గోడలు నిర్మించడం వల్లే ఈ దుస్థితి తలెత్తింది. నీటిపారుదల శాఖ అధికారులు షెడ్లు ఉన్న వైపు కాకుండా.. చెరువుకు మరో వైపు దిగువకు నీరు వెళ్లేలా రూ.6 కోట్లతో కాలువ నిర్మించారు. మామూలు సమయాల్లో కూడా చెరువులో నీరు నిలవకుండా చేశారు. చెరువు మొత్తం కబ్జా చేసేందుకే అధికారులు, స్థానిక నాయకులు కుమ్మక్కయి ఆ కాలువ నిర్మించారని ప్రచారం జరుగుతోంది. పక్కనే ఉన్న మామిడికుంట చెరువులో ఆక్రమణలను నేడు కూల్చివేసే అవకాశముందని తెలుస్తోంది. 19.15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మామిడి చెరువులోనూ తాత్కాలిక, శాశ్వత నిర్మాణాలున్నాయి. నివాసేతర నిర్మాణాలపై హైడ్రా చర్యలు తీసుకోనున్నట్టు సమాచారం. మీరాలం ట్యాంక్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని నిర్మాణాలనూ కూల్చివేస్తారని చెబుతున్నారు.



అప్ప చెరువు ఎఫ్‌టీఎల్‌లో షెడ్లను కూల్చివేస్తున్న అధికారులు



షెడ్డును కూల్చవద్దంటూ శంషాబాద్ ఏసీపీ కె.శ్రీనివాసరావును ప్రాధేయపడుతున్న మహిళ

అరగంట సమయంలో ఎలా ఖాళీ చేసేది?

అప్ప చెరువుకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిర్ధారించకుండా కూల్చివేతలు చేపట్టారని కార్పొరేటర్ శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. దీనిపై న్యాయపరంగా పోరాడుతామన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్ నేతలు కూల్చివేతలకు పాల్పడ్డారని ఆరోపించారు. మరోపక్క, నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టారని, పరిశ్రమలలో ఉన్న సామగ్రిని, మిషనరీని కూడా తీయడానికి సమయం ఇవ్వలేదని కొన్ని పరిశ్రమల యజమానులు ఆరోపించారు. అరగంట సమయం ఇస్తే అంతలోపే ఎలా సామగ్రిని తీసుకువెళ్తామని ప్రశ్నించారు. ప్లాస్టిక్ బాటిల్‌లు తయారు చేసే తమ పరిశ్రమను కూల్చవద్దని ఓ మహిళ రోదిస్తూ పోలీసులను వేడుకుంది. తన కొడుకు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడని చెప్పింది. లక్షల రూపాయల మిషనరీ లోపల ఉందని తెలిపింది. తమకు కరెంటు బిల్లు, ట్రేడ్ లైసెన్స్, ఫుడ్ లైసెన్స్, జీఎస్‌టీ సర్టిఫికెట్ ఉన్నాయని ఆమె కుమారుడు హరన్ చెప్పారు. యంత్రాలను హైడ్రా సిబ్బంది ధ్వంసం చేశారని తెలిపారు. ఆయన ఆత్మహత్యకు ప్రయత్నించగా, పోలీసులు వారించి పక్కన కూర్చోబెట్టారు.

శ్రీరామ్‌నగర్, పద్మావతినగర్.. బస్తీ వాసులకు నోటీసులు!

అంబీర్ చెరువు, సున్నం చెరువు ఆక్రమణలతో నోటీసులు జారీ చేసిన కూకట్‌పల్లి అధికారులు

కేపీహెచ్‌బీకాలనీ/హైదర్‌నగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): చెరువులను ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్న వారికి హైడ్రా నోటీసుల పరంపర కొనసాగుతోంది. జీహెచ్ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల వారికి గత వారం రోజులుగా హైడ్రా అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. ఇందులో భాగంగా కూకట్‌పల్లి మండల పరిధిలోని శ్రీరామ్‌నగర్, పద్మావతినగర్ బస్తీవాసులకు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు. మండల పరిధిలో మొత్తం 14 చెరువులు ఉండగా.. ప్రస్తుతం ప్రగతినగర్ అంబీర్ చెరువు, అల్లాపూర్ సున్నం చెరువు ఆక్రమణలపై నోటీసులు జారీ చేశారు. రెండు చెరువుల చుట్టూ ఉన్న దిగువ మధ్యతరగతి, పేదల నివాసాలే ఉన్నాయి. అక్కడక్కడా స్లాబ్‌లతో కూడిన భవనాలు ఉన్నప్పటికీ సింహభాగం రేకుల షెడ్లు, ఒక స్లాబ్‌తో ఉన్న ఇండ్లు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి నోటీసులు అందుకున్న వీరందరికీ.. వారం రోజులుగా కంటిమీద కునుకు లేకుండా పోయింది. తాము చిన్న చిన్న పనులు చేసుకొని జీవించే వాళ్లమని, అప్పులు చేసి, సొంతూరిలో భూములు అమ్ముకొని వచ్చి స్థలాలు కొనుక్కొని.. రేకుల షెడ్లు వేసుకొని ఉంటున్నామని, ఇప్పుడు నోటీసులు ఇస్తే ఏం చేయాలో అర్థం కావడంలేదని వాపోతున్నారు. కాగా, ఈ భూములను విక్రయించిన పెద్దలను వదిలేసి పేదలపై ప్రతాపం చూపిస్తున్నారన్న విమర్శలు సర్వత్రా విన్పిస్తున్నాయి.



రామకృష్ణ ఫూల్‌సింగ్ సుదాన్ష్ రాజ్‌కుమార్

కఠిన శిక్షలు పడే కేసులు

» నేరపూరితంగా అధికారులు నకిలీ సాక్ష్యాధారాలను సృష్టించినట్లు అభియోగాలు

» నేరాలు రుజువైతే.. వారంతా జైలుకే..!

నిజాంపేట్/హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): చెరువులు, కుంటలు, నాలాలు, వాటి బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలకు అడ్డగోలు అనుమతులిచ్చిన అధికారులు ఇప్పుడు కటకటాలు లెక్కించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. హైడ్రా ఫిర్యాదుతో సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం(ఈవోడబ్ల్యూ) పోలీసులు వారిపై తీవ్రమైన అభియోగాలు మోపుతూ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. భారత న్యాయ సంహిత(బీఎన్ఎస్)లోని పలు సెక్షన్లను నమోదు చేశారు. వీటిల్లో కొన్ని.. ఈ కేసు ఇక్కడితో ఆగిపోదు.. మున్ముందు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) కూడా రంగంలోకి దిగుతుందని చెప్పకనే చెబుతున్నాయి. కొన్ని సెక్షన్లయితే.. ఏకంగా అవినీతి అధికారులు క్రిమినల్ ట్రెస్‌పాస్ చేసినట్లు స్పష్టం చేస్తున్నాయి. హైడ్రా కమిషనర్ ఏవీ రంగానాథ్ స్వయంగా సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మునిసిపల్ కమిషనర్ రామకృష్ణ, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుదాన్ష్, బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్, ల్యాండ్స్ అండ్ రికార్డ్స్ అసిస్టెంట్ శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ సుధీర్‌కుమార్, సిటీ ప్లానింగ్ ఆఫీసర్ రాజ్‌కుమార్‌ను నిందితులుగా ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి కేసు నమోదు చేయాల్సిందిగా సీసీఎస్ ఆర్థిక నేరాల విభాగం(ఈవోడబ్ల్యూ) అధికారులను ఆదేశించారు. దాంతో అధికారులు బీఎన్ఎస్‌లోని సెక్షన్లు 59(ప్రభుత్వోద్యోగి అక్రమాలకు పాల్పడడం), 49(కుట్రకు ప్రేరేపిత చర్యకు శిక్ష), 61(2)(నేరపూరితమైన కుట్రలో భాగస్వాములవ్వడం), 198(ప్రభుత్వోద్యోగి చట్టాన్ని గౌరవించకుండా ఇతరులకు హాని కలిగించే చర్యలు), 201(నకిలీ సాక్ష్యాధారాలను సృష్టించడం), 316(5)(నమ్మకాన్ని వమ్ముచేయడం), 324(3)(ప్రభుత్వ ఆస్తికి నష్టం), 329(3)(క్రిమినల్ ట్రెస్‌పాస్) కింద కేసులు నమోదు చేశారు. దర్యాప్తునకు ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దింపారు. ఎఫ్ఐఆర్‌లో ఉన్న అధికారులకు ఈవోడబ్ల్యూ భారతీయ నాగరిక్ సురక్ష సంహిత(నేర శిక్షా స్మృతి) కింద నోటీసులు జారీ చేసి, విచారణ జరపనుంది. ఒకవేళ అధికారులు తమ పరిధిని దాటి అడ్డగోలు అనుమతులు ఇచ్చినట్లు తేలితే.. వారికి శిక్ష పడే అవకాశాలున్నాయి. అంతేకాదు.. ఈ అనుమతుల వెనక రాజకీయ కోణంపైనా ఈవోడబ్ల్యూ అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

ఇతర చట్టాలతో లింకులు

సెక్షన్ 59ని ప్రయోగించడాన్ని బట్టి.. అవినీతి అధికారులపై ఏసీబీ కూడా సమాంతర దర్యాప్తు చేసే అవకాశాలున్నాయని న్యాయ నిపుణులు చెబుతున్నారు. అంటే.. ఆదాయానికి మించిన ఆస్తులు, అడ్డంగా కూడబెట్టిన సంపద చిట్టాను వెలుగులోకి తీసుకువచ్చే సూచనలు కనిపిస్తున్నాయంటున్నారు. నకిలీ సాక్ష్యాధారాలను సృష్టించినట్లు సెక్షన్ 201ను ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. అంటే.. భారతీయ సాక్ష్య సంహిత చట్టం కింద ఆధారాలను మార్చడంపైనా వీరికి కఠిన శిక్షలు ఉంటాయని తెలుస్తోంది. నమ్మకాన్ని వమ్ముచేయడం, చట్టాన్ని గౌరవించకపోవడం వంటి సెక్షన్లు తదుపరి శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు లేదా సర్వీసు నుంచి తొలగింపు వంటి తీవ్రమైన పరిణామాలకు మార్గాన్ని సుగమం చేస్తాయని, ఇతరులకు హాని కలిగించే చర్యలు(సెక్షన్ 198) ప్రకారం పర్యావరణ చట్టాల కింద.. ప్రభుత్వ ఆస్తికి నష్టం వాటిల్లేలా చేయడం వంటి అభియోగాలతో.. నిందిత అధికారులకు తగిన జరిమానాలు విధించే అవకాశాలున్నాయని న్యాయ నిపుణులు వివరిస్తున్నారు.

కృష్ణా బేసిన్‌లో హై అలెర్ట్

- శ్రీశైలానికి 3.85 లక్షల క్యూసెక్కుల వరద
- శనివారం రాత్రి 5లక్షల క్యూసెక్కుల విడుదల
- నాగార్జున సాగర్‌కు పోటెత్తుతున్న కృష్ణమ్మ
- నీటి పారుదల శాఖ ఇంజనీర్లకు సెలవులు రద్దు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు వరద పోటెత్తుతోంది. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండడంతో శ్రీశైలానికి ప్రమాదకర స్థాయిలో వరద వస్తోంది. శనివారం రాత్రి 9:53 గంటల సమయంలో అత్యధికంగా 3.85లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో అధికారులు అప్రమత్తమై 10 గేట్లను ఎత్తడం ద్వారా ఏకంగా 5.01 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 213.88 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. మరింత వరద వచ్చే అవకాశాలు ఉన్నాయన్న అంచనాలతో రిజర్వాయర్‌ను సాధ్యమైనంత మేర ఖాళీ చేసే పనిలో అధికారులు ఉన్నారు. రిజర్వాయర్ ఖాళీగా ఉంటే.. అత్యవసర పరిస్థితిలో నిర్వహణ సులభమవుతుందన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు.. రాష్ట్రంలోనూ భారీ వర్షాలు కురుస్తుండడంతో నీటి పారుదల శాఖ అప్రమత్తమైంది. రాష్ట్రంలోని ఆయా ప్రాజెక్టుల వద్ద శనివారం హైఅలెర్ట్ ప్రకటించింది. ఇటీవలి వరదలకు ఖమ్మం జిల్లాలోని పెద్దవాగు ప్రాజెక్టు కొట్టుకుపోయిన ఘటనను దృష్టిలో పెట్టుకొని.. అధికారులు, ఇంజనీర్ల సెలవులను రద్దు చేసింది. అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని సీఎస్ శాంతికుమారికి సూచించారు. అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్‌ను విడిచి పోవద్దని, ఇంజనీర్లందరూ అందుబాటులో ఉండాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. రిజర్వాయర్లు, చెరువులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని సూచించారు. కాగా, ఎగువన ఉన్న ఆల్మట్టి నుంచి పులిచింతల దాకా బేసిన్ పరిధిలోని ప్రాజెక్టుల గేట్లన్నీ ఎత్తడంతో కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి 4,74,359 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ఈ సీజన్‌లోనే ఇదే అత్యధికం కావడం గమనార్హం. దీంతో ప్రాజెక్టు 26 క్రస్టుగేట్లను 10 అడుగుల మేర ఎత్తి 4,12,078 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జల విద్యుదుత్పత్తితో కలిపి మొత్తం 4,53,700 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. మూసీ ప్రాజెక్టుకు శనివారం రాత్రి 5,500క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కావడంతో నాలుగు గేట్లను ఎత్తి 3,500 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ఇక..గోదావరి బేసిన్‌లో ఎగువన ఉన్న ప్రాజెక్టులకు వరద నిరాశజనకంగానే ఉంది. శ్రీరామ్‌సాగర్, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులకు స్వల్పంగా వరద పెరిగింది. ఎగువ గోదావరిపై మహారాష్ట్రలోని పైఠన్ వద్ద ఉన్న జైక్వాడి ప్రాజెక్టు నిండితేనే దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. 13,318 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో నాలుగు గేట్లు ఎత్తి 27,296 క్యూసెక్కులను గోదావరిలోకి వదులుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి వరద కొనసాగుతోంది. బ్యారేజీలోకి 1.40లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 85గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు.

వర్షాల ఎఫెక్ట్.. నేడు రేపు 25 రైళ్లు రద్దు: రైల్వే

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నడిచే పలు ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలపై భారీ వర్షాల ప్రభావం పడింది. దీంతో ఆది, సోమవారాల్లో వివిధ మార్గాల్లో నడవాల్సిన 25 రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, కుండపోత వర్షాల కారణంగా ముందు జాగ్రత్త చర్యలో భాగంగా పలు రైళ్లను రద్దు, కొన్ని రైళ్ల దారి మళ్లింపు సమాచారాన్ని ప్రయాణికులకు తెలియజేయడానికి దక్షిణ మధ్య రైల్వే హెల్ప్ లైన్ నెంబర్లను ప్రకటించింది. హైదరాబాద్-27781500, సికింద్రాబాద్-27786140, 27786170, కాజీపేట- 27782660, 8702576430, వరంగల్- 27782751, ఖమ్మం- 27782985, 08742-224541, 7815955306, విజయవాడ -7569305697, రాజమండ్రి- 0883-2420541, 0883-2420543



గార్ల సమీపంలోని రాంపురం చెక్‌డ్యాంపై నుంచి పొంగిపొర్లుతున్న పాకాలవాగు



ఎర్రుపాలెంలో నీట మునిగిన పత్తి చేను

వణికించిన చినుకు

(మొదటిపేజీ తరువాయి)

పొంగిపొర్లుతున్నాయి. ఫలితంగా చాలాచోట్ల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద ఉధృతికి రోడ్లు దెబ్బతిన్నాయి. అక్కడక్కడా పాత ఇళ్లు కూలిపోయాయి. వర్షాల కారణంగా జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. ఒకరు గాయపడ్డారు. మరొకరు వరద నీటిలో గల్లంతయ్యారు! ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలో 21.2 సెం.మీ వర్షపాతం నమోదైంది. నారాయణపేట జిల్లా మరికల్‌లో 13.8 సెం.మీ, యాదాద్రి జిల్లా అడ్డగూడూరులో 10.3 సెం.మీ, వరంగల్ జిల్లా దుగ్గొండిలో 9.48 సెం.మీ, కొత్తగూడెం జిల్లా చంద్రుగొండలో 9.37 సెం.మీ, నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో 8.5 సెం.మీ, ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనలో 7.8 సెం.మీ, వికారాబాద్ జిల్లా చౌదాపూర్‌లో 7 సెం.మీ వర్షపాతం నమోదైంది. సింగరేణిలో భారీ స్థాయిలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. హైదరాబాద్‌లో రోడ్లపై భారీగా వరద నీరు చేరడంతో ట్రాఫిక్ జాం నెలకొంది. వర్షాల కారణంగా హైదరాబాద్ పరిధిలోని విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటించారు. ఇతర జిల్లాల్లో పరిస్థితులను బట్టి డీఈవోలు సెలవు ప్రకటించవచ్చునని ఆదేశాలు వెళ్లాయి.

ఖమ్మంలో భారీ వర్షం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీ వర్షం కురిసింది. వందల ఎకరాల్లో పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న పంటలు నీటమునిగాయి. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలో భారీ వర్షాలతో ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలాన్ని వరద చుట్టుముట్టింది. మండలంలోని మొలుగుమాడు వద్ద ఏరు పొంగిపొర్లుతోంది. అక్కడ వాగు దాటే ప్రయత్నంలో వరద ఉధృతికి ఓ ట్రాక్టర్ కొట్టుకుపోయింది. ట్రాక్టర్ నుంచి పడిపోయి.. నీళ్లలో చిక్కుకున్న ముగ్గురిని స్థానికులు తాళ్ల సాయంతో బయటకు తీశారు. మండలంలోని నర్సింహాపురం వద్ద వాగు పొంగడంతో బైక్‌పై వెళుతున్న యువకుడు వాగులో జారిపడ్డాడు. అతడిని గ్రామస్థులు రక్షించారు. మధిర మండలం వంగవీడు చెరువు ప్రాంతంలో తోటపల్లి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి చేపల చెరువులో వల సరిచేసేందుకు వెళ్లి వరదలో చిక్కుకొని సమీపంలోని ఓ చెట్టెక్కాడు. ఇదే మండలంలోని క్రిష్ణాపురం పాలవాగు సమీపంలోని రోడ్డుపై ప్రవహిస్తున్న వాగు నీటిలో ఆర్టీసీ బస్సు చిక్కుకుంది. మామునూరు వద్ద వాగును దాటే ప్రయత్నంలో ముగ్గురు చిక్కుకుపోయారు. కామారెడ్డి జిల్లా జుక్కల్‌లో మద్దెలచెరువు వద్ద భారీ వృక్షం నేలకూలడంతో బిచ్కుంద, పిట్లం, బాన్సువాడకు గంటపాటు రాకపోకలు నిలిచిపోయాయి. వికారాబాద్ జిల్లాలో దేవరాంపల్లి, తాళ్లపల్లి, ఫతేపూర్, వెంకటాపూర్ సహా తదితర చోట్ల వాగులు ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో ఆ ప్రాంతంలో జనసంచారాన్ని కట్టడి చేసేందుకు పోలీసు సిబ్బందిని మోహరించారు. బషీరాబాద్‌లో జెడ్పీ ఉన్నత పాఠశాలలో వర్షపునీరు చేరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. వికారాబాద్ మండలం రాళ్లచిట్టంపల్లి గ్రామంలో పత్తి, కంది చేలల్లో వర్షపునీరు నిలిచింది. నల్లగొండ నేరేడుచెర్ల ప్రభుత్వ కాలేజీలోకి, చండూరులోని జెడ్పీ హైస్కూల్‌ను వరద నీరు చుట్టుముట్టింది. మహబూబాబాద్ జిల్లా గార్లలో పాకాల వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మద్దివంచ, రాంపురం సహా 11 గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా ఊట్కూరు మండలం మల్లేపల్లి వాగులో ఓ కారు కొట్టుకుపోయింది. కారును, వాహనంలోని వారిని స్థానికులు బయటకు తీశారు.



భూపాలపల్లి జిల్లా గోపాల్‌పూర్‌లో కుప్పకూలిన ఇల్లు

ముగ్గురి మృతి

కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామంలో పిడుగుపడి విద్యుత్తు వైర్లు తెగిపడ్డాయి. ఆ వైర్లను స్వాతి (18) అనే యువతి తాకడంతో విద్యుదాఘాతంతో మృతిచెందింది. జిల్లాలోని బొప్పన్‌పల్లిలో పిడుగుపాటుకు కేమ్యా అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మం జిల్లా నక్కలవాగులో భవానీపురానికి చెందిన మలిశెట్టి సాంబశివరావు అనే యువకుడు వాగులో పడి గల్లంతయ్యాడు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం నార్లాపూర్‌లో పిడుగుపాటుకు మహేశ్ (30) అనే పశువుల కాపరి ప్రాణాలు కోల్పోయాడు. వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం తాటిపాములలో ఇంటి పైకప్పు కూలి వడ్డె చంద్రయ్య (55) అనే వ్యక్తి మృతిచెందాడు.



నల్లగొండ పట్టణంలో జలమయమైన అర్బన్ హెల్త్‌సెంటర్

కోదాడ జలమయం

శనివారం రాత్రి 8గంటల నుంచి భారీ వర్షం పడటంతో సూర్యాపేట జిల్లా కోదాడ జలమయమైంది. రోడ్లు, లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపించాయి. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలు.. ఖమ్మం నుంచి కోదాడ, సూర్యాపేట నుంచి కోదాడకు వచ్చే వాహనాలు భారీ వరదకు రోడ్లపై ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వాహనాలు ముందుకు కదలక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. పట్టణంలోని శ్రీరంగాపురం వద్ద డివైడర్ నుంచి వరద పోటెత్తుతోంది. కాలనీల్లోని ఇళ్లలోకి భారీగా వరద చేరింది. విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో పట్టణమంతా అంధకారం అలుముకుంది. ఇళ్లలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్లలోంచి బయటకు రావొద్దంటూ పోలీసులు సూచించారు.

అలర్ట్.. అలర్ట్

రాష్ట్రానికి హైదరాబాద్ వాతావరణ కేంద్రం రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఆది, సోమవారాల్లో తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ, అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆదివారం ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హన్మకొండ, జనగాం, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, నల్లగొండ, సూర్యాపేట, సిద్దిపేట, యాదాద్రి , మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మెదక్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. సెప్టెంబరు 3 వరకు రాష్ట్రానికి యెల్లో అలెర్ట్ జారీ చేసింది. బంగాళాఖాతంలో అల్పపీడనం శనివారం నాటికి వాయుగుండంగా మారి వాయువ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతం అయ్యే అవకాశాలున్నాయని తెలిపింది. కాగా మరో 2-3 రోజుల పాటు వర్షాలు పడితే పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

బొగత.. నిలిపివేత

ములుగు జిల్లాలోని బొగత, లక్నవరం ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకొని.. ఈ రెండు చోట్ల, అలాగే రామప్ప సందర్శనను కూడా 48గంటలపాటు నిలిపివేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. వర్షాలు తగ్గుముఖం పట్టేంతవరకు పర్యాటకులు రావొద్దని. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని సూచించారు. సమక్క-సారలమ్మ దర్శనం కోసం మేడారం వచ్చే భక్తులు కూడా తమ ప్రయాణాన్ని ఒకరోజు వాయిదా వేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. వర్షాలు తగ్గుముఖం పెట్టే వరకూ బొగత సందర్శనను నిలిపివేస్తున్నట్లు ఎఫ్ఆర్వో రాజమౌళి చెప్పారు. మహబూబాబాద్ జిల్లా కొమ్మలవంచ అటవీ ప్రాంతంలో భీమునిపాదం జలపాతం సందర్శకులను కనువిందు చేస్తోంది.

వద్దంటే వానలు?

- సెప్టెంబరు చివరి వరకూ కొనసాగే అవకాశం
- చేతికందే పంటకు అతివృష్టితో చేటు: ఐఎండీ

న్యూఢిల్లీ, ఆగస్టు 31: దేశంలో ఆగస్టు నెలలో సాధారణం కంటే 16% అధిక వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వెల్లడించింది. వాయవ్య భారతంలో 253.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని.. 2001 నుంచి ఇదే అత్యధికమని వివరించింది. వర్చువల్‌గా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర ఈ వివరాలను వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఆగస్టు నెలలో సాధారణ వర్షపాతం 248.1 మిల్లీమీటర్లు కాగా.. ఈసారి 287.1 మిల్లీమీటర్ల మేర నమోదైనట్లు ఆయన వివరించారు. "జూన్ 1వ తేదీన దేశంలో రుతుపవనాలు ప్రవేశించినప్పటి నుంచి 749 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నిజానికి దేశ సాధారణ వర్షపాతం 701 మిల్లీమీటర్లే. హిమాలయాలకు దిగువనున్న అనేక జిల్లాలతోపాటు.. ఈశాన్య రాష్ట్రాల్లో అల్పపీడన ప్రభావం పడడంతో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. ఒక్క ఆగస్టులోనే ఆరు అల్పపీడనాలు ఏర్పడ్డాయి. వాటిలో రెండు మాత్రమే రుతుపవనాల అల్పపీడనాలు" అని ఆయన తెలిపారు. సెప్టెంబరు నెలలో కూడా సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నట్లు తెలిపారు. వాయవ్య భారతంలో ఎక్కువ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు పేర్కొన్నారు. ఉత్తర భారతంలోని బిహార్, ఈశాన్య ఉత్తరప్రదేశ్, ఈశాన్య రాష్ట్రాల్లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యే సూచనలున్నట్లు వెల్లడించారు. సెప్టెంబరులో సాధారణ వర్షపాతం 167.9 మిల్లీమీటర్లుగా ఉంటుందని, ఈ సారి మాత్రం 109 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని చెప్పారు.

పంటలకు చేటు..

రుతుపవనాలు సెప్టెంబరు చివరి వరకూ కొనసాగే అవకాశాలున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దీనికి అల్పపీడనాలు తోడవ్వడంతో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతోందని.. అయితే.. ఇది రైతులకు చేటు అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వరి, పత్తి, సోయాబీన్, మొక్కజొన్న, పప్పుధాన్యాలు చేతికొచ్చే సమయంలో అసాధారణ వర్షాలు నష్టాన్ని కలిగించే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు.

పశ్చిమ దిశగా..

పశ్చిమ రాష్ట్రాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్నా.. ఇది రుతుపవనాల దిశాత్మక మార్పునకు సంకేతమని విశ్లేషకులు చెబుతున్నారు. గుజరాత్‌లో లోతట్టు ప్రాంతాలు జలమయమవ్వడం.. రాజస్థాన్‌లో కూడా భారీ వర్షాలతో ఇలాంటి పరిస్థితే నెలకొనడాన్ని బట్టి.. రుతుపవనాల తీరు మారుతోందనే ఆందోళనలు పెరుగుతున్నాయని స్పష్టం చేస్తున్నారు.

ఏపీలో కుండపోత

- రోజంతా ఎడతెరిపి లేకుండా జడివాన
- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు
- వంతెనలపై ఉధృతంగా వరద ప్రవాహం
- భారీ వర్షాలకు తొమ్మిది మంది బలి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఏపీలో శనివారం రాష్ట్రవ్యాప్తంగా కుండపోతగా వర్షం పడింది. ఉదయం నుంచి కురిసిన జడివానతో కోస్తా, రాయలసీమ జిల్లాలు తడిసి ముద్దయ్యాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరద నీటితో వాగులు, వంకలు పరవళ్లు తొక్కుతున్నాయి. పంటలు ముంపుబారిన పడ్డాయి. భారీవర్షాలకు కొండ చరియలు విరిగిపడిన ఘటనల్లో ఆరుగురు, వాగులో కారు కొట్టుకొని పోవడంతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఎన్నడూ లేనివిధంగా కాజా టోల్‌ప్లాజా వద్ద నడుం లోతున వరదనీరు ప్రవహించడంతో హైవే బ్లాక్ అవడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా 62,550 హెక్టార్లలో పంట ముంపుబారిన పడినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. రాష్ట్రంలోని 16 ప్రాంతాల్లో 100 మి.మీ.పైగా వాన కురిసింది.. భారీవర్షాల నేపథ్యంలో కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, వర్షాలు, వరద పరిస్థితిని అధికారులు సమీక్షిస్తున్నారు. పలు జిల్లాల్లో పాఠశాలలకు విద్యాశాఖ సెలవు ప్రకటించింది. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో కాకినాడ పోర్టు నుంచి మూడోరోజు కూడా విదేశాలకు బియ్యం ఎగుమతులు నిలిచిపోయాయి.



ఏలూరు జిల్లా నూజివీడులోని పెద్దచెరువుకు గండి పడడంతో ఇళ్లల్లో చిక్కుకున్న వారిని తాళ్లసాయంతో బయటకు తీసుకొస్తున్న దృశ్యం



విజయవాడ బస్టాండ్ వద్ద రహదారిపై నిలిచిన వర్షపు నీరు

బెజవాడలో రికార్డు వర్షం

విజయవాడలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షం గత ఐదు దశాబ్దాల కాలంలోనే అత్యధికమని 'ఏపీ వెదర్‌మాన్'లో పోస్టు చేయడం సంచలనం సృష్టిస్తోంది. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో కురిసిన వర్షం గత 200 సంవత్సరాల్లో ఎప్పుడూ నమోదు కాలేదని ఆ పోస్టులో పేర్కొన్నారు. అయితే దీనిపై ఇప్పటికిప్పుడు ఏమీ చెప్పలేమని, పాత రికార్డులు పరిశీలించాల్సి ఉందని జిల్లా యంత్రాంగం చెబుతోంది. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు రికార్డు స్థాయిలో వర్షం పడింది. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో అత్యధికంగా 174.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. శనివారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 125.4 మి.మీ. నమోదైంది. ఈ రెండూ ఆల్‌టైమ్ రికార్డుగా చెబుతున్నారు.

కుండపోతగా కురిసిన వర్షాలు ఏపీలో తొమ్మిది మంది ప్రాణాలను బలిగొన్నాయి. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం ఉప్పలపాడు వాగులో కారు కొట్టుకుపోయి ప్రైవేటు స్కూల్ ఉపాధ్యాయుడు నడింపల్లి రాఘవేంద్రరావు(40), విద్యార్థులు కోడూరి మాణిక్(9), పసుపులేటి శౌరీ(9) మరణించారు. నంబూరులోని ప్రైవేటు పాఠశాలకు ఉదయం స్కూల్ బస్సులోనే విద్యార్థులు మాణిక్, శౌరీ వచ్చారు. అయితే పాఠశాలకు సెలవు ప్రకటించడంతో ఉప్పలపాడులోని వారి ఇళ్ల వద్ద దింపుతానంటూ అదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు రాఘవేంద్రరావు తన కారులో వారిద్దరినీ ఎక్కించుకున్నారు. మధ్యలో వాగు ఉధృతికి కారు కొట్టుకుపోయి ముగ్గురూ మరణించారు.

ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశాకు ఆనుకుని పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో ఉన్న తీవ్ర అల్పపీడనం బలపడి శనివారం ఉదయానికి వాయుగుండంగా మారింది. ఉదయం నుంచి నెమ్మదిగా గంటకు ఆరు నుంచి ఎనిమిది కిలోమీటర్ల వేగంతో కదులుతూ ఉత్తరాంధ్ర తీరం దిశగా పయనిస్తోంది. సాయంత్రానికి విశాఖపట్నానికి తూర్పు ఈశాన్యంగా 90 కి.మీ., కళింగపట్నానికి 30 కి.మీ. దక్షిణ నైరుతిగా కేంద్రీకృతమై ఉంది.

కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయండి:సీఎస్

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నందున... ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా కలెక్టర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. వర్షాలపై శనివారం ఆమె సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తెలంగాణతో పాటు రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని, ఎలాంటి ఆకస్మిక విపత్తు ఎదురైనా... సమర్థంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని సీఎస్ చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. కలెక్టరేట్లు, జీహెచ్ఎంసీ, సచివాలయంలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఉధృతంగా పారే వాగుల వద్ద ఒక అధికారిని ప్రత్యేకంగా నియమించి పర్యవేక్షించాలని చెప్పారు. వర్షాల దృష్ట్యా జిల్లాల్లో పాఠశాలలకు సెలవులను ప్రకటించే నిర్ణయాధికారం కలెక్టర్లదేనని అన్నారు. భారీ వర్షాలపై ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలను చైతన్యపర్చాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో మంచినీటి ట్యాంకులు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలు హైదరాబాద్, విజయవాడలలో ఉన్నాయని, వీటి సహకారం కావాలనుకుంటే వెంటనే పంపిస్తామని అన్నారు. గోదావరి, కృష్ణా నదుల పరివాహక ప్రాంతాల్లోని జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో మ్యాన్‌హోల్స్‌ను తెరవకుండా చూసుకోవాలన్నారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పోలీస్ కమీషనర్లు, ఎస్పీలను అప్రమత్తం చేశామని తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No. 70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● ఆదివారం 1 సెప్టెంబరు 2024
diksuchi@andhrajyothy.co

జయశంకర్ వర్సిటీలో..

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)- ఎంపీసీ స్ట్రీమ్ కింద నిర్వహిస్తున్న బీటెక్ ప్రోగ్రామ్‌లలో మిగిలిన కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తోంది. అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, ఫుడ్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లలో సీట్లు ఉన్నాయి. టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ఇంకా సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. స్పాట్ అడ్మిషన్స్ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు ఫీ రీయింబర్స్‌మెంట్ వర్తించదు.

సీట్ల వివరాలు
- సంగారెడ్డి జిల్లా-కందిలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 13 సీట్లు ఉన్నాయి.
- నిజామాబాద్ జిల్లా-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లో 4 సీట్లు ఉన్నాయి.

అర్హత : గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. గ్రూప్ సబ్జెక్టుల్లో కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. రిజర్వ్‌డ్ అభ్యర్థులకు 40 శాతం చాలు. తెలంగాణ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం
- **ప్రాసెసింగ్ ఫీజు:** టీజీ ఈఏపీసెట్ 2024 స్కోర్ ఉన్నవారికి రూ.1300; టీజీ ఈఏపీసెట్ 2024 స్కోర్ లేనివారికి రూ.2100
- **స్పాట్ కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 2న ఉదయం పదిన్నరకు
- **కౌన్సెలింగ్‌కు తీసుకురావాల్సిన పత్రాలు:** పదోతరగతి ఒరిజినల్ మెమో, ఇంటర్ మార్కుల పత్రాలు, స్టడీ సర్టిఫికెట్లు, టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం తదితరాలు
- **వేదిక:** ఎగ్జామినేషన్ సెంటర్, పీజేటీఎస్ఏయూ, రాజేంద్రనగర్, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in



స్పాట్ అడ్మిషన్స్

తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం(ఎన్ఎస్‌యూ-సెంట్రల్ యూనివర్సిటీ)- పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లలో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ నోటిఫికేషన్ విడుదల చేసింది. పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో సీట్లు ఉన్నాయి.

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో..

పీజీ డిప్లొమా

ప్రోగ్రామ్‌లు: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. స్పెషలైజేషన్‌ను అనుసరించి ఆంగ్లం, సంస్కృతం, తెలుగు మాధ్యమాల్లో బోధన ఉంటుంది. ఉదయం, సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు.

అర్హత: యోగా థెరపీ అండ్ స్ట్రెస్ మేనేజ్‌మెంట్, యోగా విజ్ఞాన ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. సంస్కృతం ఒక సబ్జెక్ట్‌గా చదివినవారికి/సంస్కృతంలో ప్రావీణ్యం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. అభ్యర్థులందరూ ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి. అభ్యర్థుల వయసు ఆగస్టు 15 నాటికి 40 ఏళ్లు మించకూడదు. కర్మకాండలో ప్రవేశానికి సంబంధిత డిప్లొమా; నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్‌కు ఆచార్య లేదా సంస్కృతంలో పీజీ పూర్తిచేసి ఉండాలి. వెబ్ టెక్నాలజీకి ఆచార్య/విద్యార్థి చదువుతున్నవారు అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

డిప్లొమా ప్రోగ్రామ్‌లు: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. గరిష్ఠంగా రెండేళ్లలో పూర్తిచేయాలి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు.

అర్హత: టెంపుల్ కల్చర్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఏదేని డిగ్రీతోపాటు టెంపుల్ కల్చర్‌లో సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసినవారు లేదా ఏదేని పీజీ ఉత్తీర్ణులు; కర్మకాండ, జ్యోతిషం&వాస్తు ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత సర్టిఫికెట్ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు లేదా ప్రాక్ శాస్త్రి ఉత్తీర్ణులు అర్హులు. వయోపరిమితి నిబంధనలు లేవు. ట్రాన్స్‌లేషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు సంస్కృతంలో ప్రావీణ్యం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు ఆగస్టు 15 నాటికి 20 ఏళ్లు నిండి ఉండాలి.

సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. గరిష్ఠంగా రెండేళ్లలో పూర్తిచేయవచ్చు. వారానికి మూడు రోజులు సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు తరగతులు ఉంటాయి. ఆంగ్లం, సంస్కృతం, తెలుగు మాధ్యమాల్లో బోధిస్తారు.

అర్హత: టెంపుల్ కల్చర్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు; కర్మకాండ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు సంస్కృతంలో పరిజ్ఞానం ఉన్నవారు; జ్యోతిషం, కమ్యూనికేటివ్ అండ్ ఫంక్షనల్ శాంస్క్రిట్, ట్రాన్స్‌లేషన్, మ్యూజిక్(ఓకల్), డ్యాన్స్(భరతనాట్యం), సితార్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి పదోతరగతి ఉత్తీర్ణులు అర్హులు. వయోపరిమితి నిబంధనలు లేవు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **వెబ్‌సైట్:** www.nsktu.ac.in

ఎన్ఐఐలో పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యూనాలజీ(ఎన్ఐఐ)- పీహెచ్‌డీ 2024-25 వింటర్ సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. కంప్యూటర్ బేస్డ్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.37,000ల జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) ఇస్తారు. పూర్తి సమాచారం కోసం ఆగస్టు 31 నాటి ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ చూడవచ్చు.

స్పెషలైజేషన్‌లు: ఇమ్యూనాలజీ, ఇన్ఫెక్షియస్ అండ్ క్రానిక్ డిసీజ్ బయాలజీ, మాలిక్యులర్ అండ్ సెల్యులర్ బయాలజీ, కెమికల్ బయాలజీ, స్ట్రక్చరల్ బయాలజీ, కంప్యూటేషనల్ బయాలజీ.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎమ్మెస్సీ(బయాలజీ/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/ఫిజిక్స్)/ఎంటెక్/ఎంబీబీఎస్/ఎంఫార్మసీ/ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు ఇంటర్, డిగ్రీ స్థాయుల్లో కనీసం 60 శాతం మార్కులు, పీజీ స్థాయిలో 55 శాతం మార్కులు ఉండాలి. సీఎస్ఐఆర్/యూజీసీ/ఐసీఎంఆర్/డీబీటీ/డీఎస్‌టీ ఫెలోషిప్‌లను అనుమతిస్తారు.



ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** సెప్టెంబరు 3 నుంచి
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 23
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** అక్టోబరు 7 నుంచి
- **ఎన్ఐఐ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్:** అక్టోబరు 27న
- **ఎంట్రెన్స్ ఫలితాలు విడుదల:** నవంబరు 10న
- **ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు:** నవంబరు 26 నుంచి డిసెంబరు 3 వరకు
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** 2025 జనవరి 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.nii.res.in

మౌలానా ఆజాద్ వర్సిటీలో సివిల్స్ శిక్షణ



హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ కోచింగ్ అకాడమీ(ఆర్‌సీఏ)- సివిల్స్ కోచింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఉద్దేశించిన ఎంట్రెన్స్ టెస్ట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఏదేని డిగ్రీ పూర్తిచేసి సివిల్ సర్వీసెస్(ప్రిలిమినరీ-మెయిన్స్) 2025 ఎగ్జామ్‌లకు సన్నద్ధమౌతున్న మహిళలు, మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ పరీక్ష రాయవచ్చు. పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. మొదటిది జనరల్ స్టడీస్ పేపర్. ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. రెండో పేపర్ ఎస్సే టైప్‌లో ఉంటుంది. ఈ పరీక్షలో అర్హత సాధించినవారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ఉచిత శిక్షణతోపాటు వసతి సౌకర్యం కల్పిస్తారు.

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 20
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** సెప్టెంబరు 29
- **ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాలు విడుదల:** అక్టోబరు 4
- **ఇంటర్వ్యూలు:** అక్టోబరు 15 నుంచి 18 వరకు
- **ఇంటర్వ్యూ ఫలితాలు విడుదల:** అక్టోబరు 21
- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** అక్టోబరు 25
- **తరగతులు ప్రారంభం:** అక్టోబరు 28
- **రిజిస్ట్రేషన్ లింక్:** manuu.gleamapp-store.com/
- **వెబ్‌సైట్:** www.manuu.edu.in

యోగా ఇన్‌స్టిట్యూట్‌లో ట్రెయినింగ్ ప్రోగ్రామ్

న్యూఢిల్లీలోని మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా(ఎండీఎన్ఐవై)- ఆన్‌లైన్ రెగ్యులర్ యోగా ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది హెల్త్ ప్రమోషన్ ప్రోగ్రామ్. దీని వ్యవధి ఒక నెల. ఉదయం ఏడు నుంచి ఎనిమిది వరకు మొదటి బ్యాచ్, ఎనిమిది నుంచి తొమ్మిది వరకు రెండో బ్యాచ్ ప్రోగ్రామ్‌లు ఉంటాయి. అలాగే సాయంత్రం ఆరు నుంచి ఏడు వరకు, మరల ఏడు నుంచి ఎనిమిది వరకు బ్యాచ్‌లు ఉంటాయి. ఆసక్తిగలవారందరూ దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం
- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.750
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 5
- **వెబ్‌సైట్:** www.yogamdniy.nic.in

ఐటీబీపీలో హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ పోస్టులు

మొత్తం ఖాళీలు: 128

కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ)... నాన్ గెజిటెడ్(నాన్ మినిస్టీరియల్) గ్రూప్-సి విభాగంలో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు
1. హెడ్ కానిస్టేబుల్(డ్రెస్సర్ వెటర్నరీ)(పురుషులు/మహిళలు): **9 పోస్టులు**
2. కానిస్టేబుల్(యానిమల్ అటెండెంట్)(పురుషులు/మహిళలు): **115 పోస్టులు**
3. కానిస్టేబుల్(కెన్నెల్‌మన్)(పురుషులు మాత్రమే): **4 పోస్టులు**

అర్హత: హెడ్ కానిస్టేబుల్ పోస్టులకు 12వ తరగతి, వెటర్నరీలో సర్టిఫికెట్/డిప్లొమా కోర్సు; కానిస్టేబుల్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణతతోపాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి.

వయోపరిమితి: 2024 సెప్టెంబరు 10 నాటికి హెడ్ కానిస్టేబుల్(డ్రెస్సర్ వెటర్నరీ), కానిస్టేబుల్(కెన్నెల్‌మన్) పోస్టులకు 18-27 ఏళ్లు; కానిస్టేబుల్(యానిమల్ అటెండెంట్) పోస్టులకు 18-25 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, రాత పరీక్ష, డిటైల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్, రివ్యూ మెడికల్ ఎగ్జామినేషన్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

పే స్కేల్: హెడ్ కానిస్టేబుల్‌కు రూ.25,500. కానిస్టేబుల్‌కు రూ.21,700.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 29

వెబ్‌సైట్: https://itbpolice.nic.in/

సీఐఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్/ఫైర్ పోస్టులు



మొత్తం ఖాళీలు: 1130

కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)...కానిస్టేబుల్/ఫైర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. పురుషులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఆంధ్రప్రదేశ్‌లో 32, తెలంగాణలో 26 ఖాళీలు ఉన్నాయి.

పోస్టు: కానిస్టేబుల్/ఫైర్(పురుషులు)

మొత్తం ఖాళీల సంఖ్య: యూఆర్-466, ఈడబ్ల్యూఎస్-114, ఎస్సీ-153, ఎస్టీ-161, ఓబీసీ-236

అర్హత: అభ్యర్థులు తప్పనిసరిగా గుర్తింపు పొందిన బోర్డు/యూనివర్సిటీ నుంచి 12వ తరగతి సైన్స్ సబ్జెక్టులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఈఎస్ఎం/ఓబీసీలకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.

వయోపరిమితి: 2024 సెప్టెంబరు 30 నాటికి 18 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలి.

శారీరక ప్రమాణాలు: ఎత్తు కనీసం 170 సెం.మీ., ఛాతీ 80-50 సెం.మీ. ఉండాలి.

జీతభత్యాలు: నెలకు రూ.21,700 - రూ.69,100

ఎంపిక ప్రక్రియ: ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్(పీఎస్‌టీ), ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్(పీఈటీ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, రాత పరీక్ష(ఓఎమ్మార్/సీబీటీ), డిటైల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్, రివ్యూ మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా.

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, ఈఎస్ఎం అభ్యర్థులకు దరఖాస్తు రుసుము చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

రాత పరీక్ష విధానం: పరీక్షను ఓఎమ్మార్/కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు. 100 ప్రశ్నలు ఉంటాయి. 100 మార్కులు కేటాయించారు. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్(25 ప్రశ్నలు - 25 మార్కులు), జనరల్ నాలెడ్జ్ అండ్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు - 25 మార్కులు), ఎలిమెంటరీ మేథమెటిక్స్(25 ప్రశ్నలు - 25 మార్కులు), ఇంగ్లీష్/హిందీ(25 ప్రశ్నలు - 25 మార్కులు). నెగెటివ్ మార్కింగ్ విధానం లేదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 30

వెబ్‌సైట్: cisfrectt.cisf.gov.in/

'ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్'లో ఉద్యోగాలు

మొత్తం ఖాళీలు: 37

నోయిడాలోని ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐడబ్ల్యూఏఐ)... డైరెక్ట్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు
1. అసిస్టెంట్ డైరెక్టర్: **2 పోస్టులు**
2. అసిస్టెంట్ హైడ్రోగ్రాఫిక్ సర్వేయర్: **1 పోస్టు**
3. లైసెన్స్ ఇంజన్ డ్రైవర్: **1 పోస్టు**
4. జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్: **5 పోస్టులు**
5. డ్రెడ్జ్ కంట్రోల్ ఆపరేటర్: **5 పోస్టులు**
6. స్టోర్ కీపర్: **1 పోస్టు**
7. మాస్టర్ సెకండ్/థర్డ్ క్లాస్: **4 పోస్టులు**
8. స్టాఫ్ కార్ డ్రైవర్: **3 పోస్టులు**
9. మల్టీ టాస్కింగ్ స్టాఫ్: **11 పోస్టులు**
10. టెక్నికల్ అసిస్టెంట్: **4 పోస్టులు**


అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మెట్రిక్యులేషన్, డిప్లొమా, డిగ్రీ(మెకానికల్/సివిల్/మెరైన్/నావల్/ఆర్కిటెక్చర్)ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు ఫీజు: జనరల్ రూ.500; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు రూ.200.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 21

వెబ్‌సైట్: https://iwai.nic.in/





మీకు తెలుసా?

- రాళ్లల్లో కలిసిపోయినట్లుండే.. చూడగానే రాయిలా కనిపించే ఈ చేపను 'స్టోన్ ఫిష్' అని పిలుస్తారు.
- ప్రపంచంలో ఉండే విషప్రాణుల్లో ఇవి ప్రమాదకరం. పాముకాటులానే ఉంటుంది. నొప్పి, రక్తస్రావంతో పాటు నాడుల మీద పనిచేసి కిందపడిపోవటం, గుండెపోటు లాంటివి సంభవిస్తాయి.
- 40 సెం.మీ ఉండే ఈ చేప ఎరుపు, పసుపు, నలుపు ఇలా వివిధ రంగుల్లో కనిపిస్తుంది. వాతావరణానికి తగినట్లు రంగుమారుతుంది. రాళ్లమధ్యలో ఉంటే రాయిలానే ఉంటుంది.
- ఈ విషంతో ఇతర చిన్న జీవులను చంపి ఆరగిస్తుంది. ఇవి



నెమ్మదిగా ఈదుతాయి. అయితే దాడి చేయాలనుకుంటే మాత్రం 0.015 సెకన్స్‌లోనే అవతలి జీవిని కొరికేస్తుంది.
- నీళ్ల బయట పడితే రోజుపాటు జీవించగలవు. వీటి శరీరంపై ఉండే ప్రత్యేక కణ నిర్మాణం వల్లే ఇలా జీవించగలుగుతాయి.
- ఇవి ఇండో పసిఫిక్ ప్రాంతాల్లో అధికంగా ఉంటాయి. బరువు సుమారు రెండు కేజీలుంటాయి.
- వీటిని సముద్రంలోని పాములు వేటాడి తింటాయి. వీటి జీవనకాలం 5 సంవత్సరాలనుంచి 10 ఏళ్ల వరకూ!
- ఏదైనా జీవి తన దగ్గరకు వస్తోందంటే తెలివిగా నటిస్తాయి. రాళ్లలో కలిసిపోయి కదలకుండా ఉంటాయి. చనిపోయిందేమోనన్న అనుమానం కలిగేలా ఉంటుంది. అయితే దాన్ని ఏ జీవి అయినా కెలికితే మాత్రం దాడి చేస్తుంది.

8 తేడాలను కనిపెట్టండి







దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 399

	4	8		9		1		3
9		1	3				6	
6			4					2
7	8				5	6		
		5	9				7	8
5					3			6
	2				9	3		5
3		7		6		8	4	

సుడోకు - 398 సమాధానం

4	1	5	7	6	8	3	2	9
6	9	2	3	1	4	5	7	8
8	7	3	9	5	2	4	6	1
1	5	7	2	4	6	9	8	3
2	6	9	8	3	5	7	1	4
3	8	4	1	9	7	6	5	2
7	3	6	4	8	1	2	9	5
5	4	1	6	2	9	8	3	7
9	2	8	5	7	3	1	4	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.